మంగళవారం
24•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 269
• పేజీలు : 12 + 8

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## లాక్‌డౌన్ డే-1

• పల్లె స్ఫూర్తి

• పట్నంలో నాస్తి!







ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. అందువల్ల మేమెవ్వరం ఊరు కదలం. మా ఊరికీ ఎవరూ రావద్దు. అత్యవసరంగా రావాలనుకుంటే సర్పంచ్ లేదా గ్రామ కార్యదర్శి అనుమతి తీసుకోవాలి.. ఇదీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా గండికామారం గ్రామస్థులు ఇస్తున్న సందేశం. లాక్‌డౌన్ సూచకంగా వారు గ్రామంలోకి వచ్చే రహదారిపై ఇనుప కంచె కూడా వేసుకున్నరు.

జనతా కర్ఫ్యూను విజయవంతం చేసి, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసలు అందుకొని రోజైనా గడవలేదు. ఇండ్లలోనే ఉండాలని సీఎం విజ్ఞప్తి చేసి గంటలైనా కాలేదు. హైదరాబాదీలు అప్పుడే కడప దాటిన్రు. తెల్లారగానే వాహనాలు వేసుకొని గుంపులు గుంపులుగా రోడ్లపై పడ్డరు. పోలీసులు దండం పెడుతున్నా పట్టించుకోకుండా ప్రయాణాలు మొదలుపెట్టిన్రు.

**నిజానికి** కరోనా వైరస్ ముప్పు పల్లెల్లో పెద్దగా లేదు. హైదరాబాద్‌లోనే దాని ప్రభావం ఎక్కువ. అయినా హైదరాబాదీలు దాని తీవ్రతను గుర్తించినట్టు లేరు. మనకేమైతదిలే అనే నిర్లక్ష్యం వద్దనీ, కొంప మునిగే దాకా చూడొద్దనీ, తమ ప్రాణాలను, కుటుంబాలను, రాష్ట్రాన్ని రిస్కులోకి నెట్టొద్దని ముఖ్యమంత్రి ఎంత చెప్తున్నా కొందరి చెవికి ఎక్కడం లేదు. తాము ప్రమాదంలో పడుతూ, ఇతరులనూ నెడుతున్నరు. లాక్‌డౌన్‌ను సమర్థంగా అమలుచేయడం ద్వారానే చైనా కరోనా వైరస్‌పై విజయం సాధించగలిగింది. లాక్‌డౌన్‌ను సరిగా అమలు చేయలేక ఇరాన్, ఇటలీ, స్పెయిన్ వంటి దేశాలు పెను విపత్తులో చిక్కుకున్నాయి.

**ఇకనైనా మనం మేల్కొందామా? కొంచెమైనా పౌర విజ్ఞత చూపిద్దామా?**

# తిరిగితే తిప్పలే

### తోటివారికీ బతికే అవకాశం ఇవ్వాలి

#### ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి



**తెలంగాణ** ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌కు ప్రజలందరూ సహకరించాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తిచేశారు. 'లాక్‌డౌన్ అనేది చాలా అరుదుగా తీసుకొనే చర్య. ప్రభుత్వం అంత తీవ్రమైన నిర్ణయం తీసుకున్నదంటే పరిస్థితిని అర్థంచేసుకోవాలి. నువ్వు బతకడానికి, తోటివారికి బతికే అవకాశం ఇవ్వాలి. ఈ వైరస్ అంతమయ్యే వరకూ స్వీయక్రమశిక్షణ పాటించాల్సిందే' అంటూ సోమవారం ట్వీట్‌చేశారు.

### రాత్రి 7 నుంచి ఉదయం 6 వరకు కర్ఫ్యూ


దుకాణాలు సాయంత్రం 6.30కి మూసివేయాలి

ద్విచక్ర వాహనంపై ఒక్కరు, కారులో ఇద్దరికే అనుమతి..

అదీ అత్యవసర సమయాల్లోనే..

**ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు.. కఠిన చర్యలు**

# నిర్లక్ష్యమే వైరస్!



### జనతా కర్ఫ్యూ స్ఫూర్తిని చూపని జనం

**లాక్‌డౌన్‌లోనూ రోడ్డెక్కిన వందలవాహనాలు**

**రాజధాని రోడ్లలో బైక్‌లపై యువత చక్కర్లు**

**బంద్ అని తెలిసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో పడిగాపులు**

*అంతఃపురంలో వేడుకల కోసం రాజ్యంలోని ప్రజలందరూ బిందెడు పాలు తీసుకొచ్చి గోళాల్లో పోయాలని చాటింపు వేశారట.. తమ ప్రజలే కదా అందరూ తెచ్చిన పాల నురగలతో కడవలన్నీ పొంగిపొర్లుతాయని భావించారట రాజుగారు.. తీరా చూస్తే కడవలన్నీ నీళ్లతో నిండినయి కానీ పాలు మాత్రం కన్పించలేదట.. అందరూ పాలు పోస్తారు.. నేనొక్కడిని నీళ్లు పోస్తే ఏమవుతుందిలే అని ఒక్కొక్కరు తమకుతామే అనుకోవడంతో కడవలన్నీ నీళ్లతో నిండాయనేది ఆ కథ సారాంశం. ప్రస్తుతం కరోనా వైరస్‌వ్యాప్తి నిరోధానికి ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్‌ను కొందరు ఇదేతీరులో భగ్నం చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై జనం యథేచ్ఛగా తిరిగారు. నేనొక్కడినే బయటకొస్తే ఏమవుతుందని అనుకోవడంతో రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి.*

4

**కరోనా** విశ్వమారిని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు ప్రభుత్వం అత్యంత తీవ్రమైన చర్యలకు ఉపక్రమించింది. ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ ప్రకటించిన సర్కార్.. దాన్ని కచ్చితంగా అమలుచేసే దిశగా నిబంధనలను మరింత కఠినతరంచేసింది. నిబంధనలను అతిక్రమించి.. ఇండ్ల నుంచి బయటకు వచ్చి తిరిగితే తిప్పలు తప్పవని హెచ్చరించింది. మార్గదర్శకాలను ఏ మాత్రం ఉల్లంఘించినా కేసులు పెట్టడంతోపాటు కఠినచర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం 6 గంటలవరకు సంపూర్ణంగా కర్ఫ్యూ అమల్లోకి తెచ్చారు. ఉదయం ఆరు తర్వాత పరిమితంగానే అనుమతించాలని నిర్ణయించారు. అత్యంత ముఖ్యమైన అవసరాలకోసం ఇంటినుంచి ఒక్కరు మాత్రమే బయటికి వచ్చేందుకు అవకాశమిస్తారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు బయటకు వస్తే వెంటనే సీజ్ చేస్తారు. అదేసమయంలో అత్యవసరసేవలకు అంతరాయం కలుగకుండా పర్యవేక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటుచేశారు. విదేశాలనుంచి వచ్చినవారు ఎట్టి పరిస్థితుల్లోనూ క్వారంటైన్‌లో ఉండాలని.. బయటకు రావద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు.



### విదేశాలనుంచి వచ్చినవారికోసం రాష్ట్రవ్యాప్తంగా జల్లెడ

- హోం క్వారంటైన్‌లో 7500 మంది
- సెల్ఫ్ ఐసొలేషన్‌లో 800 మంది టెకీలు
- నేటినుంచి సీసీఎంబీలో కొవిడ్-19 పరీక్షలు
- రోజుకు 500 శాంపిళ్ల పరీక్షల సామర్థ్యం

### తెలంగాణ - ఏపీ సరిహద్దులు మూసివేత

- రాష్ట్రవ్యాప్తంగా భారీగా వాహనాలు సీజ్
- పెట్రోల్ బంకుల్లో కఠిన నిబంధనలు

### ఇంటివద్దకే అంగన్‌వాడీ సరుకులు

- నిత్యావసరాలపై మార్కెటింగ్ శాఖ గట్టి నిఘా
- నిత్యావసర సరుకులకు కమిటీ ఏర్పాటు
- అత్యవసర విభాగంలోకి విత్తనాలు, ఎరువులు, ఆహార పంటలు, కూరగాయలు
- విజయ డెయిరీ వాహనాల ద్వారా పాల సరఫరా
- ఉచిత రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు
- మార్కెట్లలో దోపిడీకి అడ్డుకట్ట
- ధరలపై తుది నిర్ణయం కలెక్టర్లకు
- అన్ని మున్సిపాలిటీల్లో అత్యవసర సేవలు
- ఆసరా పింఛన్ల పంపిణీ యథాతథం

వివరాలు 2,3,4 పేజీల్లో..

# ఇది జీవితకాల సవాల్

### 'లాక్‌డౌన్' మార్గదర్శకాలు పాటించండి

మిమ్మల్ని, మీ కుటుంబాలను కాపాడుకోండి

దేశ ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ పిలుపు

నిబంధనలు కఠినంగా అమలుచేయాలని రాష్ట్రాలకు ఆదేశం

**న్యూఢిల్లీ, మార్చి 23:** కరోనా వైరస్‌పై పోరు ను 'జీవితకాల సవాల్'గా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివర్ణించారు. ప్రజలు 'లాక్‌డౌన్'ను పెద్దగా పట్టించుకోవడంలేదని సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. దయచేసి ఇండ్లకే పరిమితం కావాలని విజ్ఞప్తిచేశారు. 'లాక్‌డౌన్‌ను అనేకచోట్ల ప్రజలు పట్టించుకోవడం లేదు. దయచేసి మిమ్మల్ని మీరు రక్షించుకోండి. మీ కుటుంబాలను కాపాడుకోండి. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించండి' అని ట్విట్టర్ వేదికగా విన్నవించారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలను పక్కాగా అమలుచేయాలని సూచించారు. మరోవైపు ప్రధాని మోదీ మీడియా ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కొవిడ్-19 వైరస్‌పై

మిగతా 5వ పేజీలో



### పార్లమెంటుకు కరోనా ఎఫెక్ట్

ఉభయసభలు నిరవధిక వాయిదా

# మృతులు 15,873

3.50 లక్షల మందికి వైరస్.. 170 కోట్ల మంది హోం క్వారంటైన్

50కి పైగా దేశాల్లో లాక్‌డౌన్

5

## దేశంలో 468 కేసులు

మరణాలు తొమ్మిది

## మరో ఆరుగురికి

రాష్ట్రంలో 33కు చేరిన కరోనా కేసులు

నిలకడగా బాధితుల ఆరోగ్య పరిస్థితి




epaper.ntnews.com

# శుభ్రతతో కరోనా కట్టడి

### ప్రధాని మోదీకి సేఫ్ హ్యాండ్ చాలెంజ్ విసిరిన కేటీఆర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనాను తరిమికొట్టాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. ప్రముఖ సైకతశిల్పి సుదర్శన్ పట్నాయక్ విసిరిన సేఫ్‌హ్యాండ్ చాలెంజ్‌ను స్వీకరించిన మంత్రి కేటీఆర్.. శానిటైజర్‌తో చేతులు ఎలా కడుక్కోవాలో చూపిస్తూ వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. కరోనా చైన్‌ను బ్రేక్ చేయాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సేఫ్‌హ్యాండ్స్ చాలెంజ్‌లో భాగంగా ఆయన ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు హర్దీప్‌సింగ్ పూరి, పీయుష్‌గోయల్, సినీనటుడు అమితాబ్‌బచ్చన్, అమెరికన్ ఇంటర్నెట్ ఎంటర్‌ప్రెన్యూర్ మార్క్ బెనిఆఫ్‌కు చాలెంజ్ విసిరారు.

# కశ్మీర్ కోసం రాష్ట్రాల నిధులు తగ్గించొద్దు

### రాజ్యసభలో టీఆర్‌ఎస్ నేత కేశవరావు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జమ్ముకశ్మీర్ అభివృద్ధికి కేంద్ర నిధుల నుంచి కేటాయింపులు జరుపాలని, కానీ రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధుల వాటాను తగ్గించి జమ్ముకశ్మీర్‌కు ఇవ్వడం సరికాదని టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు అన్నారు. జమ్ముకశ్మీర్ ఆర్థిక బిల్లుపై సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. కశ్మీర్ అభివృద్ధికి టీఆర్‌ఎస్ మద్దతు తెలుపుతుందన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం రాష్ట్రాలకు 42 శాతం నిధులను బదలాయించాల్సి ఉన్నదని, కానీ ఈ నిధులను కేంద్రం 41 శాతానికి తగ్గించడంతో తెలంగాణ సహా పలు రాష్ట్రాలు నష్టపోయే ప్రమాదమున్నదని కేశవరావు ఆవేదన వ్యక్తంచేశారు.

# సీఎం కేసీఆర్‌కు ప్రధాని ప్రశంస

### పేదలకు ప్రకటించిన సాయాన్ని వివరించిన ఎంపీ నామా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కట్టడికి తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న చర్యలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు. సోమవారం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడిన అనంతరం స్పీకర్ ఓంబిర్లా చాంబర్‌కు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, అన్ని పార్టీల లోక్‌సభాపక్ష నేతలు వెళ్లారు. ఈ సందర్భంగా కరోనా కట్టడి, జనతా కర్ఫ్యూ చర్చకు వచ్చినప్పుడు లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వరరావు తెలంగాణలో తెల్లరేషన్ కార్డు కుటుంబాలకు రూ.1500, ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం చొప్పున దాదాపుగా రూ.3 వేలకోట్ల ప్యాకేజీని సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని వివరించారు. ఈ నెల 31 వరకు రాష్ట్రమంతటా లాక్‌డౌన్ నిర్వహిస్తున్నందున 90 లక్షల కుటుంబాలకుసాయం అందుతుందని నామా తెలిపారు. సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. జనతా కర్ఫ్యూ పిలుపుపై ప్రజలు స్పందించిన తీరును లోక్‌సభలోని అన్ని పక్షాల నేతలతో ప్రధాని పంచుకున్నారు. ఒక వృద్ధురాలు ఖాళీ ప్లాస్టిక్ డబ్బాను గోడకు కొట్టి కర్ఫ్యూకు సంఘీభావాన్ని తాను మీడియాలో చూసినట్టు ప్రధాని తెలిపారు. అమెరికా, ఇటలీ వంటి దేశాలు కరోనాతో ఇబ్బంది పడుతున్నాయని, మనం అప్రమత్తం కావాలనే ఉద్దేశంతో జనతా కర్ఫ్యూ సహా అనేక నిర్ణయాలు తీసుకున్నట్టు ప్రధాని తెలిపారు.

# 26 రకాల పరిశ్రమలకు లాక్‌డౌన్ నుంచి మినహాయింపు

### పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్‌కు అడ్డుకట్ట వేసేందుకు విధించిన లాక్‌డౌన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం 26 రకాల పరిశ్రమలకు మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ సోమవారం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు. నిత్యావసర వస్తువులను తయారుచేసే పరిశ్రమలతోపాటు వైద్యారోగ్యశాఖకు అవసరమైన ఉత్పత్తులను తయారుచేసే పరిశ్రమలకు, ఆహార పరిశ్రమలకు లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ ఆదేశాలు అమలయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, ఆయా జిల్లాల్లోని కాలుష్య నియంత్రణ మండలి, స్థానిక సంస్థలు, కార్మికశాఖ, ఫ్యాక్టరీల అధికారులకు ఆదేశాలు జారీచేయాలని సూచించారు. ఒకవేళ ఏ పరిశ్రమల్లో అయినా ముడిసరుకు మిగిలి ఉన్నట్టయితే ఆ సరుకు పూర్తయ్యే వరకు పరిశ్రమలు నడిపేలా మినహాయింపు ఇవ్వనున్నారు. మిగిలిన పరిశ్రమలన్నీ తప్పనిసరిగా లాక్‌డౌన్ పాటించాల్సిందేనని స్పష్టంచేశారు.

**లాక్‌డౌన్ నుంచి మినహాయించిన పరిశ్రమలు ఇవీ..**

1) రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు, 2) పప్పు మిల్లులు, 3) డెయిరీ ఉత్పత్తులు, 4) డిస్టిల్డ్ వాటర్ ప్లాంట్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లు, ఆర్వో వాటర్ ప్లాంట్లు, 5) రోలర్ ఫ్లోర్‌మిల్స్, 6) ఆహార (వెర్మిసెల్లీ, బిస్కెట్స్, ఫ్రూట్‌జ్యూస్, పల్ప్) పరిశ్రమలు, 7) బల్క్‌డ్రగ్స్, 8) వైద్య సామగ్రి (సక్షన్ పైపులు, ఆక్సిజన్ పైపులు, పీపీఈ గేర్ సర్జికల్ ఎక్విప్‌మెంట్స్, బ్యాండేజ్డ్ క్లాత్) తయారీ పరిశ్రమలు, 9) ఫార్మాస్యూటికల్స్ ఫార్మలేషన్స్, ఆర్అండ్‌డీ, 10) లిక్విడ్ సబ్బులు, డిటర్జెంట్ సబ్బులు, ఫినాయిల్, ఫ్లోర్ క్లీనర్స్, 11) శానిటైజర్స్, 12) మాస్కులు, బాడీ సూట్లు, 13) పేపర్ నాప్కిన్స్, 14) డైపర్స్, శానిటరీ నాప్కిన్స్, 15) ఆక్సిజన్, డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్, 16) కోల్డ్ స్టోరేజ్స్, 17) వ్యవసాయాధారిత (చిల్లీ, టర్మరిక్, ఉప్పు, స్పైసెస్) పరిశ్రమలు, 18) బేకరీ ఉత్పత్తులు, మిఠాయిలు, 19) ఐస్ ప్లాంట్లు, 20) ఫిష్ ఫీడ్, పౌల్ట్రీ ఫీడ్, పశుగ్రాసం, 21) పవర్ జనరేటర్స్, సోలార్ జనరేటర్స్, 22) చక్కెర పరిశ్రమ, 23) ఆయుర్వేద, హోమియోపతి ఔషధ తయారీ యూనిట్లు, 24) బ్లీచింగ్ పౌడర్, 25) ప్యాకేజింగ్ ఇండస్ట్రీస్, 26) ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్.

# బయట తిరుగొద్దు

- విదేశాలనుంచి వచ్చినవారు ఇండ్లలో ఉండటమే చికిత్స
- ఐసోలేషన్ సేవలకోసం అందుబాటులో 15 వేల బెడ్లు
- ప్రైవేటు వైద్యకళాశాలల యాజమాన్యాలు సహకరించాలి
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ విజ్ఞప్తి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 వైరస్ స్టేజీ-2లో విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎవరికివారు ఇండ్లలో ఉండటమే సరైన చికిత్సఅని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. విదేశాల నుంచి వచ్చి హోంక్వారంటైన్‌లో ఉన్నవాళ్లు 14 రోజులపాటు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావొద్దని సూచించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరోనాతో ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్కరూ చనిపోలేదని.. 33 పాజిటివ్‌కేసుల్లో ఎవరికీ సీరియస్ లేదని తెలిపారు. 97 మంది అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. క్వారంటైన్ కేంద్రాల్లో ఉన్న వారిని 14రోజుల తర్వాత పరీక్షలు చేసి ఇంటికి పంపించనున్నట్టు తెలిపారు. సికింద్రాబాద్, కరీంనగర్‌లో సెకండ్ స్టేజీకి వైరస్‌వ్యాప్తి చేరుకున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తిచేశారు.వైరస్ సోకిన తర్వాత నయం చేయడం చాలా కష్టమనే విషయం ప్రపంచానికి అర్థమైందని, వైరస్ వ్యాప్తి నియంత్రణలో ఈ పది రోజులు చాలా కీలక సమయమని తెలిపారు. సహనంతోనే దీనిని తరిమికొట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈనెల 31 వరకు అందరూ ఇండ్లకే పరిమితం కావాలని ప్రజలకు సూచించారు. ప్రైవేటు వైద్యకళాశాలల్లో ఉన్న బెడ్లు సిద్ధం చేయాలని, ప్రభుత్వం చేపట్టిన చర్యలకు అందరూ సహకరించాలని ఈటల పేర్కొన్నారు. కోఠిలోని కరోనా కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ప్రైవేటు వైద్యకళాశాల యాజమాన్య ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సహకరిస్తే ఎక్కువ మందికి వైద్య సేవలు అందించగలుగుతామన్నారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రైవేటు వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న ఐసీయూ, ఐసోలేషన్ బెడ్లను ఉపయోగించుకోనున్నట్టు తెలిపారు. బోధనాసుపత్రులకు కావాల్సిన పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్లు, పీపీటీ కిట్లు, శానిటైజర్లు, ఇతర పరికరాలు అందజేస్తామని చెప్పారు. ప్రైవేటు వైద్యకళాశాలలతో సమన్వయానికి కాళోజీ యూనివర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఆర్డీవో స్థాయి అధికారిని ప్రతి కొవిడ్-19 ఐసోలేషన్ సేవలందించే ఆసుపత్రికి నోడల్ అధికారిగా నియమిస్తామన్నారు. సాధారణ జబ్బులతో వచ్చేవారిలో అత్యవసర పరిస్థితి లేకపోతే అడ్మిట్ చేసుకోవద్దని, సాధ్యమైనంత ఎక్కువ బెడ్లు కరోనా వైరస్ కేసుల కోసం అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికానే భయపడుతున్నదని.. మనం ఆషామాషీగా తీసుకోవద్దని తెలిపారు. సమావేశంలో డీఎంఈ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరోనా కంట్రోల్ రూం

- ఇంచార్జిలుగా ఇద్దరు సీనియర్ అధికారులు

కంట్రోల్ రూం నంబర్లు
04023450735
04023450624

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కట్టడిలో భాగంగా వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కరోనా కంట్రోల్ రూంను ఏర్పాటుచేసింది. 24 గంటలూ పనిచేసే ఈ కంట్రోల్ రూంకు ఎస్సీ అభివృద్ధిశాఖ కమిషనర్ రాహుల్‌బొజ్జా, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఇంచార్జిలుగా వ్యవహరిస్తారు. వీరికి సహాయకులుగా ఐఏఎస్ అధికారి సీహెచ్ శివలింగయ్య, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి నియమితులయ్యారు. పోలీసుశాఖ నుంచి ఐపీఎస్ అధికారి బాలనాగదేవి, సైబరాబాద్ అడిషనల్ ఎస్పీ కే శ్రీనివాస్‌రావు, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త సంచాలకులు మోతిలాల్‌నాయక్, జాన్‌బాబు విధులు నిర్వర్తిస్తారు.

## మరో ఆరుగురికి కరోనా

- ఇండోనేషియన్లతో తిరిగిన వ్యక్తికి పాజిటివ్
- రాష్ట్రంలో 33కు చేరిన కేసులు
- వైద్యారోగ్యశాఖ బులెటిన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు విదేశాల నుంచి వచ్చిన వారితోపాటు గతంలో పాజిటివ్‌గా నమోదైన బాధితులకు సన్నిహితులైన స్థానికులకు కరోనా వైరస్ పాజిటివ్ నిర్ధారణ అవుతున్నది. సోమవారం ఒక్కరోజే ఆరుగురికి కొవిడ్-19 పాజిటివ్‌గా తేలింది. వారిని ఐసోలేషన్‌లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ బులెటిన్‌లో పేర్కొన్నది. ఫ్రాన్స్ నుంచి వచ్చిన హైదరాబాద్‌లోని బల్కంపేటవాసి (21), లండన్‌నుంచి వచ్చిన శాంతినగర్‌వాసి (30), అధిక సంఖ్యలో పాజిటివ్‌గా నమోదైన ఇండోనేషియా బృందంతో కలిసి తిరిగిన కరీంనగర్‌వాసి (23), న్యూయార్క్ నుంచి వచ్చిన విద్యార్థి (20), లండన్ నుంచి వచ్చిన గచ్చిబౌలివాసి (25), శ్రీలంక వెళ్లివచ్చిన కూకట్‌పల్లికి చెందిన వ్యాపారవేత్త (56)లకు నిర్ధారణ పరీక్షల్లో కొవిడ్-19 పాజిటివ్‌గా నమోదైంది. రాష్ట్రంలో కరోనా వైరస్ పాజిటివ్‌గా నమోదైన 33 మందిలో ఒకరు ఇప్పటికే పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ కాగా, మిగిలిన 32 మందిని ఐసోలేషన్‌లో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నామని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని వైద్యశాఖ బులెటిన్‌లో వెల్లడించింది.

# నిత్యావసరాలపై నిఘా

- కూరగాయలు, సరుకులపై అప్రమత్తం
- రైతుబజార్లలో ధరల నియంత్రణ
- అత్యవసర విభాగంలోకి విత్తనాలు, ఎరువులు, ఆహారపంటలు
- కరోనా నేపథ్యంలో మార్గదర్శకాలు
- అవసరమైన పాల సరఫరా: విజయడెయిరీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం లాక్‌డౌన్ ప్రభావం పాలు, కూరగాయాలు ఇతర నిత్యావసరాలపై పడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వీటిన్నింటినీ ఈ నెల 31 వరకు సరిపోయేలా ముందుస్తుగా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టింది. ప్రజలంతా ఒకేసారి రైతు బజార్లు, సూపర్ మార్కెట్లకు వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మార్కెటింగ్‌శాఖ నిర్ణయించింది. ఆదివారం జనతా కర్ఫ్యూ నేపథ్యంలో ప్రజలు ఒకరోజు ముందుగానే ఒక ట్రెండు రోజులకు సరిపోయే సరకులు కొనుగోలు చేసుకున్నారు. కానీ, మార్చి 31 వరకు లాక్‌డౌన్‌ను విధిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో నిత్యావసరాల కోసం దుకాణాలు, రైతు బజార్లకు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా దళారులు కూరగాయలు, నిత్యావసరాలను బ్లాక్ మార్కెట్ చేయకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. రైతుబజార్లలో రైతులు కూరగాయలు వినియోగదారులకే విక్రయించేలా చర్యలు చేపడుతున్నారు. సరిహద్దుల మూసివేత నేపథ్యంలో పొరుగురాష్ట్రాల నుంచి కూరగాయల సరఫరాలో ఆటంకం కలిగే అవకాశమున్న నేపథ్యంలో మరింత అప్రమత్తమయ్యారు. నిత్యావసర వస్తువుల కృత్రిమ కొరత సృష్టించకుండా వ్యవసాయశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో సివిల్‌సప్లై, రవాణా, హైదరాబాద్ పోలీస్‌కమిషనర్, మార్కెటింగ్ డైరెక్టర్, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, లీగల్ మెట్రాలజీ కంట్రోలర్, ఉద్యానశాఖ కమిషనర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్లతో కమిటీ ఏర్పాటుచేశారు. మార్కెట్లలో క్రయ, విక్రయాలపై పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో అవసరాలకు అనుగుణంగా కూరగాయల సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. హైదరాబాద్‌కు ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, మహేశ్వరం, షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున కూరగాయలు సరఫరా అవుతున్నాయని, వీటితోపాటు నల్లగొండ, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల నుంచి కూడా వచ్చేవాటితో ప్రజల అవసరాలు తీరుతాయని అధికారులు వెల్లడించారు.



**అత్యవసర విభాగంలోకి మరికొన్ని..**

లాక్‌డౌన్ నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు, ఆహార పంటలు, పండ్లు, కూరగాయలు అత్యవసర విభాగంలోకి వస్తాయని ప్రభుత్వం పేర్కొన్నది. ఈ మేరకు వ్యవసాయ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. విత్తనాలు, విత్తన పంటలు ఫిబ్రవరి నుంచి మే వరకు హైదరాబాద్‌కు వస్తాయని, వీటి రవాణాకు ఎలాంటి అవాంతరాలు కలిగించకూడదని పోలీసుశాఖకు సూచించారు. 5 లక్షల మంది రైతులు భాగస్వామ్యమయ్యే విత్తనరంగం 70 శాతం రాష్ట్రం నుంచే సరఫరా అవుతాయని తెలిపారు. విత్తన, ఎరువులరంగాల్లో పనిచేసే ఉద్యోగులు, ప్రాసెసింగ్, స్టోరేజీ కేంద్రాల వద్ద ఎక్కువమంది పనిచేసే చోట్ల మూడు మీటర్ల సోషల్ డిస్టెన్స్ పాటించాలని సూచించారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో శానిటేషన్‌కు సంబంధించి అన్ని చర్యలు తీసుకోవాలని వివరించారు. ఎరువులను రేక్‌పాయింట్ల నుంచి లారీల్లో ట్రాన్స్‌పోర్ట్ చేసే సమయంలో హమాలీలకు కరోనా వైరస్ సోకకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి రవాణా అయ్యే కూరగాయలకు సంబంధించిన వాహనాలను చెక్‌పోస్టుల వద్ద నిలుపకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఇబ్బంది లేకుండా పాలసరఫరా**

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పాలు సరఫరా చేయడంపై విజయ డెయిరీ చర్యలు చేపట్టింది. కరోనా నేపథ్యంలో వివిధ రాష్ట్రాల నుంచి పాల దిగుమతికి ఆటంకం ఏర్పడటంతో కొరత ఉన్న ప్రాంతాల్లో విజయ డెయిరీ ద్వారా పాల సరఫరాను ప్రారంభించింది. హైదరాబాద్‌లో 1200 ఔట్‌లెట్ల ద్వారా పాలు విక్రయిస్తున్నట్టు విజయ డెయిరీ మార్కెటింగ్ ఇంచార్జి అరుణ్ తెలిపారు. ప్రైవేట్ కంపెనీలు సరఫరాచేసేచోట్ల పాల సరఫరా నిలిచిపోయిందని.. ఆయా ప్రాంతాల్లోనూ అవుట్‌లెట్లను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. అవసరమైనచోట్ల డిస్ట్రిబ్యూటర్ల ద్వారా డోర్ డెలివరీ కూడా చేస్తున్నట్టు తెలిపారు. పాల ప్యాకింగ్ సందర్భంగా పనివాళ్లు, మిషనరీని శానిటైజ్ చేసి, వాహనాలను కూడా శుభ్రపరుస్తున్నట్టు చెప్పారు. ఏ జిల్లాల్లో పాల అవసరం ఉన్నా.. సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని విజయడెయిరీ చైర్మన్ లోక బాపురెడ్డి తెలిపారు.

## మార్కెట్లు తెరిచే ఉంటాయి

### వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



**ప్రతిరోజూ** ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిత్యావసర సరుకుల దుకాణాలు, కూరగాయల మార్కెట్లు తెరిచే ఉంటాయని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. ప్రజలు మార్కెట్లకు గుంపులుగా వెళ్లవద్దని, మాస్కులు ధరించి వెళ్లాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దూరదృష్టితో ప్రకటించిన లాక్‌డౌన్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వం పంపిణీచేసే బియ్యం, నగదును సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.

## ధరలు పెంచితే కఠిన చర్యలు

### మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



**ప్రస్తుత** పరిస్థితులను ఆసరాగాచేసుకొని నిత్యావసర వస్తువులకు కృత్రిమ కొరత సృష్టిస్తే సహించేదిలేదని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై నిత్యావసర వస్తువుల చట్టం, ఇతర చట్టాల కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలు కూడా స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు.


### ఇంటర్ స్పాట్ కేంద్రాలు బంద్

**ఇంటర్మీడియట్** పరీక్షల స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాలను ఈ నెల 31 వరకు బంద్‌చేశామని ఇంటర్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్ చెప్పారు. ఇంటర్ ఒకేషనల్ పరీక్షల ప్రశ్నపత్రాలను క్లాసిఫికేషన్ చేసి, తిరిగి వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామని తెలిపారు. ప్రస్తుతం 20 శాతం సిబ్బందితో అత్యవసర విధులు నిర్వహిస్తున్నామన్నారు.

**ఎంసెట్ దరఖాస్తుల గడువు 30 వరకు**

ఎంసెట్-2020 ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 30 వరకు ఉన్నదని కన్వీనర్ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. కరోనా కారణంగా గడువు తేదీని పొడిగించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

### అన్ని విద్యాసంస్థలు మూత



**కరోనా** కట్టడికి 1897 చట్టం అమల్లోకి వచ్చినందున రాష్ట్రంలో అన్ని విద్యాసంస్థలను ఈ నెల 31 వరకు బంద్ చేయాల్సిందేనని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సూచించారు. ఈ మేరకు సోమవారం ప్రాంతీయ విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులకు ఆదేశాలు జారీచేశారు.

### లోకాయుక్త విచారణలుండవ్



**లోకాయుక్త** కార్యకలాపాలను సైతం ఈ నెల 31 వరకు నిలిపివేస్తున్నామని, ఎలాంటి విచారణలు చేపట్టబోమని రిజిస్ట్రార్ సోమవారం ప్రకటించారు. ఇంతకుముందే షెడ్యూల్ అయిన కేసు విచారణను వాయిదా వేస్తున్నందున తదుపరి నిర్వహించే తేదీలపై సమాచారం అందిస్తామన్నారు.

### పోస్టల్ సేవలు పరిమితం




**కరోనా** నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 31 వరకు పోస్టల్ సేవలను పరిమితంగా అందజేయనున్నట్టు తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 37 ప్రధాన పోస్టల్‌శాఖలతోపాటు అన్ని బ్రాంచ్ కార్యాలయాలు బంద్ అవుతాయి. ఆసరా పింఛన్ల చెల్లింపులను ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడతామని చెప్పారు. స్పీడ్‌పోస్టులు, రిజిస్టర్ పోస్ట్‌లు, ఈ-మనియార్డర్స్ బుకింగ్‌తోపాటు మొబైల్ నంబర్, ఇంటి అడ్రస్‌లు ఉంటే పార్సిల్ డెలివరీ చేస్తామన్నారు. డిపాజిట్, విత్‌డ్రా సేవలు కొనసాగిస్తామన్నారు.

## లోకం పోకడ




## ముహూర్తం

సూర్యోదయం: 6.16 గంటలకు

సూర్యాస్తమయం: 6.23 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం అమావాస్య మధ్యాహ్నం 2.58 వరకు, తదుపరి శ్రీ శార్వరి నామ సంవత్సరం వసంతరుతువు, చైత్రమాసం శుక్లపక్షం పాడ్యమి నక్షత్రం: ఉత్తరాభాద్ర బుధవారం తె. ఝా 4.19 వరకు, తదుపరి రేవతి, అమృతఘడియలు: రాత్రి 10.56 నుంచి 12.44 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 4.52 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.41 నుంచి 9.29 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.20 నుంచి 3.09 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 2.50 నుంచి సాయంత్రం 4.38 వరకు.

# బియ్యం పంపిణీకి సిద్ధం

- రేషన్ షాపులకు సరఫరాపై ప్రణాళిక
- పౌరసరఫరాలశాఖ ఆదేశాలు జారీ
- ఈ-కుబేర్ ద్వారా 1500 నగదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ కట్టడికి తెలంగాణ లాక్‌డౌన్ నేపథ్యంలో పేదలకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీకి పౌరసరఫరాలశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నెల 31 వరకు రోజుకూలీలు, పేదలు ఆహారం కోసం ఇబ్బందులు పడకుండా తెల్లరేషన్‌కార్డుదారుల్లో ఒక్కొక్కరికీ 12 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందజేయనున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శాఖ కమిషనర్ సత్యనారాయణరెడ్డి సోమవారం ఉన్నతాధికారులతో సమావేశమై రేషన్ బియ్యాన్ని రేషన్‌దుకాణాలకు ఎలా చేరవేయాలి అనే అంశంపై మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలో 87.53 లక్షల తెల్ల రేషన్‌కార్డులుండగా, 2.72 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. తాజాగా ఒక్కొక్కరికీ 12 కిలోల చొప్పున బియ్యం ఇవ్వాల్సి ఉండటంతో ఆ మేరకు గోదాముల నుంచి రేషన్‌షాపులకు సరఫరా చేయడానికి రెట్టింపు వాహనాలు సమకూర్చుకోవాలని స్టేజ్-1, స్టేజ్-2 కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మారెడ్డి మాట్లాడుతూ.. లాక్‌డౌన్ సమయంలో పేదలెవరూ ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ 12 కిలోల బియ్యం సరఫరాచేయాలని ఆదేశించినట్టు చెప్పారు. పౌరసరఫరాల సంస్థ వద్ద బియ్యం నిల్వలు పుష్కలంగా ఉన్నాయని.. దీనిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. తెల్ల రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీతోపాటు, సరుకుల కొనుగోలుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ.1500 నగదును ఈ-కుబేర్ ద్వారా అందించాలని నిర్ణయించారు.



హైదరాబాద్‌లోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బియ్యం తరలిస్తున్న దృశ్యం

**సేవలకు సిద్ధం: పెట్రో డీలర్లు**

సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని.. అయితే తమ సిబ్బంది సంక్షేమం గురించి పట్టించుకోవాలని తెలంగాణ పెట్రోల్ డీలర్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి హెచ్‌పీసీఎల్ డీజీఎం టీరాజేశ్‌కువినతిపత్రం అందజేశారు. ఈ-పేమెంట్స్ ద్వారా వినియోగదారులు డబ్బు చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరారు.

## ఇంటివద్దకే అంగన్‌వాడి సరుకులు

### మంత్రి సత్యవతి ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ కట్టడి చర్యల్లో భాగంగా అంగన్‌వాడి కేంద్రాలను మూసివేయాలని, అంగన్‌వాడి సరుకులను లబ్ధిదారుల ఇంటికే పంపించాలని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సూచించారు. అంగన్‌వాడి కేంద్రాల మూసివేత అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలుచేశారు. అంగన్‌వాడి సరుకుల పంపిణీని గ్రామ కమిటీల ద్వారా చేపట్టాలని చెప్పారు. గర్భిణుల జాబితా సిద్ధం చేసుకుని.. వారికి ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

# ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు

- లాక్‌డౌన్ అమలుకు కఠిన నిబంధనలు
- రాత్రి 7నుంచి ఉదయం 6 గంటల వరకు సర్వం బంద్
- అనవసరంగా బయటకు రావొద్దు
- రూల్స్ అతిక్రమిస్తే వాహనాలు సీజ్
- సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ఎపిడమిక్ యాక్టు 1897 ప్రకారం విధించిన లాక్‌డౌన్‌ను మరింత కఠినంగా అమలుచేయనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ప్రకటించారు. ముఖ్యంగా రాత్రి 7 నుంచి ఉదయం 6 గంటలవరకు సంపూర్ణంగా కర్ఫ్యూ అమలులో ఉంటుందని, ఆ సమయంలో బయట ఎవరు తిరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాక్‌డౌన్‌ను మరింత పకడ్బందీగా అమలుచేసేందుకు మరిన్ని నిబంధనలను విధిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు. ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటలవరకు నిత్యావసర వస్తువులు, అత్యవసర పనులు వంటి వాటికి మాత్రమే పరిమితంగా బయటకు అనుమతిస్తామని స్పష్టంచేశారు. అత్యవసర సర్వీసులు మినహా మిగిలిన అన్ని సేవలూ ఈ నెల 31వ తేదీవరకు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు చేపట్టిన చర్యలపై సీఎస్ సోమేశ్‌కుమార్ సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో డీజీపీ మహేందర్‌రెడ్డితో కలిసి మీడియాకు వివరించారు. రాత్రి సచివాలయంనుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్.. లాక్‌డౌన్ పటిష్ఠంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు పెంచినా, బ్లాక్ మార్కెటింగ్ చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో వ్యవసాయం, పాల సరఫరా, మెడికల్ షాపులకు మినహాయింపు ఇచ్చినట్టు తెలిపారు. ఉపాధి హామీ పథకం పనులకు కూడా మినహాయింపు ఉన్నదని, గుంపులుగా కాకుండా పరిమిత సంఖ్యలో, వ్యక్తిగత దూరాన్ని కొనసాగిస్తూ పనులు చేపట్టవచ్చని చెప్పారు. విదేశాలనుంచి వచ్చినవారు క్వారంటైన్‌లో ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావొద్దని స్పష్టంచేశారు. లేనిపక్షంలో పాస్‌పోర్టుపై న్యాయపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాక్‌డౌన్‌లో భాగంగా ఏపీతోపాటు అంతర్రాష్ట్ర సరిహద్దులన్నీ మూసివేసినట్టు తెలిపారు.



సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న సీఎస్ సోమేశ్‌కుమార్. చిత్రంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, అదనపు డీజీపీ జితేందర్ ఉన్నారు.

### ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాలన్నీ బంద్


ఇప్పటికే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, క్యాబ్ సర్వీసులన్నింటినీ బంద్‌చేశామని సీఎస్ చెప్పారు. ఐదుగురికంటే ఎక్కువమంది గుమిగూడరాదని, జీవో నంబర్ 45లోని ప్రతి అంశాన్నీ కచ్చితంగా అమలుచేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నిరకాల పరీక్షలు వాయిదావేస్తున్నామన్నారు. రోడ్లపై ఎటువంటి వాహనాలు నడుపడానికి వీలులేదని స్పష్టంచేశారు. అత్యవసరసేవలకు అంతరాయం ఏర్పడకుండా ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటుచేసిందని, పౌరసరఫరాలు, వ్యవసాయ పనులు, ఇతర సేవలను కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. 87 లక్షల తెలుపురంగు రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యం సరఫరా చేయడంతోపాటు రూ.1,500 త్వరలోనే అందజేస్తామని, ఆ దిశగా కమిటీ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఐటీ కంపెనీలు ఇప్పటికే వర్క్ ఫ్రం హోం విధానాన్ని అమలుచేస్తున్నాయని, అత్యవసరమనుకుంటే కొన్నిరకాల ఐటీ సేవలకు కర్ఫ్యూ నుంచి మినహాయింపు ఇస్తున్నామని వివరించారు. సచివాలయంలో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు రాహుల్ బొజ్జా, అనిల్‌కుమార్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్లకు చెప్పారు. వీరు ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇస్తారన్నారు. ఇదే తరహాలో జిల్లాల్లో కూడా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక్కో జిల్లాలో కనీసం రెండు క్వారంటైన్ సెంటర్లు ఉండేలా చూడాలని ఆదేశించారు. విదేశాల నుంచి వచ్చిన, హోం క్వారంటైన్‌లో ఉన్నవారి వివరాలు సేకరించడానికి ఇంటర్ డిసిప్లీనరీ టీంలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోజువారీ నివేదికలు కంట్రోల్ రూంకు పంపాలన్నారు. జిల్లాల్లో క్వారంటైన్ యాక్టివిటీని పర్యవేక్షించడానికి యాప్‌ను రూపొందించామని చెప్పారు. రైతులు గుమిగూడకుండా గ్రామస్థాయిలో ఎక్కువ సంఖ్యలో ధాన్యం సేకరణ కేంద్రాలను పెంచాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, జనార్దన్‌రెడ్డి, రిజ్వీ, సందీప్‌కుమార్ సుల్తానియా, సంజయ్ జాజు, రోనాల్డ్ రోస్, సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటోలు బంద్ పాటించాలి: బీఎంఎస్ పిలుపు

కరోనా వైరస్ బారి నుంచి ప్రజలను కాపాడాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంపూర్ణంగా సహకరిస్తామని భారతీయ మజ్దూర్ సంఘ్ తెలంగాణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. జనతా కర్ఫ్యూను విజయవంతంచేసిన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లాక్‌డౌన్ పిలుపును కూడా పాటించాలని కోరింది. కరోనా వైరస్ వ్యాప్తి కట్టడికి ప్రజారవాణా బంద్ కావాలన్న సీఎం కేసీఆర్ సూచనకు కట్టుబడి ఉండాలని ఆటో డ్రైవర్లకు విజ్ఞప్తిచేసింది. ఆటో డ్రైవర్లకు రూ.3 వేల జీవనభృతి చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది.

## లాక్‌డౌన్‌కు సహకరించాలి

- ప్రజలు స్వీయ క్రమశిక్షణ పాటించాలి
- హోంమంత్రి మహమూద్ అలీ



నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

**మారేడ్‌పల్లి:** లాక్‌డౌన్‌కు ప్రజలందరూ సహకరించాలని, కరోనా వైరస్ పూర్తిగా అంతమయ్యే వరకు ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణ పాటించాలని హోంమంత్రి మహమూద్ అలీ కోరారు. సోమవారం నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన.. లాక్‌డౌన్ పరిస్థితి వివరాలను డీసీపీ కల్మేశ్వర్ సింగనవార్, ఇతర పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర సరిహద్దులు అన్నీ మూసివేశామని చెప్పారు. విదేశాల నుంచి వచ్చిన వారిని క్వారంటైన్ కేంద్రాలకు తరలించామని వివరించారు. కరోనా వైరస్ లక్షణాలు ఉన్న పలువురిని పోలీసులు దవాఖానలకు తరలించారని తెలిపారు. స్థానికంగా ఎవరైనా విదేశీయులు ఉంటే, పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఉగాది పండుగను కూడా ఎవరి ఇండ్లల్లో వారు చేసుకొంటే బాగుంటుందని చెప్పారు. సికింద్రాబాద్‌లో భిక్షాటన చేస్తూ ఫుట్‌పాత్‌లపై నివాసం ఉంటున్న వారికి ఆహారం విషయమై త్వరలో ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అవసరమైతే ఆయా ప్రాంతాల్లో రూ.5 భోజనం ఏర్పాటుచేస్తామన్నారు.

### నియంత్రిస్తే మరిన్ని ఆంక్షలు: డీజీపీ

ప్రజలు స్వీయ నిర్బంధంలోనే ఉండాలని డీజీపీ మహేందర్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. ప్రజాశ్రేయస్సు కోసం ఈ నెల 31వరకు లాక్‌డౌన్ అమల్లో ఉంటుందని స్పష్టంచేశారు. రోజువారీ నిత్యావసర వస్తువులు, కూరగాయలు, మెడికల్, అత్యవసరశాఖల, మీడియా వాహనాలకు మాత్రమే మినహాయింపు ఉంటుందన్నారు. నివాసాలకు సమీపంలోని రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దుకాణాలనుంచి నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి మాత్రమే వ్యక్తిగత వాహనాలను ఉపయోగించాలని సూచించారు. ఇందుకోసం బైక్‌లపై ఒకరు, కార్లలో డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టంచేశారు. రోడ్లపై ఒకేచోట ఐదుగురి కంటే ఎక్కువ మంది కనిపిస్తే చర్యలు తీసుకొంటామని, ప్రజలు నియంత్రణ పాటించకపోతే పగటిపూట కూడా బయటకు వెళ్లే సమయంపై ఆంక్షలు విధించే అంశాన్ని పరిశీలిస్తామని హెచ్చరించారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 31వరకు క్రమశిక్షణతో ఉండాలని విజ్ఞప్తిచేశారు. లాక్‌డౌన్‌ను ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజల రాకపోకలను నివారించేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో చెక్‌పోస్టు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. సరైన కారణం లేకుండా బయటకు వచ్చినట్టు గుర్తిస్తే ఈ నెల 31వరకు వాహనాన్ని సీజ్‌చేస్తామని హెచ్చరించారు. చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని ఐజీలు, డీఐజీలు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని, 1897 చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులకు పూర్తి అధికారాలున్నాయని చెప్పారు. సమావేశంలో అదనపు డీజీపీ జితేందర్ కూడా పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల పర్యవేక్షణకు కమిటీ

ప్రజలకు నిత్యావసర సరుకులకు ఇబ్బంది కలుగకుండా సరఫరాచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటుచేసింది. వ్యవసాయశాఖ కార్యదర్శి నేతృత్వంలోని ఈ కమిటీలో పౌరసరఫరాల, రవాణాశాఖ కమిషనర్లు, ఐజీ ఆఫ్ పోలీస్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, ఉద్యానశాఖ డైరెక్టర్, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్, లీగల్ మెట్రాలజీ కంట్రోలర్, డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీ సభ్యులుగా ఉన్నారు.

## ఇండ్లలో ఉండటమే మార్గం

- కరోనా కట్టడిపై ఎంపీ సంతోష్ ట్వీట్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎప్పటికప్పుడు అప్రమత్తంగా లేకపోతే కరోనా వైరస్ ఏ సమయంలోనైనా వ్యాపిస్తుందని ఎంపీ సంతోష్ ట్విట్టర్ ద్వారా సూచించారు. 'ఇప్పటికైనా కొవిడ్-19 వైరస్ శక్తి ఏమిటో అర్థం చేసుకుందాం. మనందరం ఇండ్లకు పరిమితం కావడం ఒక్కటే ఈ మహమ్మారిపై పోరాటం చేసేందుకు ఉన్న మార్గం' అని ట్వీట్‌చేశారు.

## నిర్లక్ష్యంతో పెనుముప్పు

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రజలందరూ లాక్‌డౌన్‌ను విధిగా పాటించాలని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. కరోనా వైరస్‌ను నిర్లక్ష్యంచేస్తే చాలా ప్రమాదమని హెచ్చరించారు. కరోనా వైరస్‌కు మందు, టీకా లేవని, నివారణ ఒక్కటే మార్గమని చెప్పారు.

## సీఎంఆర్‌ఎఫ్‌కు నెల వేతనం

- అందించిన ఎమ్మెల్సీ పోచంపల్లి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నిరోధానికి శాసనమండలి సభ్యుడు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్)కి నెల వేతనాన్ని అందించారు. చెక్కు రూపంలో నెల వేతనం రూ.2.5 లక్షలను సోమవారం అందచేశారు. కరోనా కట్టడికి సీఎం కేసీఆర్ చేపడుతున్న కార్యక్రమాలకు తనవంతు తోడ్పాటుగా అందించినట్టు తెలిపారు.

## పకడ్బందీగా జల్లెడ

- విదేశాల నుంచి వచ్చినవారి వివరాల సేకరణ
- మున్సిపల్ కమిషనర్లకు పురపాలకశాఖ ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నిరోధక చర్యల్లో భాగంగా విదేశాల నుంచి వచ్చినవారిని గుర్తించే పనిని రాష్ట్ర ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. మార్చి ఒకటో తేదీ తర్వాత విదేశాల నుంచి వచ్చిన దాదాపు 20వేల మంది ప్రయాణికులు శంషాబాద్ విమానాశ్రయంలో దిగగా, వీరిలో సుమారు 11వేల మంది జాడ తెలిసింది. మిగిలినవారి ఆచూకీ కొనుగొనేందుకు ప్రత్యేక బృందాలు జల్లెడపడుతున్నాయి. వీరిలో ఎక్కువమంది హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఉంటారన్న అంచనాతో ఆయా జిల్లాల కమిషనర్లను పురపాలకశాఖ మరింత అప్రమత్తంచేసింది. విదేశాలనుంచి వచ్చినవారు తప్పకుండా 14 రోజులపాటు స్వీయ గృహనిర్బంధంలో ఉండేలా చూడాలని ఆదేశించింది.

### మున్సిపల్‌శాఖ ఆదేశాల్లో ముఖ్యాంశాలు:

- విదేశాల నుంచి వచ్చినవారిని గుర్తించేందుకు విధిగా వార్డుస్థాయి నిఘా బృందాలను ఏర్పాటుచేయాలి. ఇందులో అసిస్టెంట్ ఇంజినీరు/ డిప్యూటీ ఇంజినీర్, ఆరోగ్య లేదా పారిశుద్ధ్య అధికారి, పోలీసు సిబ్బంది సభ్యులుగా ఉండాలి.
- 14 రోజుల క్రితం విదేశాల నుంచి వచ్చినవారిని జల్లెడ పట్టి గుర్తించాలి. వారికి తప్పకుండా స్టాంప్‌వేయాలి. 14 రోజులపాటు హోం క్వారంటైన్‌లో ఉంచాలి.
- పట్టణాల్లో అపార్ట్‌మెంట్ నివాసిత సంఘాలు, స్వయం సహాయక బృందాలు తమ ప్రాంగణంలోకి విదేశాల నుంచి వచ్చినవారి వివరాలను నిఘా బృందాలకు తెలియజేయాలి.
- నిఘా బృందాలు విధిగా మాస్కులు, చేతులకు గ్లవ్స్ పెట్టుకుని కరోనా వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- కరోనా లక్షణాలున్న వ్యక్తులను ఐసొలేషన్ కేంద్రాలకు తరలించాలి. ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల ఆధ్వర్యంలో పాజిటివ్ కేసులను సమీపంలోని ఆరోగ్యకేంద్రాలకు తరలించాలి.
- నిఘా బృందాలు డేటాను ఎప్పటికప్పుడు స్థానిక పట్టణ సంస్థ కంట్రోల్‌రూంకు అందజేయాలి.

## పురపాలికల్లో అప్రమత్తం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ లాక్‌డౌన్ నేపథ్యంలో పురపాలకశాఖ అప్రమత్తమైంది. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమయ్యే అత్యవసర సేవలన్నీ అందుబాటులో ఉంటాయని ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా పట్టణ స్థానిక సంస్థలన్నీ పూర్తిస్థాయిలో పనిచేయాలని పురపాలకశాఖ డైరెక్టర్ సత్యనారాయణ సోమవారం ఆదేశించారు. అత్యవసర కార్యకలాపాలు చేపట్టేందుకు అనుమతించిన ప్రభుత్వ సంస్థలు, దుకాణాల్లో మూడు అడుగుల సామాజిక దూరాన్ని పాటించేలా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. 141 పురపాలికల్లో ప్రతి కార్యాలయం, దుకాణాల్లో విధిగా శానిటైజర్లు లేదా చేతులు కడుక్కునే సౌలభ్యాన్ని కల్పించాలని తెలిపారు. రహదారులను క్రమం తప్పకుండా శుభ్రపర్చాలని చెప్పారు.

# గడప దాటని గ్రామం

- పల్లెల్లో నిలిచిపోయిన ప్రజారవాణా
- ఊర్లోకి రావాలంటే సర్పంచ్, కార్యదర్శి అనుమతి తప్పనిసరి
- 32 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో పరిశుభ్రత పనులు
- విదేశాల నుంచి గ్రామాలకు 230 మంది వచ్చినట్టు గుర్తింపు



తమ గ్రామానికి ఇతరులెవరూ రాకుండా బారికేడ్లు ఏర్పాటుచేసుకున్న నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చిరుమర్తి గ్రామస్థులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా గ్రామాల్లో ప్రజారవాణా నిలిచింది. గ్రామాల ప్రజలంతా ఇండ్లకే పరిమితమయ్యారు. కూలీ పనులకు సైతం దూరంగా ఉన్నారు. వ్యవసాయ పనులకు ప్రభుత్వం అనుమతిచ్చినప్పటికీ.. అత్యవసరాలు లేకపోవడంతో రైతులు పొలానికి వెళ్లలేదు. ప్రభుత్వం సెలవులివ్వడంతో ఇంటిల్లిపాదీ ఆడుతూ, పాడుతూ గడుపుతున్నారు. గ్రామాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి మస్కూరిలతో కాపలా పెట్టారు. సర్పంచ్, కార్యదర్శి అనుమతి లేనిదే గ్రామంలోకి కొత్తవారిని రానీయడంలేదు. మరోవైపు విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారిని గుర్తించిన పంచాయతీ సిబ్బంది.. వారిని ఇండ్ల నుంచి బయటకు రానీయకుండా చూస్తున్నారు. ఆదివారం మొదలైన జనతా కర్ఫ్యూ తరహాలోనే గ్రామాల్లో కూడా లాక్‌డౌన్ కొనసాగుతున్నది. ప్రభుత్వం లాక్‌డౌన్‌ను సీరియస్‌గా తీసుకోవడంతో రవాణా పూర్తిగా నిలిచిపోయింది. గ్రామాల్లోకి అత్యవసరమైతే తప్ప వాహనాలను అనుమతించడం లేదు.

### యుద్ధంలా పారిశుద్ధ్య పనులు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు జోరందుకున్నాయి. ఉదయం, సాయంత్రం వీధులను పరిశుభ్రం చేస్తున్నారు. దాదాపు 32వేల మంది పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉంటున్నారు. పెద్దగ్రామాలు, పట్టణాల్లో 144 సెక్షన్ అమల్లోకి తెచ్చారు. బైక్‌లపై తిరిగేవారిని పట్టుకొని వాహనాలను సీజ్ చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇండ్లుదాటి బయటకు రావద్దని ప్రచారంచేస్తున్నారు. ఇప్పటికే వారాంతపు సంతలు, మార్కెట్లుమూతపడ్డాయి. గ్రామంలోకి కొత్తవారు ఎవరువచ్చినా వెంటనే సమాచారమివ్వాలని జిల్లా అధికారులు గ్రామ సచివాలయాలకు సమాచారమిచ్చారు. గత పదిరోజుల వ్యవధిలో ఇతరరాష్ట్రాల నుంచి 3,546 మంది వచ్చినట్టు పంచాయతీ అధికారులు గుర్తించారు. దాదాపు 230 మంది విదేశాల నుంచి గ్రామాలకు వచ్చినట్టు తేలింది. వీరికి నిత్యం ఆరోగ్య పరీక్షలు జరుపుతున్నట్టు జిల్లా అధికారులు చెప్తున్నారు.

## నేటినుంచి సీసీఎంబీలో పరీక్షలు

- రోజుకు 500కుపైగా శాంపిళ్లు పరీక్షించే సామర్థ్యం




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ)లో కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. పరీక్షల కోసం అత్యాధునికమైన 12 రియల్ టైమ్ పీసీఆర్‌లను సిద్ధం చేసినట్టు సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా సోమవారం 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. కరోనా పరీక్షలను నిర్వహించడానికి 20 మంది నిపుణులను నియమించినట్టు తెలిపారు. జీవ శాస్త్రం(లైఫ్ సైన్సెస్) పరిశోధనల్లో అగ్రస్థానంలో ఉన్న సీసీఎంబీని కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలకు వేదికగా వాడుకోవడానికి అవకాశమివ్వాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సానుకూలంగా స్పందించిన విషయం తెలిసిందే. పరీక్షల నిర్వహణకు తమకు కేంద్రం నుంచి లిఖిత పూర్వకంగా అనుమతి లభించిందని సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా తెలిపారు. కరోనా నిర్ధారణ పరీక్షలకు తాము సర్వ సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. మంగళవారం నుంచి నమూనాలను పంపితే తాము పరీక్షలను నిర్వహిస్తామని గాంధీ, ఉస్మానియా దవాఖానల వైద్యాధికారులకు సమాచారమిచ్చారు. రోజుకు 500కుపైగా నమూనాలను పరిశీలించే సామర్థ్యం సీసీఎంబీకి ఉన్నది.

## రాజధానిలో సోడియం హైపోక్లోరైట్ స్ప్రే

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ నిర్మూలన చర్యల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది సమస్యాత్మక ప్రాంతాల్లో సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని విస్తృతంగా చల్లుతున్నారు. ఇందుకోసం దేశంలోనే తొలిసారి జెట్టింగ్ యంత్రాలను ఉపయోగిస్తున్నారు. క్రిమికీటకాలతోపాటు ఎటువంటి బ్యాక్టీరియానైనా నాశనం చేయడం ఈ ద్రావణం ప్రత్యేకత. పరిసరాల పరిశుభ్రత, దుర్వాసన తొలిగింపు, బ్లీచింగ్ లాంటి పనులకు ఎంతో ఉపకరించే ఈ ద్రావణం 12 నుంచి 14 గంటలపాటు ప్రభావవంతంగా పనిచేస్తుందని అధికారులు తెలిపారు.

## సింగరేణి అప్రమత్తం

- కరోనా వైరస్ నియంత్రణకు తగిన చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా విజృంభణ నేపథ్యంలో సింగరేణి అప్రమత్తమైంది. విద్యుదుత్పత్తికి అవసరమైన బొగ్గు సరఫరాకు సింగరేణి అత్యవసర సేవలందించాల్సి ఉన్నందున.విధులకు హాజరయ్యే ఉద్యోగులపట్ల ముందు జాగ్రత్తలు తీసుకొంటున్నది. గనులు, వివిధ శాఖల ప్రవేశ ద్వారాలవద్ద ఉద్యోగులందరికీ తప్పనిసరిగా థర్మల్ స్క్రీనింగ్, క్యూలైన్‌లో వ్యక్తుల మధ్య దూరం ఉండేలా గుర్తుల ఏర్పాటు, ఇతర ప్రాంతాలనుంచి బంధువులు వస్తే సమాచారం ఇవ్వడం, వాష్‌రూముల్లో సబ్బులు, శానిటైజర్ల ఏర్పాటు, లిఫ్టుల్లో జాగ్రత్తలు, క్యాంటీన్‌లో సామాజిక దూరాన్ని పాటించేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకొంటున్నది.

- కర్ఫ్యూతో కట్టడి



సోమవారం రాత్రి 7 గంటల నుంచి కర్ఫ్యూ అమలుచేయడంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్న సచివాలయం సమీపంలోని తెలుగుతల్లి ఫ్లైఓవర్ ప్రాంతం

## నేటినుంచి టీ-సాట్ ప్రత్యేక పాఠాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎంసెట్, నీట్, ఐఐటీ మెయిన్స్ విద్యార్థుల కోసం మంగళవారం నుంచి మే మూడోతేదీ వరకు టీ-సాట్ నెట్‌వర్క్ చానళ్లలో ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రసారంచేయనున్నట్టు టీ-సాట్ సీఈవో ఆర్ శైలేశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథ్స్ 1 అండ్ 2, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టుల అధ్యాపకులు బోధించిన పాఠ్యాంశాలను 43 రోజులపాటు 500 ఎపిసోడ్లుగా ప్రసారంచేస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు నిపుణ చానల్‌లో, ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 12 గంటల వరకు విద్యాచానల్‌లో పాఠాలు ప్రసారం కానున్నాయని ఆయన వెల్లడించారు. నిత్యం 11 గంటలపాటు ప్రసారాలు కొనసాగుతాయని తెలిపారు.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
బహిరంగ ప్రకటన
Date: 24.03.2020
విద్యుత్ రిటైల్ సప్లై చార్జీలు, క్రాస్ సబ్సిడీ సర్చార్జీ మరియు అదనపు సర్చార్జీ 2020 - 21 ఆర్థిక సంవత్సరం నకు
ఇందు మూలంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ మరియు సిరిసిల్ల గ్రామీణ విద్యుత్ సరఫరా సహకార సంఘం పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు తెలియ చేయునది ఏమనగా, ప్రస్తుతం అమలులో ఉన్న విద్యుత్ చార్జీలు కొనసాగించుటకు గౌరవనీయ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి వారు తేదీ : 20.03.2020 నందు I.A. No.8 of 2020 in O.P. Nos.21 & 22 of 2017 జారీ చేసిన ఆర్డర్ కు అనుగుణంగా మరియు టి ఎస్ ఈ ఆర్ సి వారు జారీ చేసిన రిటైల్ సప్లై టారిఫ్ ఆర్డర్ తేదీ 27.03.2018, క్రాస్ సబ్సిడీ సర్చార్జీ, అదనపు సర్చార్జి ఆర్డర్ తేదీ 27.03.2018లో నిర్ణయించబడిన రిటైల్ సప్లై విద్యుత్ చార్జీలు, క్రాస్ సబ్సిడీ సర్చార్జీ, అదనపు సర్చార్జి మరియు వాటి నియమ నిబంధనలు, 01.04.2020 తేదీ నుండి గౌరవనీయ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి వారు ఆర్థిక సంవత్సరం 2020-21నకు విద్యుత్ రిటైల్ సప్లై చార్జీలు, క్రాస్ సబ్సిడీ సర్చార్జి మరియు అదనపు సర్చార్జి ఆర్డర్లు జారీ చేయువరకు అమలులో కొనసాగుతాయి.
సం/-
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
సం/-
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ

# సానుకూలత తక్షణావసరం

కరాళనృత్యం చేస్తున్న కరోనా వైరస్‌ను కట్టడిచేసి, పౌరులను రక్షించుకొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుచూపుతో మార్చి 31 వరకు లాక్‌డౌన్ ప్రకటించి సకల చర్యలు తీసుకొంటున్నది. ఉరుకులు పరుగులతో ఇన్నాళ్లూ గడిపినవారికి ఈ విరామం క్షణమొక యుగంగా అనిపించవచ్చు. అత్యవసర సేవలు అందించేవారు మినహా, యావత్ రాష్ట్ర ప్రజలు ఇండ్లకే పరిమితమైన వేళ.. మేనేజ్‌మెంట్ ట్రైనింగ్‌లో నిపుణుడైన సీనియర్ జర్నలిస్ట్, అడ్మినిస్ట్రేటివ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) పౌర సంబంధాల విభాగ అధిపతి డాక్టర్ సూరావఝ్ఝుల రాము అందిస్తున్న రెండో వ్యాసమిది.



## విరామ యోగం-2



మొట్టమొదటి సారిగా.. ఆహార సముపార్జనలో భాగంగా జనాల రక్తం పీల్చడానికి వెళ్లి వచ్చింది ఒక పిల్ల దోమ. ఎట్లా జరిగింది నీ ప్రయాణమని తల్లి దోమ అడిగింది. ఓహ్.. బ్రహ్మాండంగా జరిగిందమ్మా.. నాకు ప్రజలు చప్పట్లతో స్వాగతం పలికారు, అని పిల్ల దోమ చెప్పింది. కుట్టే దోమను చంపాలని ప్రయత్నించిన జనాన్ని తప్పించుకొని వచ్చిన పిల్ల దోమ.. తనకెదురైన పరిస్థితిని పాజిటివ్‌గా తీసుకుంది. అది రక్తాన్వేషణలో కుట్టకా తప్పదు, జనం దానిని ఖతం చేయాలని రెండు చేతులతో కొట్టకా తప్పదు. దానికి చేసేది ఏమీ లేదు, పాజిటివ్‌గా తీసుకోవడం మినహా!

చైనా, ఇటలీ, ఇరాన్ తదితర దేశాల్లో ఇప్పటికే పెద్ద సంఖ్యలో జనాలను పొట్టనబెట్టుకొన్న కొవిడ్-19 వైరస్ మనముందున్న ఒక చేదు వాస్తవం. మొదట్లో అర్థంకాక, ప్రభావం అంచనా వేయలేక, ఆ తర్వాత ప్రజలు సహకరించక ఆ దేశాలు పౌరులను కోల్పోతున్నాయి. వారితో పోలిస్తే మనం ఎంతో నయం కదూ! మన ప్రభుత్వాలు ఎంతో ముందుచూపుతో చర్యలు తీసుకొంటున్నాయి.

వారం పదిరోజుల కిందటి వరకూ లేని పరిస్థితి ఎదురుకావడం, జీవితంలో ఎప్పుడూ లేనివిధంగా ఇంటికే పరిమితమై భయంతో బిక్కుబిక్కున (ఫిమర్ సైకోసిస్‌తో) బతకడం మనను, మన కుటుంబసభ్యులను షాక్‌కు గురిచేయడం సహజం. ఒక పక్కన ప్రపంచ ఆరోగ్య సంస్థ (హూ) ఈ పరిస్థితిని 'అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్న ప్రజారోగ్య అత్యయిక స్థితి (పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్) అని ప్రకటించింది. 31 అంశాలతో హూ.. మార్గదర్శక సూత్రాలను ప్రకటించినా.. ఏ పూట ఏమవుతుందో తెలియని విషాదపూర్వక అనిశ్చితి కారుమబ్బుల్లా కమ్ముకొచ్చిన తరుణంలో మనమంతా సానుకూల దృక్పథం, సకారాత్మక ధోరణితో ఉండటం తక్షణావసరం, కనీస ధర్మం.

### దిగులు పడకండి

వివిధ దేశాల నుంచి వస్తున్న విషాద సమాచారం, కొన్ని వార్తాసంస్థలు హోరెత్తిస్తున్న సంచలనాత్మక కథనాలు గుండె గుభేల్మనిపిస్తున్నాయి. థర్డ్ స్టేజ్ అంటున్నారు.. ఇప్పటికే కరోనాకు సంబంధించిన వార్తలు చూసి చూసి, సోషల్ మీడియాలో సత్యాలు, అర్ధసత్యాలు, అసత్యాలు, అపోహలు చదివి చదివి.. రాత్రి పూట నిద్రపట్టని వాళ్ళు చాలామంది ఉన్నారు. అయ్యలారా, అమ్మలారా.. దిగులు పడకండి. జీవితంలో ఏదో ఒక దశలో మీకు అనుభవమయ్యే ఉంటుంది ఈ సత్యం: జరిగేది జరుగక మానదు. అంతా మేలే జరుగుతుందని త్రికరణశుద్ధిగా నమ్మండి. మనందరి పాజిటివ్ శక్తితో కథ సుఖాంతమే అవుతుందని దృఢంగా విశ్వసించండి. దేవుడ్ని లేదా దేవతను నమ్మితే వారి మీద నమ్మకం ఉంచండి. ఠాట్ కుదరదు.. అంటే.. ఇప్పటికే కరోనాకు విరుగుడు కనిపెట్టేందుకు అహరహం శ్రమిస్తున్న శాస్త్రవేత్తలను నమ్మండి. మంచి జరుగాలని, ఎవరో మంచి చేస్తారని గట్టిగా విశ్వసించడం ఒక్కటే ప్రస్తుతానికి మనందరి ముందున్న మార్గం.

### పెద్దలకు ధైర్యం చెప్పండి

మృతుల్లో.. తమ ఈడువారు ఎక్కువగా ఉండటం సహజంగానే వ్యాధినిరోధక శక్తి లేని వయోవృద్ధులలో కలవరం కలిగిస్తుంది. అప్పటికే అనారోగ్యంతో సతమతమవుతూ పిల్లలకు భారంగా ఉన్నామని మూగగా రోదించే వారికి కరోనా ఆందోళనను, ఉద్రేకాన్ని కలిగించి చీకాకు పరుస్తుంది. నైరాశ్యం అలుముకొన్న ఈ పెద్దలతో సానుభూతితో మెలగాలి. వారికి ధైర్యం చెప్పాలి. ఈ పరిణామాలను చూసి జడుసుకొనే, విచారంగా ఉండే పిల్లల పట్ల కూడా సానుభూతితో మెలుగుతూ, తమ భావాలను వెలిబుచ్చే వాతావరణాన్ని కల్పించాలని హూ ప్రత్యేకంగా సూచించింది.

### మానసిక ఆరోగ్యంపై ప్రభావం

మందూ మాకూ లేని కరోనా సృష్టించిన ఒక అసాధారణ పరిస్థితి మన మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉన్నది. స్వీయ గృహనిర్బంధం (సెల్ఫ్ ఐసోలేషన్), ఇతరులకు దూరంగా ఉండటం (సోషల్ డిస్టెంసింగ్) కచ్చితంగా మానసిక ప్రభావం చూపుతుందని వైద్యశాస్త్రంలో పేరెన్నికగన్న 'ది లాంసెట్' అనే జర్నల్ స్పష్టంచేసింది. కరోనా జాతికే చెందిన సార్స్ సోకినప్పుడు 2003లో క్వారంటైన్ జరిగిన రోగుల్లో దాదాపు పావు సగం మంది మానసిక ఒత్తిడికి (పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిసార్డర్-పీటీఎస్డీ) గురయ్యారని వివిధ అధ్యయనాల్లో వెల్లడయ్యింది. ఇలాంటివారికి కుటుంబసభ్యుల వెన్నుదన్నులు కావాలి. లాక్‌డౌన్ సమయం ఇందుకు దోహదపడుతుంది. దీన్ని సద్వినియోగం చేయాలి.

### నిరాశ నిస్పృహలు వద్దు

కరోనా సృష్టించిన వాతావరణం వల్ల మన కుటుంబసభ్యుల్లో, మిత్రుల్లో, సన్నిహితుల్లో కోపం, నిరాశ నిస్పృహలు పెరుగుతాయని నిపుణులు అంటున్నారు. విద్యావంతులు ఈ అంశాలపై దృష్టి కేంద్రీకరించి ఇంటిల్లిపాది, సమాజం సానుకూల దృక్పథంతో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈ వారం పదిరోజులు ఏ మాత్రం నెగిటివ్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వకండి. ఇన్నాళ్లూ.. మీ ఆఫీసుల్లో, పరిశ్రమల్లో, పని ప్రదేశాల్లో చీకూ చింతా లేకుండా శ్రమించేందుకు చేదోడు వాదోడుగా ఉన్న, ఎన్నోవిధాలుగా సహకరించి ఆనందం పంచిన కుటుంబసభ్యులకు, మిత్రులకు పాజిటివిటీ అనే అద్భుతమైన మందు అందించాల్సిన గురుతర బాధ్యత మీదే. గుర్తుందిగా పిల్ల దోమ!

**అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) చెప్తున్న ప్రకారం, ఈ కింది లక్షణాలు ఉన్నవారి మానసిక ఆరోగ్యం సరిగా లేదని అర్థంచేసుకుని, తగు జాగ్రత్తలు తీసుకోవాలి.**

- సొంత ఆరోగ్యం గురించి ఎక్కువ భయపడుతూ, ఆందోళన చెందడం.
- ఆహారం, నిద్ర విధానాల్లో మార్పులు.
- నిద్ర పట్టకపోవడం, దృష్టిని ఒక విషయం మీద కేంద్రీకరించకపోవడం.
- అప్పటికే ఇబ్బందిపెడుతున్న ఆరోగ్య సమస్యలు ముదరడం.
- ఆల్కహాల్, పొగాకు లేదా ఇతర మత్తు పదార్థాల వాడకం పెంచడం.

## ప్రభుత్వానికి సహకరిద్దాం

- అసదుద్దీన్ విజ్ఞప్తి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా మహమ్మారిని తరిమికొట్టడంలో ప్రభుత్వానికి సహకరించాలని మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలకు విజ్ఞప్తిచేశారు. ఆదివారం 24 గంటల జనతా కర్ఫ్యూ అమలుకు సహకరించినట్టుగానే లాక్‌డౌన్ అమలులో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సామూహిక నమాజులు చేయాలా? వద్దా? అనే విషయంపై మత పెద్దలు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. నమాజుకు వెళ్లినా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కరచాలనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నదని అభినందించారు.


## పరిశుభ్రంగా క్వారంటైన్ గదులు

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్వారంటైన్ కేంద్రాల్లో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. క్వారంటైన్ గదుల పరిశుభ్రతపై మీడియాలో వచ్చిన కథనాలను హైకోర్టు ప్రజాప్రయోజన వాజ్యంగా స్వీకరించింది. జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు, జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్‌తో కూడిన ధర్మాసనం దీనిపై సోమవారం విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. క్వారంటైన్ గదులను శుభ్రంగా ఉంచుతున్నామని, ఎక్కడైనా అపరిశుభ్రంగా ఉంటే సరిచేస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం శుభ్రతపై రాజీపడొద్దని సూచించింది.

## ఇటలీలో చిక్కుకొన్న హైదరాబాదీ

- కరోనా వ్యాప్తితో నెలరోజులుగా ఇంటికే పరిమితం
- పలువురు భారత విద్యార్థులదీ ఇదే పరిస్థితి
- కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని అభిలాష్ విజ్ఞప్తి



**హైద్రాబాద్:** హైదరాబాద్‌కు చెందిన డామినిక్ అభిలాష్ గిల్ అనే 27 ఏండ్ల యువకుడు ఇటలీలో చిక్కుకుపోయారు. ఇటలీలోని కటానియా యూనివర్సిటీలో గ్లోబల్ పాలిటిక్స్ అండ్ యూరో మెడిటెరేనియన్ రిలేషన్స్‌లో మాస్టర్స్ విద్యనభ్యసిస్తున్న అభిలాష్.. ఆ దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి అధికంగా ఉండటంతో నెలరోజుల నుంచి ఇంటికే పరిమితమయ్యారు. అక్కడున్న అనేకమంది భారత విద్యార్థుల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉన్నదని, దీనిపై భారత ఎంబసీ అధికారులతో మాట్లాడేందుకు ప్రయత్నించినా పురోగతి లేదని అభిలాష్ 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. ప్రస్తుతం ఇటలీలో అన్ని నగరాలు లాక్‌డౌన్ అయ్యాయని, జూన్ వరకు లాక్‌డౌన్ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. కటానియా నగరంలో ఎక్కువగా సిసిలీ ప్రజలకు చికిత్స అందిస్తున్నారని, భారత విద్యార్థులు వేర్వేరు నగరాల్లో చిక్కుకుపోయారని, వీరిని రక్షించేందుకు భారత ప్రభుత్వం చొరవ చూపాలని, స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అభిలాష్ విజ్ఞప్తిచేశారు.

## నిజామాబాద్ ఎమ్మెల్సీ బరిలో ముగ్గురు

- ఏప్రిల్ 7న ఎన్నికలు

**నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** స్థానిక సంస్థల కోటాలో నిజామాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికల బరిలో ముగ్గురు అభ్యర్థులు నిలిచారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. కాంగ్రెస్ తరఫున నామినేషన్ వేసిన మానాల మోహన్‌రెడ్డి చివరిరోజున నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సుభాష్‌రెడ్డికి బీఫాం ఇచ్చారు. టీఆర్‌ఎస్ తరఫున మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, బీజేపీ అభ్యర్థిగా పోతన్‌కర్ లక్ష్మీనారాయణ బరిలో ఉన్నారు. వచ్చేనెల 7న పోలింగ్, 9న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.



## తిరుమలలో శ్రీరామనవమి రద్దు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ భద్రాచలం/ వేములవాడ కల్చరల్:** తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలతోపాటు తెప్పోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రద్దుచేసింది. ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్టు టీటీడీ ప్రకటించింది. శ్రీకోదండరామస్వామి ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవా లు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి తదితరులు పాల్గొన్నారు.

### భద్రాచలంలో నిరాడంబరంగా..

భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను ఈ నెల 25 నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకు నిరాడంబరంగా నిర్వహించాలని నిర్ణయించారు. బుధవారం ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 2న శ్రీసీతారాముల తిరుకల్యాణం, మరుసటిరోజున శ్రీరామపట్టాభిషేకం నిర్వహిస్తారు.

### ఎములాడ ఆలయంలో..

వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించాల్సిన రాములోరి లగ్గంతోపాటు రథోత్సవాన్ని రద్దుచేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఉగాది పంచాంగ శ్రవణం ఆలయం లోపల అర్చకులతో మాత్రమే నిర్వహించనున్నారు.

### నేడు ఆలయాల్లో హోమాలు

కరోనా వైరస్ నుంచి ప్రజలకు విముక్తి కలగాలని ప్రార్థిస్తూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పలు ఆలయా ల్లో హోమాలు నిర్వహిస్తున్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం హోమం నిర్వహించారు. మంగళవారం కాళేశ్వరం దేవాలయం, గద్వాల జిల్లా జోగులాంబ దేవాలయం, మెదక్ జిల్లా ఏడుపాయల దుర్గభావాని దేవాలయాల్లో మృత్యుంజయ హోమాలు నిర్వహిస్తారు.

## నిర్లక్ష్యమే వైరస్..!

### కానరాని జనతా కర్ఫ్యూ స్ఫూర్తి

**లాక్‌డౌన్‌లోనూ రోడ్లపై బండ్లు ■ రాజధాని రోడ్లలో బైక్‌లపై చక్కర్లు**

**ప్రజారవాణా బంద్ చేసినా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో తిప్పలు**




హైదరాబాద్‌లో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు చలాన్లు వేస్తున్న పోలీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంతఃపురంలో వేడుకల కోసం రాజ్యంలోని ప్రజలందరూ బిందెడు పాలు తీసుకొచ్చి కడవల్లో పోయాలని చాటింపు వేశారట.. తమ ప్రజలే కదా అందరూ తెచ్చిన పాల నురగలతో కడవలన్నీ పొంగిపొర్లుతాయని భావించారట రాజుగారు.. తీరా చూస్తే కడవలన్నీ నీళ్లతో నిండినయి కానీ పాలు మాత్రం కన్పించలేదట.. అందరూ పాలు పోస్తారు.. నేనొక్కడిని నీళ్లు పోస్తే ఏమవుతుందిలే అని ఒక్కొక్కరు తమకుతామే అనుకోవడంతో కడవలన్నీ నీళ్లతో నిండాయని ఓ కథనం.. ప్రస్తుతం కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ విషయంలోనూ సరిగ్గా ఇదే జరుగుతున్నది. నేనొక్కడినే బయటకొస్తే ఏమవుతుంది? అనుకోవడంతో రోడ్లన్నీ వాహనాలతో నిండిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా జనతా కర్ఫ్యూను కనీవినీ ఎరుగనిరీతిలో విజయవంతం చేసిన ప్రజలు లాక్‌డౌన్ విషయంలో ఆ స్ఫూర్తిని చూపడంలేదు. మరో వారంపాటు ఇంటికే పరిమితమైతే మహమ్మారిని తరిమికొట్టొచ్చని సీఎం కేసీఆర్ విజ్ఞప్తిచేసినా పట్టించుకోనట్టు కన్పిస్తున్నది. సోమవారం హైదరాబాద్‌తోపాటు పలు నగరాల్లో పరిస్థితి ఇందుకు అద్దంపడుతున్నది. కొందరి నిర్లక్ష్యం వైరస్ వ్యాప్తిని నిరోధించడం అటుంచి.. ఇంకా విజృంభించడానికి కారణమవుతున్నది. 'నాకేమైతుందిలే' అనే ధోరణి కరోనా వైరస్ కంటే ప్రమాదకరంగా తయారయిందని పలువురు పేర్కొంటున్నారు. జనతా కర్ఫ్యూ సమయంలో 24 గంటలపాటు ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ఇంటికే పరిమితం కావడంతో శాస్త్రీయంగా కరోనా వైరస్‌ను విచ్ఛిన్నం చేశామనే చైతన్యం కనిపించింది. లాక్‌డౌన్ సమయంలో కొందరి నిర్లక్ష్యంతో కరోనా అంతకంతకూ రెట్టింపు అయ్యే ప్రమాదమున్నది.

### మాస్కులతో యువత చక్కర్లు

రోడ్లపైకి వచ్చినవారిలో యువతే ఎక్కువగా ఉన్నారు. వీళ్లంతా మాస్కులు వేసుకొని బైక్‌లపై చక్కర్లు కొట్టడం కన్పించింది. వైద్యనిపుణులు, మేధావుల మథనం తర్వాతే ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. తద్వారానే కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించవచ్చనే శాస్త్రీయ నిర్ణయానికొచ్చింది. మాస్కులతోనే వైరస్ వ్యాప్తిని నిరోధించగలిగితే ప్రభుత్వాలే ఆ వెసులుబాటు కల్పించేవి. ఈమాత్రం అవగాహన లేకుండా కొందరు మాస్కులు వేసుకొని తాము సురక్షితంగా ఉన్నాంకదా అనే భావనతో రోడ్లపైకి వచ్చి తిరిగి సమూహంగా ఏర్పాటవుతున్నారు. తద్వారా నిజంగా అత్యవసర పనులపై వెళ్లే వారికి ఇబ్బంది కలుగుతున్నది.




హైదరాబాద్‌లో వాహనచోదకులకు దండం పెట్టి, సహకరించాలని కోరుతున్న పోలీసులు

### నిర్బంధం అవసరమా?

హైదరాబాద్‌లో సోమవారం ఒక్కొక్కరుగా రోడ్లమీదకు వచ్చారు. నిత్యం కిక్కిరిసిన వాహనాలతో ఉండే రోడ్లపై వీరి ప్రభావం పెద్దగా కనిపించకపోవచ్చు. కానీ, కూడళ్ల దగ్గరికొచ్చేసరికి వాహనాలన్నీ ఒకేచోట కలిసి తిరిగి సాధారణ జనజీవనాన్ని తలపించింది. ఇంటినుంచి బయటికొచ్చే వారంతా కూడళ్ల వద్ద కలవడంతో అదేపెద్ద వైరస్‌లా మారింది. దీంతో కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు అధికారులందరూ రోడ్ల మీద కొచ్చి పదేపదే లాక్‌డౌన్‌ను గుర్తుచేయాల్సి వచ్చింది. బేగంపేట, ఆబిడ్స్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో కూడళ్ల వద్ద భారీఎత్తున వాహనాలు నిలిచిపోయిన దృశ్యాలు కనిపించడంతో కొన్నిచోట్ల పోలీసులు కొద్దిగా కఠినంగా వ్యవహరించక తప్పలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్బంధంగా వ్యవహరిస్తే తప్ప ఎవరికివారు తమ బాధ్యతలను నిర్వర్తించలేరా? అనే నిర్లిప్తత వ్యక్తమవుతున్నది.

## తప్పించుకోలేని ముద్ర!

- విదేశాల నుంచి వచ్చిన వారికి చేతిపై ముద్రవేస్తున్న అధికారులు
- ముద్రపడినవారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ర్యాపిడ్ రెస్పాన్స్ టీం

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఇప్పుడు అందరినీ ఆ ముద్ర టెన్షన్‌కు గురిచేస్తున్నది. ఆ ముద్రే కండ్లుగప్పి రైల్లో ప్రయాణిస్తున్న దంపతులను కాజీపేటలో పట్టించింది. ముద్ర పడకుండా ఉండాలంటే ప్రభుత్వం చెప్పిన మార్గదర్శకాలను విధిగా పాటించాలని కోరుతున్నారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముద్ర వేయించుకొన్న పలువురు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నది. దీనిలో భాగంగా విదేశాల నుంచి గానీ, వివిధ రాష్ట్రాల నుంచి గానీ వచ్చినవారు తప్పనిసరిగా 14 రోజులపాటు హోం క్వారంటైన్‌లో గడపాల్సి ఉంటుంది. ఇలాంటి వారిని గుర్తించేందుకు వీలుగా, ఇలాంటి వారు జనసమూహాలతో కలువకుండా చూసేందుకు వీలుగా వారి చేతిపై హోం క్వారంటైన్ అనే ముద్ర వేస్తున్నారు. అలాగే వీరు ఎన్ని రోజులపాటు స్వీయ నిర్బంధంలో గడుపాలో కూడా ముద్రలో స్పష్టంచేస్తున్నారు. దాంతో ఈ ముద్ర పడిన వారు ప్రజల కండ్ల నుంచి తప్పించుకొని తిరుగలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ముద్రే వారిని తమ కుటుంబసభ్యుల నుంచి దూరం పెట్టేలా చేస్తున్నది. ఇటలీ ప్రభుత్వం కూడా ఇలాంటి ముద్ర వేసే నిర్ణయం తీసుకొన్నది. అయితే అక్కడి ప్రజలు దాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం వల్ల జరుగాల్సిన అనర్థం జరిగిపోయిందని ఇటీవలే ఇటలీ నుంచి హన్మకొండలోని రెవెన్యూ కాలనీకి వచ్చిన ఓ యువకుడు తన అనుభవాల్ని చెప్పారు. ఇక్కడికి వచ్చిన తర్వాత తన చేతి మణికట్టు వద్ద ముద్ర వేశారని, పదిరోజుల్లో తెలంగాణ వైద్యాధికారులు చాలాసార్లు నా ఆరోగ్యం గురించి వాకబుచేశారన్నారు. ఇటలీ స్టాంపిగ్ మర్చిపోతానే మోగానీ.. ఇక్కడి ముద్ర మాత్రం జీవితంలో మరిచిపోలేనని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం, అధికారులు ఇంత కఠిన చర్యలు తీసుకోవడం వల్లనే వైరస్ వ్యాప్తి ఎక్కువ లేకుండా నిలువరించగలిగారని సంతోషం వ్యక్తంచేశారు. ముద్ర పడినవారి ఆరోగ్యం గురించి వాకబు చేస్తూ, వారి కుటుంబసభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఏరోజుకారోజు ర్యాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు సూచిస్తున్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలో 35 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు పనిచేస్తున్నాయి. వరంగల్ అర్బన్ జిల్లావ్యాప్తంగా మార్చి 1 నుంచి వివిధ దేశాల నుంచి వచ్చినవారు 522 మంది ఉండగా.. వీరిలో 133 మందికి హోం క్వారంటైన్ పూర్తయింది. 173 మందికి క్వారంటైన్ ముద్రలు వేశారు.

### సికింద్రాబాద్ స్టేషన్‌లో ముద్ర కలకలం

**మారేడ్‌పల్లి:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో క్వారంటైన్ ముద్ర కలకలం సృష్టించింది. స్టేషన్ ఔట్ గేట్ వద్ద హోం క్వారంటైన్ ముద్రతో ఒక మహిళ రావడంతో స్థానికులు భయపడిపోయారు. విజయవాడకు చెందిన 40 ఏండ్ల మహిళ ఈ నెల 20న దుబాయి నుంచి వచ్చింది. వైద్యపరీక్షలు జరిపి రెండ్రోజుల పాటు ఎయిర్‌పోర్ట్ క్వారంటైన్‌లో ఉంచారు. గాంధీ దవాఖాన క్వారంటైన్‌లో ఉండాలని వైద్యులు సూచించి పంపగా.. సదరు మహిళ విజయవాడ వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. ఆ మహిళ చేతికి ముద్రను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దాంతో గోపాలపురం పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది అమీర్‌పేటలోని బంధువుల ఇంటికి ఆమెను పంపించారు.



ఇటలీ నుంచి వరంగల్ అర్బన్ జిల్లాకు వచ్చిన యువకుడి చేతిపై వేసిన క్వారంటైన్ ముద్ర

### సెల్ఫ్ ఐసొలేషన్‌లో 800 మంది టెకీలు!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నేపథ్యంలో 800 మందికిపైగా టెకీలు సెల్ఫ్ ఐసొలేషన్‌లో ఉన్నారని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఐటీ సంస్థల తరఫున విదేశాలకు వెళ్లివచ్చినవారు, విదేశీ అతిథులు వీరిలో ఉన్నారని తెలిపారు. 20 రోజులపాటు సెల్ఫ్ ఐసొలేషన్‌లో ఉండాలని సూచించామని, ప్రస్తుతం ఐసొలేషన్‌లో ఉన్న ఐటీ రంగానికి చెందినవారి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. ఐటీ సంస్థలే తమ ఉద్యోగులు ఐసొలేషన్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు.

### 7,500 మంది హోంక్వారంటైన్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఇప్పటివరకు విదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చినవారిలో దాదాపు 7,500 మందిని హోం క్వారంటైన్‌కు సిఫారసు చేసినట్టు అధికారులు తెలిపారు. వీరిలో పది మంది బయట తిరుగుతున్నట్టు గుర్తించిన నిఘా బృందాలు సోమవారం వారిని ప్రభుత్వ క్వారంటైన్ కేంద్రాలకు తరలించాయి. హోం క్వారంటైన్‌లో ఉండాల్సినవారంతా ఇంటి వద్దనే ఉంటున్నారా? బయట తిరుగుతున్నారా? వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉన్నది? తదితర అంశాలపై ప్రత్యేక బృందాలు ఆరా తీస్తున్నాయి. వారి యోగక్షేమాలను జీహెచ్‌ఎంసీ, పోలీసు, వైద్యశాఖ అధికారులతో ఏర్పాటైన 150 బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. ఇప్పటివరకు ఎవరికీ అనారోగ్య లక్షణాలు కనిపించకపోయినప్పటికీ, దాదాపు పదిమంది హోం క్వారంటైన్‌లో ఉండకుండా బయట తిరుగుతున్నట్టు గుర్తించారు.



బీఆర్కే భవన్‌లో సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రులు నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు

## గ్రామంలోనే ధాన్యం కొనుగోళ్లు

- ధాన్యం కోసం రూ.25 వేల కోట్ల బ్యాంకు గ్యారంటీ
- రూ.1,760 చొప్పున యాసంగి మక్కజొన్న కొనుగోళ్లు
- వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలో లాక్‌డౌన్ వల్ల రైతులకు ఇబ్బంది లేకుండా గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. లాక్‌డౌన్ ప్రభావం ధాన్యం కొనుగోళ్లపై పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం ఆయన బీఆర్కేభవన్‌లో పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్, సీఎస్ సోమేశ్‌కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, పౌరసరఫరాలశాఖ, సహకారశాఖల కమిషనర్లు సత్యనారాయణరెడ్డి, వీరబ్రహ్మయ్య, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్ల కోసం రూ.25 వేల కోట్లకు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఆర్థికశాఖను ఆదేశించినట్టు తెలిపారు. యాసంగిలో పండిన మక్కలను రూ.1,760కు కొనుగోలు చేయనున్నట్టు.. పౌల్ట్రీ సంక్షోభం నేపథ్యంలో రైతులు నష్టపోకుండా మార్క్‌ఫెడ్ ద్వారా వెంటనే కొనుగోలు చేయాలని సీఎం ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. గ్రామాల నుంచి రైతులు పట్టణ మార్కెట్ల వరకూ రాకుండా.. ఆయా గ్రామాల్లోనే ధాన్యం అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామలవారీగా ధాన్యం దిగుబడిని అంచనావేసి కొనుగోళ్లకు టోకెన్ ద్వారా ఏర్పాట్లు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షాలు వస్తే తడువకుండా టార్పాలిన్లు సరఫరా చేయాలని సూచించారు. కొత్తగా 60 వేల టార్పాలిన్లను త్వరగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. వీటన్నింటినీ ఏప్రిల్ 15 వరకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.



**కదలని బస్సు** కర్ఫ్యూ నేపథ్యంలో ఢిల్లీలోని ఇంద్రప్రస్థ క్లస్టర్‌లో డిపోకే పరిమితమైన బస్సులు



**అయినా ఎదురుచూపు** యూపీలోని ఘజియాబాద్‌లో బస్సుకోసం ఎదురుచూపులు



**కదులలేనంత బరువు** లాక్‌డౌన్ నేపథ్యంలో కోల్‌కతా నగరం నుంచి స్వగ్రామాలకు తిరిగి వెళ్తున్న ప్రజలు. బస్సులు పరిమితంగా తిరుగడంతో ఇలా కిక్కిరిసి ప్రయాణించారు.

**తప్పయింది.. మళ్లీ రాను**



కోల్‌కతాలో లాక్‌డౌన్‌ను ధిక్కరించినందుకు పోలీసును క్షమాపణ వేడుకుంటున్న వ్యక్తి



మీడియా ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

# ఇది జీవితకాల సవాల్!

మొదటిపేజీ తరువాయి...

పోరును 'జీవితకాల సవాల్'గా అభివర్ణించారు. ఈ వైరస్ కట్టడికి వినూత్న, సరికొత్త పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. ఇలాంటి విపత్కర సమయంలో మీడియా సిబ్బంది ఈ దేశానికి చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. మహమ్మారి తీవ్రతను, దాని దుష్ప్రభావాలను అర్థం చేసుకొని ప్రజల్లో అవగాహన పెంచుతున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను, నిరాశావాదాన్ని పోగొట్టేలా సానుకూల కథనాలు ప్రసారం చేయాలని కోరారు. 'మనం సుదీర్ఘ యుద్ధం చేయాల్సి ఉన్నది. సామాజిక దూరంపై ప్రతి ఒక్కరిలో చైతన్యం తేవాలి. తాజా పరిస్థితులు, ప్రభుత్వ కీలక నిర్ణయాలు, ఇతరాంశాలను వేగంగా, సులభంగా అర్థమయ్యే భాషలో ప్రజలకు వివరించాలి' అని సూచించారు. కరోనాపై పోరులో మీడియా చానళ్ల ఫీడ్‌బ్యాక్ ఎంతో కీలకంగా మారుతున్నదని, దానికనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు.

**మీటర్ దూరం పాటించండి**

క్షేత్రస్థాయిలోని విలేకరులు కచ్చితంగా సామాజిక దూరం పాటించాలని ప్రధాని మోదీ కోరారు. ఇంటర్వ్యూ చేసే సమయంలో కనీసం ఒక మీటరు ఎడం పాటించాలన్నారు. మీడియా సంస్థలు తమ విలేకరులకు 'బూమ్ మైక్'లను అందజేయాలని సూచించారు. మీడియా శాస్త్రీయమైన సమాచారాన్నే ప్రసారం చేయాలని, నిపుణులతోనే చర్చలు నిర్వహించాలని చెప్పారు. తద్వారా వదంతులు వ్యాప్తి చెందకుండా అడ్డుకోవచ్చన్నారు. శాస్త్రీయ కథనాల ప్రసారం ద్వారా పుకార్లకు అడ్డుకట్ట వేయాలని విన్నవించారు. ప్రజలంతా సామాజిక దూరం పాటించి వైరస్ వ్యాప్తిని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరెన్సీ నోట్ల ద్వారా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు డిజిటల్ చెల్లింపులు పెరిగేలా చైతన్యం తేవాలని కోరారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ప్రధాని మోదీకి పలు సూచనలు చేశారు. తరుచూ జాతినుద్దేశించి ప్రసంగించాలని కోరారు. ఇందులో సానుకూల కథనాలు, కొవిడ్-19 బారిన పడి కోలుకున్న వారి అనుభవాలను ప్రస్తావించాలని సూచించారు. మీడియా ప్రతినిధులను పరీక్షించేందుకు 24గంటలపాటు అందుబాటులో ఉండేలా వైద్య బృందాన్ని నియమించాలని కోరారు. అధికారిక సమాచారాన్ని ప్రసార భారతి ద్వారా రోజుకు రెండుసార్లు వెల్లడించాలని, దానినే ప్రసారం చేస్తామని చెప్పారు.

**ఎయిర్ ఇండియా సిబ్బందికి అభినందనలు**

కరోనా బాధిత దేశాల నుంచి భారతీయులను స్వదేశానికి తీసుకొస్తున్న ఎయిర్ ఇండియా సిబ్బందిని ప్రధాని ప్రశంసించారు. వారి సేవలు మానవత్వానికి ప్రతీకగా నిలిచాయని, వారిని చూసి దేశం మొత్తం గర్విస్తున్నదని ట్వీట్ చేశారు. విదేశాలకు వెళ్లి వస్తున్న ఎయిర్ ఇండియా సిబ్బందికి వారు నివసిస్తున్న కాలనీల ప్రజల నుంచి నిరసనలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని స్పందించారు. దీంతోపాటు ఈ నెల 25న వారణాసి నియోజకవర్గ ప్రజలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడనున్నట్టు మోదీ తెలిపారు. తాజా పరిస్థితులను వివరిస్తామన్నారు. అదే విధంగా కరోనాపై పోరుకు మోదీ ప్రతిపాదించిన 'సార్క్ ఎమర్జెన్సీ ఫండ్'కు విరాళం ప్రకటించిన బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ ప్రధానులకు కృతజ్ఞతలు తెలిపారు.

# 'డ్రాగన్' పోరాలు!

**కరోనాకు చైనా ముకుతాడు ■ మహమ్మారిపై అసాధారణ పోరాటం**

**నగరాలు దిగ్బంధం ■ అతిక్రమణలపై ఉక్కుపాదం ■ విరివిగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగం**

**కరోనా కోరల్లో చిక్కుకుని ప్రపంచం విలవిల్లాడుతున్నది. దేశాలకు దేశాలు లాక్‌డౌన్ అవుతున్నాయి. అయితే ఈ మహమ్మారికి పుట్టినిల్లయిన చైనా.. అసాధారణ రీతిలో దానిని కట్టడి చేయగలిగింది. నగరాలను దిగ్బంధించి.. సామాజిక దూరాన్ని పటిష్టంగా అమలుపరిచి.. ఉల్లంఘనులపై ఉక్కుపాదం మోపి.. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి.. వైరస్‌పై పైచేయి సాధించింది.**

కరోనాను కట్టడి చేయడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనా విస్తృతంగా వినియోగించింది. కోట్లాది మందిని రోజూ ట్రాక్ చేసేందుకు అలీబాబా, టెన్సెంట్ వంటి దిగ్గజ కంపెనీలతో కలిసి 'కలర్ కోడెడ్ హెల్త్ రేటింగ్ సిస్టమ్'ను ప్రవేశపెట్టింది. ట్రావెల్, మెడికల్ హిస్టరీని బట్టి ప్రజలకు మూడు రకాల కలర్ కోడ్‌లను (గ్రీన్, ఎల్లో, రెడ్) కేటాయిస్తారు. ఈ కలర్ కోడ్‌ను బట్టే ఆ వ్యక్తిని క్వారంటైన్‌లో ఉంచాలా, బయటకు అనుమతించవచ్చా అన్నది నిర్ధారిస్తారు. బహిరంగ ప్రాంతాల్లో చెక్ పాయింట్లు ఏర్పాటుచేసి కలర్‌కోడ్‌లను, శరీర ఉష్ణోగ్రతను చెక్ చేస్తారు. దవాఖానల్లో వంటచేయడం దగ్గర నుంచి, క్రిమిసంహారక ద్రావణాల పిచికారీ, శానిటైజర్ల పంపిణీ, భోజనం సరఫరా వరకు రోబోలను విరివిరిగా వినియోగించారు. మరోవైపు, నమూనాల సేకరణ, మెడికల్ కిట్ల చేరవేతకు డ్రోన్లను విస్తృతంగా వాడారు.

**విస్తృత అవగాహన**

ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్లే వైరస్ వేగంగా వ్యాప్తి అవుతున్నదని గుర్తించిన ప్రభుత్వం..అధికారిక మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా అవగాహన చర్యలు చేపట్టింది. 'వైరస్‌పై ఏ స్థాయిలో అవగాహన చర్యలు చేపట్టామంటే.. బయట మహమ్మారి ఉంది.. మనం బయటకు వెళ్లకూడదని నా మూడేండ్ల కుమార్తెకు కూడా తెలుసు' అని చైనా ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ లీ జియావ్ జున్ తెలిపారు.

వైరస్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు బిగ్‌డేటాను వినియోగించి డాష్ బోర్డును రూపొందించారు. ఫేస్ రికగ్నిషన్, ఇన్‌ఫ్రారెడ్ టెంపరేచర్ డిటెక్షన్ వ్యవస్థలను నగరాల్లో అంతటా ఏర్పాటుచేశారు. స్మార్ట్ ఫోన్ యాప్‌ల ద్వారా ప్రజల కదలికలపై నిఘా ఉంచారు. కృత్రిమ మేధను కూడా బాగా వినియోగించుకున్నారు. శరీర ఉష్ణోగ్రతలో వచ్చే మార్పును గుర్తించేందుకు బైదు అనే కంపెనీ ఏఐ ఆధారిత ఇన్‌ఫ్రారెడ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసింది. ప్రయాణికుల కదలికలకు అంతరాయం కలుగకుండా ఇది నిమిషంలో 200 మందిని ఎగ్జామిన్ చేయగలదు. ఈ విధంగా కరోనాను చైనా కట్టడి చేయగలిగింది.



దిగ్బంధంతో నిర్మానుష్యంగా వుహాన్ వీధులు

**దక్షిణ కొరియా, తైవాన్ కూడా..**

సాంకేతిక పరిజ్ఞానం సాయంతో దక్షిణ కొరియా, తైవాన్ కూడా కరోనాకు అడ్డుకట్ట వేశాయి. బిగ్‌డేటా, కృత్రిమ మేధ, ప్రత్యేక యాప్‌ల ద్వారా ప్రజల కదలికలను గుర్తించి వైరస్ వ్యాప్తిని అడ్డుకున్నాయి.

## 5 కోట్ల మంది నిర్బంధం

వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు చైనా నగరాలకు నగరాలను దిగ్బంధించింది. రాకపోకలను పూర్తిగా నిషేధించింది. ప్రజలను ఇండ్లకే పరిమితం చేసింది. అతిక్రమించినవారిపై ఉక్కుపాదం మోపింది. విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, థియేటర్లు, క్రీడా ఈవెంట్లను రద్దుచేసింది. సామాజిక దూరం పాటించడాన్ని కఠినంగా అమలుచేసింది. బయటకు వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించడాన్ని తప్పనిసరి చేసింది. జనవరి 23 నుంచి ఇప్పటివరకు చైనా దాదాపు 5 కోట్ల మందిని నిర్బంధ క్వారంటైన్‌లో ఉంచింది. క్వారంటైన్ నుంచి బయటకు వచ్చిన వారి వివరాలు చెప్పిన వారికి నగదు ప్రోత్సాహకాలు ఇచ్చింది. మాస్క్‌లను అధిక ధరలకు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నది. ప్రజలు గుమిగూడడంపై ఆంక్షలు విధించింది. చర్చిలు, మసీదులు, ఆలయాలకు వెళ్లడంపై నిషేధం విధించింది.ఫలితంగా కేసులు దిగివచ్చాయి.



## రెండు వారాల్లో రెండు దవాఖానల నిర్మాణం

వైరస్ బాధితులకు చికిత్స అందించేందుకు చైనా వాయువేగంతో కదిలింది. కేవలం రెండు వారాల్లో రెండు భారీ దవాఖానలను నిర్మించింది. బాధితులకు చికిత్స అందించేందుకు టిబెట్ వంటి స్వయం ప్రతిపత్తి ప్రాంతాలను మొదలకుని 30 ప్రావిన్సుల నుంచి హుబెయి ప్రావిన్సుకు వైద్య సిబ్బందిని తరలించింది. అలాగే 4,000 మంది ఆర్మీమెడికల్ స్టాఫ్‌ను కూడా మోహరించింది. ఇప్పుడు చైనా రోజుకు 30 లక్షల టెస్ట్ కిట్‌లను, 1.2 కోట్ల మాస్క్‌లను తయారు చేస్తున్నది.

**కరోనా క్లాక్ 22-3-2020**

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 3.50 లక్షలు |
| మరణాలు | 15,873 |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| ఇటలీ | 63,927 | 6,077 |
| చైనా | 81,093 | 3,270 |
| స్పెయిన్ | 33,089 | 2,207 |
| ఇరాన్ | 23,049 | 1,812 |
| ఫ్రాన్స్ | 16,689 | 674 |
| అమెరికా | 41,433 | 501 |
| యూకే | 6,650 | 335 |
| నెదర్లాండ్స్ | 4,749 | 213 |
| జర్మనీ | 28,865 | 118 |
| స్విట్జర్లాండ్ | 8,547 | 118 |
| దక్షిణ కొరియా | 8,961 | 111 |
| బెల్జియం | 3,743 | 88 |

| | |
|---|---|
| దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 468 |
| మరణాలు | 9 |

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 74 | కేరళ 67 | కర్ణాటక 33 |
| తెలంగాణ 33 | ఉత్తరప్రదేశ్ 31 | ఢిల్లీ 29 |
| గుజరాత్ 29 | రాజస్థాన్ 28 | హర్యానా 26 |
| పంజాబ్ 21 | లడఖ్ 13 | తమిళనాడు 9 |
| ఏపీ 7 | ప. బెంగాల్ 7 | మధ్యప్రదేశ్ 6 |

## కండోమ్స్, గర్భనిరోధ మాత్రల అమ్మకాలు పెరిగాయ్



**న్యూఢిల్లీ:** కరోనా నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు నగరాల్లో లాక్‌డౌన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండ్లకే పరిమితమైన జంటల మధ్య సాన్నిహిత్యం పెరుగుతున్నది. కొత్తగా పెండ్లై ఇప్పటి వరకు విధులతో బిజీగా ఉన్న నవ దంపతులకు ఈ ఏకాంతం కలిసి వస్తున్నది. దీంతో నిత్యవసరాలు, మందులతోపాటు కండోమ్స్, గర్భనిరోధక మాత్రల అమ్మకాలు కూడా ఇటీవల బాగా పెరిగినట్లు ఢిల్లీలోని పలు మెడికల్ దుకాణదారులు, ఈ కామర్స్ సంస్థలకు చెందిన వారు చెబుతున్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన చర్చి ఫాదర్ అరెస్ట్



**త్రిసూర్:** కరోనా నిబంధనలు ఉల్లంఘించిన చర్చి ఫాదర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళలోని త్రిసూర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. చాలకుడేలోని కూడ పూజ్జా వద్ద ఉన్న చర్చి ఫాదర్ పౌలి పాడయట్టి సోమవారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో వంద మంది వరకు పాల్గొన్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు చర్చి ఫాదర్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు.

# శుభ్రతతోనే రక్షణ

**జెనీవా:** ప్రపంచ దేశాల్ని కలవరపెడుతున్న కరోనా మహమ్మారి సోకకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలను ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సూచించింది. తరుచూ చేతుల్ని సబ్బు, నీటితో శుభ్రం చేసుకోవాలని పేర్కొంది. సబ్బు, నీరు అందుబాటులో లేని సమయాల్లో చేతుల్ని శుభ్రం చేసుకోవడానికి ఆల్కహాల్‌తో తయారైన శానిటైజర్‌ను ఉపయోగించాలని తెలిపింది. చేతుల్ని పూర్తి స్థాయిలో శుభ్రం చేసుకునే విధానాన్ని 'డబ్ల్యూహెచ్‌వో' కింది విధంగా సూచించింది.




## కర్ఫ్యూ ఉల్లంఘనులు ఇడియట్సే

■ అజిత్ పవార్

**ముంబై:** కరోనా కట్టడికి ప్రభుత్వం విధించిన కర్ఫ్యూను ఉల్లంఘించేవారిని బుద్ధిలేనివారికిందే జమకట్టాలని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అన్నారు. కరోనా వ్యాప్తిని అడ్డుకొనేందుకు తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొంటుంటే.. మరోవైపు కొందరు ఇలా ఉల్లంఘనలకు పాల్పడటం బాగోలేదని చెప్పారు. వీరి వల్ల ఇతరుల ప్రాణాలకు అపాయం చేకూరుతుందన్నారు.

## హోం క్వారంటైన్ నుంచి బయటకు వస్తే అరెస్టే

**బెంగళూరు:** హోం క్వారంటైన్‌లో భాగంగా ఇండ్లలో ఉండాల్సిన వారు బహిరంగ ప్రదేశాల్లో కనిపిస్తే అరెస్ట్ చేస్తామని బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ భాస్కర్‌రావు హెచ్చరించారు. ఐదు వేలమందిని హోం క్వారంటైన్‌లో ఉంచామని, వారి చేతికి ముద్రలు వేశామని చెప్పారు. అయితే కొందరు నిబంధనలను ఉల్లంఘించి బయట తిరుగుతున్నారని తెలిపారు. అలాంటి వారు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వెంటనే వారిని అరెస్ట్ చేస్తామని చెప్పారు.

## తెలంగాణ బాటలో..

కరోనాకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకున్న చర్యలలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచింది. కేంద్రంతో సహా అన్ని రాష్ట్రాలు తెలంగాణను అనుసరిస్తున్నా యి. ప్రజలు స్వీయనియంత్రణ పాటించేలా అవగాహన కల్పిస్తూనే..మరోవైపు లాక్‌డౌన్ ప్రకటించి తెలంగాణ పటిష్ఠ చర్యలకు దిగింది. తెలంగాణ ముందు జాగ్రత్త చర్యలను కేంద్రం అమలు చేస్తున్నది. కరోనాపై తెలంగాణ సర్కార్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అభినందించారు. తెలంగాణ స్ఫూర్తితో మొత్తం 19 రాష్ట్రాలు మార్చి 31 వరకు లాక్‌డౌన్ ప్రకటించాయి. అసోం మంగళవారం నుంచి లాక్‌డౌన్ ప్రకటించింది. దేశవ్యాప్త లాక్‌డౌన్ అమలు దిశగా కేంద్రం యోచిస్తున్నది.

## దేశీయ విమాన సర్వీసులు రద్దు

కరోనా కేసులు పెరుగుతుండటంతో కేంద్రం మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మంగళవారం నుంచి దేశీయ విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. కేంద్రం తాజా నిర్ణయంతో హైదరాబాద్ నుంచి వివిధ రాష్ట్రాలకు నడిచే 480 దాకా విమాన సర్వీసులు నిలిచిపోనున్నాయి.ప్రభుత్వ ఆదేశాలు పాటించని వారిని ఆరునెలలు జైలులో పెట్టాలని కేంద్రం హెచ్చరించింది. దేశవ్యాప్తంగా అన్ని దవాఖానలలో ఓపీడీ సేవలను నిలిపివేయాలని కూడా కేంద్రం ఆదేశించనున్నట్టు సమాచారం.

# అంతటా లాక్‌డౌన్

- **15కిపైగా రాష్ట్రాల్లో అమలు**
- **ప్రజలు నిబంధనలు పాటించేలా చూడండి: కేంద్రం ఆదేశం**
- **తొమ్మిదికి చేరిన మృతులు.. 468 మంది బాధితులు**

**న్యూఢిల్లీ:** దేశంలో వేగంగా విస్తరిస్తున్న కరోనాను అడ్డుకునేందుకు 15పైగా రాష్ట్రాలు అత్యవసర సర్వీసులు మినహా లాక్‌డౌన్ ప్రకటించాయి. ప్రజలు నిబంధనలు పాటించేలా చూడాలని కేంద్రం రాష్ట్రాలను ఆదేశించింది. నిబంధనల ఉల్లంఘనులపై కేసులు నమోదు చేయాలన్నది. దేశీయ విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. లాక్‌డౌన్ ప్రకటించిన రాష్ట్రాల్లో కేరళ, హర్యానా, పంజాబ్, తమిళనాడు, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, ఢిల్లీ, జార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, నాగాలాండ్, తెలంగాణ, చండీగఢ్, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ ఉన్నాయి. ఇప్పటికే లాక్‌డౌన్ ప్రకటించిన పంజాబ్‌లో కర్ఫ్యూ విధిస్తూ సీఎం అమరీందర్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. పూర్తిగా కర్ఫ్యూ విధించిన తొలి రాష్ట్రంగా పంజాబ్ నిలిచింది. మహారాష్ట్రలోని ముంబై, పుణె, ఠాణెల్లో ఈ నెల 31 వరకు కర్ఫ్యూ విధించగా, ముంబై లోకల్ రైళ్లు నిలిపివేశారు.

**పెరుగుతున్న కేసులు**

సోమవారానికి దేశవ్యాప్తంగా కొవిడ్-19 కేసుల సంఖ్య 468కు పెరిగింది. ఇప్పటివరకు తొమ్మిదిమంది మరణించారు. సోమవారం పశ్చిమబెంగాల్, హిమాచల్‌ప్రదేశ్‌లో ఒకటి చొప్పున మరణాలు నమోదయ్యాయి. మొత్తం బాధితుల్లో 40 మంది విదేశీయులున్నారు. మహారాష్ట్రలో 74, కేరళలో 67, కర్ణాటకలో 33, తెలంగాణలో 32, యూపీలో 31, గుజరాత్‌లో 29, ఢిల్లీలో 29, రాజస్థాన్‌లో 28 కేసులు నమోదైనట్టు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) వెల్లడించింది. ఫిలిప్పీన్స్‌కు చెందిన 68 ఏండ్ల వృద్ధుడు ఈ నెల 13న ముంబైలోని కస్తూర్బా ప్రభుత్వ దవాఖానలో చేరాడు. అతడికి కరోనా సోకినట్టు తేలింది. తర్వాత అతడు కోలుకోవడంతో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఇతర కారణాల వల్ల మృతిచెందారని అధికారులు తెలిపారు.



కరోనా విజృంభణ నేపథ్యంలో నిర్మానుష్యంగా మారిన న్యూయార్క్‌లోని 42-స్ట్రీట్ ప్రాంతం

- **170 కోట్ల మంది హోం క్వారంటైన్**
- **15,873కు మృతుల సంఖ్య**
- **3.50 లక్షల మందికి వైరస్: డబ్ల్యూహెచ్‌ఓ**

**పారిస్/ బీజింగ్/ వాషింగ్టన్/ రోమ్:** రోజురోజుకు పెరిగిపోతున్న కరోనా వైరస్ కట్టడికి ప్రపంచ దేశాలు తమ చర్యలను వేగవంతం చేశాయి. ఇప్పటికే 50కి పైగా దేశాలు లాక్‌డౌన్ ప్రకటించాయి. ఆ జాబితాలో ఫ్రాన్స్, ఇటలీ, అర్జెంటీనా, అమెరికా, ఇరాక్, రువాండా, గ్రీస్ చేరాయి. బుర్కినా ఫాసో, చిలీ, ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా, సెర్బియా, మౌరిటానియా దేశాలు కర్ఫ్యూ విధించగా, సోమవారం సాయంత్రం నుంచి సౌదీ అరేబియా ఆ జాబితాలో చేరింది. ఇరాన్, జర్మనీ, బ్రిటన్‌లు తమ ప్రజలను ఇండ్లలోనే ఉండాలని కోరాయి.10 దేశాలు కర్ఫ్యూతోపాటు రాత్రివేళ ప్రయాణాలపై నిషేధం విధించాయి. 174 దేశాల్లో సోమవారం నాటికి 15,873 మంది మృతి చెందారు. 3,50,142 మందికి వైరస్ సోకిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తెలిపింది. 50కి పైగా దేశాలు 170 కోట్ల మంది ప్రజలను ఇండ్లకే పరిమి తం కావాలని కోరాయి. తాజాగా మరణాల్లో చైనా కంటే ముందు ఇటలీ ఉన్నది. ఆ దేశంలో సోమవారం నాటికి 6,077 మంది మృత్యువాత పడగా, 63,927 మందికి సోకింది. చైనాలో స్థానికంగా కేసులు నమోదు కావడం నిలిచిపోయింది. కొత్తగా విదేశాల నుంచి వచ్చిన వారిలో 39 మందికి కరోనా పాజిటివ్ అని తేలగా, తొమ్మిది మంది మరణించారు. దీంతో చైనాలో మృతుల సంఖ్య 3,270కు చేరగా, 81,093 మందికి వైరస్ సోకింది. స్పెయిన్‌లో 2,207 మంది, ఇరాన్‌లో 1,812, ఫ్రాన్స్‌లో 674, అమెరికాలో 501 మంది మరణించారు. అమెరికా సెనెటర్ రాండ్ పాల్‌కు కరోనా వైరస్ సోకింది. సెనెట్‌లో వైరస్ బారిన పడిన వారిలో ఆయన తొలి సెనెటర్ కావడం గమనార్హం. చెక్ రిపబ్లిక్, నైజీరియా, మాంటెనెగ్రోలలో ఆదివారం తొలి మరణాలు నమోదయ్యా యి. పాపువా న్యూగునియా, సిరియాల్లో తొలి కేసులు రికార్డయ్యాయి. పశ్చిమాసియాలో 1841 మృతులు నమోదు కాగా, 26,688 మందికి వైరస్ సోకింది. ఆఫ్రికాలో 49 మంది మృతి చెందగా, 1,479 కేసులు నమోదయ్యాయి.



## గాలి ద్వారానూ కరోనా!

■ ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా మహమ్మారి తన రూపాన్ని మార్చుకుంటున్నదా? ఇప్పటి వరకు మనిషి నుంచి మనిషికి వ్యాపిస్తున్న ఈ వైరస్ గాలి ద్వారా వ్యాపిస్తున్నదా? అవుననే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సంకేతాలిచ్చింది. ఇప్పటి వరకు వైరస్ సోకిన వ్యక్తిని మరో వ్యక్తి తాకడంతో లేదా తుమ్ము, దగ్గు ద్వారా ఇతరులకు వ్యాపిస్తున్నట్లు నిర్ధారించారు. ఇటలీలో కరోనా వేగంగా వ్యాప్తికి గాలి కూడా ఓ కారణమని తాజా పరిశోధనలో వెల్లడైనట్లు తెలుస్తున్నది. ఈ వైరస్ గాలిలో 3 గంటలకు పైగా బతికి ఉంటుందని, ఆ తర్వాత ఒక వాహకం కోసం ప్రయత్నిస్తున్నదని పరిశోధకులు భావించారు. వైరస్ మరింత బలపడుతూ రూపాన్ని నిత్యం మార్చుకుంటుందని డబ్ల్యూహెచ్‌వో గుర్తించింది. దీంతో గాలిలోని తేమ, ఉష్ణోగ్రతలను బట్టి వైరస్ జీవిత కాలం మారుతుందన్నది. గాలిలో కొన్ని గంటల నుంచి కొన్ని రోజులు ఈ వైరస్ జీవిస్తుందని, ఈ క్రమంలో ప్రతీ ఒక్కరూ మాస్క్‌లను ధరించడం శ్రేయస్కరమని సూచిస్తున్నది.



చాలామంది 'లాక్‌డౌన్'ను అంతగా పట్టించుకోవటం లేదు. ప్రభుత్వం ఇచ్చిన సూచనలను పాటించండి. మిమ్ములను, మీ కుటుంబాన్ని, అంతిమంగా దేశాన్ని కాపాడండి. రాష్ర్టాలన్నీ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు అమలయ్యేలా చూడాలి. ప్రజలెవరూ ఇల్లు విడిచి బయటకు రాకూడదు.

**నరేంద్రమోదీ, ప్రధాని**

మనం ప్రపంచం నుంచి నేర్చుకున్నదేమంటే వీలైనంతగా బయటి సమాజంతో దూరంగా ఉండాలి. ఇతరులతో ఎంత తక్కువ సంబంధాల్లో ఉంటామో అంతగా సురక్షితంగా ఉంటాం. తద్వారానే కరోనా నుంచి మనలను మనం రక్షించుకోగలుగుతాం.

**అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**




**1853**

అమెరికాలో బానిసత్వ వ్యతిరేక దినపత్రిక 'ది ప్రావిన్షియల్ ఫ్రీమ్యాన్' ప్రచురణ ప్రారంభం. ఎడిటర్‌గా మేరీ యాన్ షెడ్‌కేరీ.

**1882**

క్షయ వ్యాధి కారక సూక్ష్మక్రిమిని కనుగొన్న శాస్త్రవేత్త రాబర్ట్ కోచ్.






**1952**

దక్షిణాఫ్రికాలో ఊపందుకున్న వర్ణ వివక్ష వ్యతిరేక ఉద్యమం.

నేపాల్‌లో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి పాక్షిక లాక్‌డౌన్ ప్రకటించడంతో రాజధాని కాఠ్మండులోని అనేక మంది ప్రజలు తమ సొంత గ్రామాలకు పెద్ద ఎత్తున పోతున్నారు. దీనివల్ల ఒక్కసారిగా రవాణా వ్యవస్థపై ఒత్తిడి పెరిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించినట్టు ప్రతి అనుమానితుడిని పరీక్షించడం ఒక్కటే వైరస్ నుంచి భద్రతను ఇవ్వగలుగుతుంది. కానీ జాతీయ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ ఒక్కటే పరీక్షలు సాగిస్తున్నది. మరో మూడు ఆస్పత్రులలో పరీక్షలు జరడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కనీ తగిన పరికరాలను సమకూర్చాలి.

**ది హిమాలయన్ టైమ్స్**

బంగ్లాదేశ్‌లో కొవిడ్-19 సోకిన వారి సంఖ్య పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. కానీ ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి ప్రభుత్వం దగ్గర సమగ్ర ప్రణాళిక లేదు. అనుమానితులను పరీక్షించడానికి తగిన పరికరాలు దవాఖానల్లో లేవు. వైద్యులకు స్వీయ పరిరక్షణ వస్తువులు లేవు. ప్రభుత్వం పట్టనట్టు ఉంటే, కొన్ని స్వచ్ఛంద సంస్థలు మాత్రం చురుగ్గా పనిచేస్తున్నాయి. సంక్షోభం వచ్చినప్పుడు సంస్థలు, ప్రజలు ముందుకురావడం మామూలే. కానీ ఈ కార్యక్రమాలన్నిటినీ సమన్వయం చేసే బాధ్యత ప్రభుత్వానిదే.

**ది డైలీ స్టార్**



# పౌరస్ఫూర్తిని పాటించాలి

ఆదివారమంతా రాష్ట్ర ప్రజలు 'జనతా కర్ఫ్యూ' పాటించిన తీరు అద్వితీయం. కానీ అంతలోనే సోమవారం నాడు లాక్‌డౌన్ ప్రకటించిన తర్వాత కూడా ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చిన తీరు ఆందోళనకరం. సోమవారం మీడియా పెద్దలతో సమావేశమైన ప్రధాని మోదీ కూడా దేశ ప్రజలు సహకరించడం లేదని ఆందోళన వెలిబుచ్చడం గమనార్హం. ఆదివారం జనతా కర్ఫ్యూ పాటించవలసిందిగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన తర్వాత, ప్రజలకు కర్తవ్య బోధ చేయడంలో సీఎం కేసీఆర్ నిర్వహించిన పాత్ర గణనీయమైనది. తెలంగాణ జాతి ఉద్యమకాలంలో చూపిన పట్టుదలను, క్రమశిక్షణను గుర్తుచేస్తూ అదే పట్టుదలను ఇప్పుడూ కనబరచాలంటూఉత్తేజపరచారు. ప్రజలు కేసీఆర్ పిలుపునకు స్పందించడం ఉద్యమకాలంలోనే కాదు, రాష్ర్టాన్ని సాధించి పరిపాలనా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా కొనసాగుతున్నది. కుటుంబ సర్వేకు సహకరించవలసిందిగా సీఎం పిలుపునిస్తే, ఇతర రాష్ర్టాల నుంచి కూడా తెలంగాణవారు స్వచ్ఛందంగా తరలివచ్చి నమోదు చేయించుకొని వెళ్లారు. ఇదేవిధంగా ప్రజలు ఆదివారం స్వచ్ఛందంగా ఇంటి పట్టునే ఉన్నారు. కానీ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో ఈ క్రమశిక్షణ కనిపించకపోవడం గమనార్హం.

కరోనా వైరస్‌ను ఎదుర్కొనడానికి సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వం మేరకు పరిపాలనా యంత్రాంగం ఎంత ప్రయాసపడుతున్నదో ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రజలు సహకరించకపోతే అహోరాత్రులు సేవలు చేస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది కృషికి ఫలితం ఉండదు. కరోనా వైరస్ సోకిన రోగులను గుర్తించడానికి పగలు రాత్రి తేడాలేకుండా వేలాది బృందాలు తిరుగాడుతున్నాయి. అనుమానితుల ఇంటికి వెళ్లి వారు ఒంటరి జీవితం గడుపుతున్నారా, ఏవైనా రోగ లక్షణాలు కనిపిస్తున్నాయా అనేది ఆరాతీస్తున్నాయి. మృత్యువు కోరల దాపున చేరి, నిబద్ధతతో పనిచేస్తున్న వైద్యుల భద్రతకు అన్ని వసతులు సమకూర్చడంలోనూ ముఖ్యమంత్రి శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా పరిస్థితిని అదుపు చేయడంలో పోలీసులు నిర్వహిస్తున్న పాత్ర కూడా ప్రశంసనీయమైనదే. కరోనా సోకిన విదేశీయులు కరీంనగర్‌కు వచ్చి వెళ్లారని తెలిసిన వెంటనే వారు తిరిగిన ప్రదేశాలన్నీ జల్లెడ పట్టిన తీరు అపూర్వం. వారు ఏయే ప్రాంతాల్లో, ఏయే వాహనాల్లో తిరిగారు, ఎవరిని కలిశారు, ఎక్కడ ఆహారం తీసుకున్నారు తదితర విషయాలన్నింటినీ అనతికాలంలోనే పసిగట్టారు. తెలంగాణలో 'పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్' ను సీఎం కేసీఆర్ అమలుపరిచారు. 'షీ' టీమ్స్ మొదలైన విభాగాల సేవలను ప్రశంసిస్తూ, పోలీసుల పనితీరును చెప్పి ఓట్లడిగిన ఏకైక పార్టీ తమదని కేసీఆర్ ఎన్నికల సమయంలో చెప్పడం గమనార్హం. ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో కరోనాపై పోరాడుతున్నాయనడానికి కరీంనగర్‌ను తార్కాణంగా చెప్పవచ్చు. కరీంనగర్‌లో విదేశీయుల ఉనికిని గమనించిన మొదటి మూడురోజుల్లోనే వంద బృందాలు రంగంలోకి దిగి లక్షా ఇరువై ఏడు వేల మందికి వైద్య పరీక్షలు జరిపాయి. మరోవైపు నగరపాలక సంస్థ చొరవతో వేయి మంది సిబ్బంది పారిశుధ్య కార్యక్రమం సాగించారు. ఆధునిక పద్ధతుల్లో స్ప్రే చేస్తూ నగరమంతా శానిటేషన్ పనులు నిర్వహించారు. గత ఆరేండ్ల పాలనలో కేసీఆర్ పరిపాలనారంగాన్ని కర్తవ్యోన్ముఖులను చేయడంలోనూ ప్రజలతో మమేకం కావడంలోనూ సాగించిన కృషి ఫలితమిది.

> **కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో చైనా సఫలమైంది. ప్రజలు క్రమశిక్షణతో మెలిగితే మన దేశమూ ఈ వైరస్‌ను మట్టి కరిపించడం అసాధ్యమేమీ కాదు. కానీ చైనాకు, మన దేశానికి వ్యవహారపరంగా ఎంతో తేడా ఉంటుంది. అక్కడ ఉన్నది ఏక పార్టీ నిరంకుశ వ్యవస్థ. కానీ ప్రజాస్వామ్యవ్యవస్థలో మన విలువలను, రాజనీతిని పణంగా పెట్టకుండానే, ప్రజల సహకారంతో కార్యాన్ని సాధించడం అసిధారా వ్రతం వంటిది.**

కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో చైనా సఫలమైంది. ప్రజలు క్రమశిక్షణతో మెలిగితే మన దేశమూ ఈ వైరస్‌ను మట్టి కరిపించడం అసాధ్యమేమీ కాదు. కానీ చైనాకు, మన దేశానికి వ్యవహారపరంగా ఎంతో తేడా ఉంటుంది. అక్కడ ఉన్నది ఏక పార్టీ నిరంకుశ వ్యవస్థ. కానీ ప్రజాస్వామ్యవ్యవస్థలో మన విలువలను, రాజనీతిని పణంగా పెట్టకుండానే, ప్రజల సహకారంతో కార్యాన్ని సాధించడం అసిధారా వ్రతం వంటిది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అంతరం లేనప్పుడే పరిపాలన సమర్థంగా సాగుతుంది. ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఆచితూచి వ్యవహరిస్తుంది. ఇప్పటికే ఆర్థికవ్యవస్థ మందగమనంలో ఉన్నది. లాక్‌డౌన్ వల్ల వ్యాపారాలు దెబ్బ తినవచ్చు, అయినా దీర్ఘకాల సంక్షేమం దృష్ట్యా తప్పదు. రెక్కాడితే డొక్కాడ ని పేదలకు ఇంటిపట్టున ఉండటం కష్టం. అందుకే పేదలకు బియ్యంతో పాటు పదిహేను వందల రూపాయలను ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం ఆంక్షలు విధించినా, కొంత కఠినంగా వ్యవహరించినా తమ సంక్షేమం కోసమేనని ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రధాని మోదీ అన్నట్టు- 'ఒక సుదీర్ఘ పోరాటానికి ఇది ఆరంభం మాత్రమే'. ఈ సుదీర్ఘ పోరాటానికి తెలంగాణ ప్రజలు సిద్ధం కావాలి. ఆదివారం నాటి క్రమశిక్షణను ఇకముందు కూడా ప్రదర్శించాలే తప్ప ఉల్లంఘించకూడదు. కఠోర దీక్షతో తెలంగాణ రాష్ర్టాన్ని సాధించుకున్నాం. బంగారు తెలంగాణ నిర్మించుకుంటున్నాం. ఈ దశలో ఈ మహా విపత్తు వచ్చిపడ్డది. ఈ విపత్తు నూ ఉద్యమ దీక్షతో ఎదుర్కొందాం.

**జనగళం**

## షట్‌డౌన్ తెలంగాణ

**పెనుగాలులు వీస్తున్నప్పుడు**
పిట్టగూళ్లను
చెట్లే కాపాడాలి
గద్దల నుంచి పిల్లల్ని తల్లికోడే కాపుకాయాలి
ఎదురుతిరుగుతున్న అడ్డంకుల్ని
అడ్డుకుని నిలవాలి

ముంచుకొచ్చిన యుద్ధాన్ని
తక్షణాయుధాలతోనే ఎదుర్కొనాలి
నిశ్శబ్ద యుద్ధాలకు ధైర్యమే కవచం
ఈ నేలపైన ప్రతి గడ్డిపోచ
జనతా కర్ఫ్యూకు జై కొట్టింది

తల్లివొడిలోని బిడ్డలూ
జై కొట్టారు
ఈ నేల కోసం ఈ దేశం కోసం
సంకల్పాలు చప్పట్లయి మోగాయ్
చప్పట్లతో సమరాలు చేయించిన
నిశ్శబ్ద విప్లవకారుడు కేసీఆర్

నీ ప్రాణం పౌరసమాజమయ్యాక
కేసీఆర్.. నీ వెనుకే మేం
తెలంగాణ అంతా నీవెంటే
వజ్ర సంకల్పాల ముందు
కరోనాలెన్నైనా ఖతమే..

కేసీఆర్..
రెక్కాడితే డొక్క నిండని ఆకలి పేగుల్ని చూసినోడు
పేదవాని కంచంలో పిడికెడన్నంగా మారినవాడు
మన సమాజాన్ని మనమే రక్షించుకోవాలన్న
రక్షణ కవచమైనవాడు
నీ వెంటే తెలంగాణ.. నీ మాటే మాకు బాసట
షట్‌డౌన్ తెలంగాణ, షట్‌డౌన్ తెలంగాణ
మహమ్మారిని పారదోలే మౌనయుద్ధంలో
నువ్వూ నేనూ మనందరం సైనికులమే
ప్రాణం తీసే వైరస్‌కు వ్యతిరేక యుద్ధం
ప్రాణం నిలిపే ప్రయత్నానికి జీవనయుద్ధం...

**- జూలూరు గౌరీశంకర్, 94401 69896**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ఆరోగ్యం**



**బూర నర్సయ్యగౌడ్**

# అప్రమత్తతే ఔషధం

శరీరంలోని రోగ నిరోధకశక్తి మాత్రమే కరోనా నుంచి మనకు విముక్తి కలిగిస్తుంది. కరోనా వైరస్ ఉన్నవారందరికీ జబ్బు లక్షణాలుండకపోవచ్చు. వారితో అత్యంత ప్రమాదం. దాదాపు 14 రోజుల్లో ఈ వ్యాధి లక్షణాలు తెలుస్తాయి. అందుకోసం కనీసం రెండు వారాలు పర్యవేక్షణ అవసరం. ఇలాంటి వ్యక్తుల నుంచి దగ్గు, తుమ్ముల ద్వారా ఇది గాల్లోకి, తర్వాత మన పరిసరాల్లో ఉంటే అనేక వస్తువులతో (టేబుల్స్, కుర్చీలు, ఫైల్స్, తలుపులు, డోర్ హ్యాండిల్స్) డైరెక్ట్ కాంటాక్ట్ ద్వారా ఇతరులకు సోకుతుంది. ఒకవిధంగా కరోనా ఒక మల్టీలెవల్ మార్కెటింగ్ వ్యవస్థ లాగా వ్యాపిస్తుంది.

కంటికి కనిపించని ఒక వైరస్ ప్రపంచాన్ని వణికిస్తున్నది. కరోనా విషయంలో ఇది ముమ్మాటికీ నిజం. నిశ్శబ్దంగా వ్యాప్తిచెందే తీవ్రమైన అంటువ్యాధి కరోనాకు ఇంతవరకూ చికిత్స లేదు. ఈ వ్యాధి సోకినవాళ్లలో 16 శాతం మందికి తీవ్రమైన జబ్బు వస్తే, 60 ఏండ్లు పైబడినవాళ్లలో 6 శాతం చనిపోయే అవకాశం ఉన్నది. కరోనా నివారణ కోసం 'తెలుసుకుందాం, జాగ్రత్త వహిద్దాం, నిరోధిద్దాం' అనే మంత్రాన్ని పాటించాల్సిన అవసరం ఉన్నది. కరోనా రావడానికి ఎవరూ అతీతులు కాదు. అందుకే మనకేం రాదులే.. అనే నిర్లక్ష్యం వద్దు. చైనాలో మాదిరిగా 136 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో కరోనా వ్యాపిస్తే మనకున్న హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏ మాత్రం సరిపోదు. చిన్న జనాభా ఉన్న ఇటలీ, స్పెయిన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలే విలవిలలాడుతున్నవి. ఇదొక హెల్త్ ఎమర్జెన్సీ. మున్ముందు ఇది ఆర్థిక ఎమర్జెన్సీగా మారుతుంది.

### కరోనా అంటే ఏమిటి? వ్యాధి లక్షణాలేమిటి?

జంతువుల నుంచి ముఖ్యంగా గబ్బిలాల నుంచి ఈ 'కొవిడ్-19' చైనా హుబెయి రాష్ట్రంలో మొదట వెలుగుచూసింది. మామూలు ఫ్లూ అయినప్పటికీ ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్య. ప్రధానంగా జ్వరం, శక్తి లోపించడం, తీవ్రమైన ఒంటి నొప్పులు, దగ్గు, గొంతులో ఏదో తట్టుకున్నట్టుండటం, శ్వాస సమస్య, చివరికి మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్.. ఇదీ కరోనా. కేవలం జబ్బు లక్షణాలకు మాత్రమే చికిత్స అందించగలం. శరీరంలోని రోగ నిరోధకశక్తి మాత్రమే కరోనా నుంచి మనల్ని విముక్తి కలిగిస్తుంది. కరోనా వైరస్ ఉన్నవారందరికీ జబ్బు లక్షణాలుండకపోవచ్చు. వారితో అత్యంత ప్రమాదం. దాదాపు 14 రోజుల్లో ఈ వ్యాధి లక్షణాలు తెలుస్తాయి. అందుకోసం కనీసం రెండు వారాలు పర్యవేక్షణ అవసరం. ఇలాంటి వ్యక్తుల నుంచి దగ్గు, తుమ్ముల ద్వారా ఇది గాల్లోకి, తర్వాత మన పరిసరాల్లో ఉంటే అనేక వస్తువులతో (టేబుల్స్, కుర్చీలు, ఫైల్స్, తలుపులు, డోర్ హ్యాండిల్స్) డైరెక్ట్ కాంటాక్ట్ ద్వారా ఇతరులకు సోకుతుంది. ఒకవిధంగా కరోనా ఒక మల్టీ లెవల్ మార్కెటింగ్ వ్యవస్థ లాగా వ్యాపిస్తుంది.

### కరోనా ఎలా వ్యాపిస్తుంది?

ఇది పూర్తిగా ఇతర దేశాల నుంచి వస్తున్న సమస్య. ఒకపక్క మన భారతీయులు, మరో పక్క విదేశీయులు దీన్ని మనకు దిగుమతి చేశారు, చేస్తున్నారు. తెలిసో, తెలియకో వారితో దగ్గరగా వెళ్లినవారందరికీ ఈ వ్యాధి సోకుతుంది. ఉదాహరణకు కరోనా సోకిన వ్యక్తి ఇతర దేశం నుంచి ఇండియాకు వచ్చినప్పుడు తనతో పాటు ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు, ఎయిర్ స్టాఫ్‌కు అంటించవచ్చు. తాను దిగిన తర్వాత గమ్యానికి చేరుకోవడానికి డొమెస్టిక్ ఫ్లైట్, బస్సు, రైలు ద్వారా ప్రయాణం చేసినప్పుడు సహచర ప్రయాణికులందరికీ అంటించవచ్చు. అలానే ఒక టాక్సీ లేదా కారులో ప్రయాణిస్తే ఆ కారు ఒక కరోనా సెంటర్‌గా మారి ఆ కారులో ప్రయాణం చేసే ఇతరులకు సోకవచ్చు. విదేశాల నుంచి వచ్చిన వ్యక్తి తన కుటుంబసభ్యులకు అంటించవచ్చు. ఆ వ్యక్తి హోటల్స్, మాల్స్, ఫంక్షన్స్, పెళ్లిళ్లు, ప్రార్థనా మందిరాలు, ఇతర జన సమూహం ఉన్న ప్రదేశాలకు వెళ్లినప్పుడు అందరికీ అంటించవచ్చు.

జబ్బున్న ఒక వ్యక్తి సగటున ఇద్దరి నుంచి ముగ్గురికి వ్యాప్తి చేయవచ్చు. వందమందికి రిస్క్ కలిగించవచ్చు. కరోనా వైరస్ సోకి, జబ్బు లక్షణాల్లేనివారు ఎక్కువ మందికి వ్యాప్తి చెందించే అవకాశం ఉంటుంది. ప్రపంచంలో 195 దేశాల్లో ఇప్పటివరకు 186 దేశాలకు సోకింది. మొత్తం 3 లక్షల 20 వేల మందికి సోకితే 11,885 మంది చనిపోయారు. ఇరాన్ తప్ప చైనా, ఇటలీ, స్పెయిన్, అమెరికా, దక్షిణకొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లోనే ప్రధానంగా సోకింది. ఇందుకు ప్రధాన కారణం నిర్లక్ష్య ధోరణి. 'మాకు ఎందుకు వస్తుందిలే' అనే అహంకార అజ్ఞానం. ప్రభుత్వాలు చెప్పినా ప్రజలు వినకపోవడం. కఠినమైన చర్యలు లేకపోవడం. దాని ఫలితం యూరప్‌లో కరోనా వ్యాధిగ్రస్థులు రోడ్ల మీద నిస్సహాయస్థితిలో చనిపోతున్నారు. ఇప్పటివరకు ఇరువై వేల మంది ఇతర దేశాల నుంచి తెలంగాణ రాష్ర్టానికి వచ్చారు. ఇప్పుడు వారి నడవడి మీద కరోనా వ్యాప్తి ఆధారపడి ఉన్నది.



## సామాజిక క్వారంటైన్

*నిర్బంధం లేకుండా మనిషి నియమాలు పాటించడు. వచ్చే రెండు వారాలు ప్రభుత్వం సామాజిక నిర్బంధంగా నియమాలు తయారుచేయాలి. ప్రజలు పాటించాలి. పాటించనివారికి కఠినమైన ఫైన్‌తో కూడిన శిక్ష ఉండాలి. నిత్యావసర వస్తువులు, అత్యవసర కేంద్రాలు తప్ప అన్ని వ్యాపారకేంద్రాలు మూసివేయాలి. అన్ని సమూహ కార్యక్రమాలు బందుపెట్టాలి. అవసరమైతే తప్ప బయటికి వెళ్లకుండా నియంత్రణ చేయాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్, అన్ని వర్క్ ప్లేసెస్‌లో కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుచేయాలి. అన్ని నిత్యావసర సరుకుల కోసం ఒక క్లస్టర్ విధానం అమలుచేయాలి. హోమ్ పార్టీలు, అన్నిరకాల మీటింగులు క్లుప్తంగా చెప్పాలంటే కరోనా కట్టడి చేసే మీటింగులు తప్ప అన్నీ నిలిపివేయాలి. ఈ చర్యల ద్వారా కమ్యూనిటీలో కరోనా వ్యాప్తికాకుండా నిరోధించవచ్చు. ఆ దిశగా చర్యలు తీసుకుందాం.*


### భారత ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు..

కరోనా వ్యాధి దిగుమతి మొత్తాన్ని అరికట్టడానికి ముందుగా చేయాల్సిన పని-మొత్తం విమానాలు, సముద్ర ఉపరితల విదేశీ ప్రయాణికులు రాకుండా బ్యాన్ చేయడం ప్రథమ కర్తవ్యం. ప్రస్తుతం ఇది అమల్లోకి వచ్చింది. ఇతర దేశాల్లో చిక్కుకున్న భారతీయులను అక్కడి ప్రభుత్వం సహకరిస్తే అక్కడే వారికి మన వైద్య బృందాలతో సహకారం అందజేయాలి. లేదా తక్కువ కరోనా కేసులున్న దేశాల నుంచి వచ్చిన వారిని కచ్చితంగా వైద్య క్వారంటైన్‌లో ఉంచాలి. కేవలం టెంపరేచర్ స్క్రీన్ చేయడమనేది విదేశీ వ్యాధి దిగుమతిని అరికట్టలేదు. విదేశీ ప్రయాణికులందరినీ 7 నుంచి 14 రోజులుగా విభాగించి, ఆ వ్యక్తుల జబ్బు లక్షణాలు, స్వీయ నియంత్రణ పాటించే అవకాశాలు, కుటుంబసభ్యుల వివరాలు, బాధ్యత తీసుకుంటున్న కుటుంబసభ్యులు మొదలైన వివరాలు నమోదు చేసుకోవాలి. ఆయా ప్రాంతాలలో రిపోర్ట్ చేసే కరోనా టీంను, జియో ట్యాగింగ్, ఫోన్ ట్రేసింగ్, డైలీ వాట్స ప్, వీడియో కాల్స్, పర్యవేక్షణ, టెలిమెడిసిన్ వంటి అనేక అంశాల ద్వారా మనం అద్భుతంగా నియంత్రించవచ్చు. 'ఐడెంటిఫై, ఐసోలేట్, ట్రీట్' అనే పద్ధతిలో తక్కువ ఖర్చుతో, ఎక్కువ నియంత్రణ చేయవచ్చు. ఇవి అన్ని రాష్ర్టాలు కలిపి ఒక దేశీయ విధానం తయారుచేయాలి. అంత ర్రాష్ట్ర ప్రయాణానికి ఒక నియంత్రణ వ్యవస్థ, రెండు వారాలు పాటించేటట్లు ఒక విధానపరమైన చట్టం తీసుకురావాలె. స్వీయ నియంత్రణ ఉల్లంఘించేవారి మీద కఠినమైన ఆర్థిక నిర్బంధం లాంటి శిక్ష ఉంటుంద నే అవగాహన కల్పించాలె. విదేశీ ప్రయాణికులు నియంత్రణను ఉల్లంఘిస్తే వారి గురించిన సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసే ఇన్‌ఫార్మర్ వ్యవస్థ ఉండాలి. అవసరమైతే పారితోషికంతో కూడిన కరోనా ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటుచేయాలి. ప్రభుత్వ, ప్రైవేటురం గంలోని అన్ని సదుపాయాలను వాడుకోవాలి. ఎక్కువ పరీక్ష కేంద్రాలను, టెస్ట్ అండ్ రెస్ట్ పాలసీని ఏర్పాటుచేయాలి. కరోనా టెస్టును ఉచితంగానే కాకుండా స్థోమత ఉన్నవాళ్లకు పెయిడ్ కరోనా టెస్టుల వ్యవస్థ ను ముందుకుతేవా లి. అన్ని రాష్ర్టాలు విధిగా అమలుచేసే విధంగా ఒక పాలసీ ఆర్డినెన్స్ తీసుకురావాలె. కరోనా ఫండ్ ఏర్పాటుచేసి, అవసర మైతే భారతీయులందరూ స్వచ్ఛందంగా కరోనా ఫండ్ కోసం విరాళాలు ఇచ్చే ప్రక్రియ మొదలుపెట్టాలి. ఇది ప్రజలను భాగస్వామ్యం చేయడానికి దోహదపడుతుంది.

### క్వారంటైన్

ప్రజలకూ, విదేశాల నుంచి వచ్చిన వారికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. క్వారంటైన్‌లో ఉన్న వసతులు సంతృప్తికరంగా ఉండాలి. ఒక జబ్బు లేని వ్యక్తి 14 రోజులు నిర్బంధంగా ఉండగలిగేలా వాళ్లను మానసికంగా, శారీరకంగా తయారుచేయాలి. హోమ్ క్వారంటైన్ పకడ్బందీగా అమలయ్యేటట్లు చూడాలి. 136 కోట్ల ప్రజలకు రక్షణ కవచం ఇవ్వడం ఒకెత్తయితే, తక్కువ ఖర్చుతో భారత్‌లోకి దిగుమతి కాకుండా కరోనాను నివారించడం మరో ఎత్తు. బయటిదేశాల నుంచి ఇప్పుడు వచ్చే వారిని కనీసం 72 గంటలు ప్రభుత్వ క్వారంటైన్‌లో పెట్టాలి. ఎం దుకంటే దాదాపు 90 శాతం మందికి మొదటి ఐదు రోజుల్లో జబ్బు లక్షణాలు కనిపించవు. తదుపరివారిని వారివారి సొంత స్థలాలకు స్థానిక కరోనా టీం (పోలీస్, హెల్త్, పర్యవేక్షణాధికారి)కు సమాచారం ఇచ్చి, ఒక ఎస్కార్ట్ వాహనంతో హోం క్వారంటైన్‌కు పంపిస్తే చాలావరకు కట్ట డి చేయవచ్చు.

**(వ్యాసకర్త: పార్లమెంట్ మాజీ సభ్యులు)**




## హోమ్ క్వారంటైన్

నిబంధనలు పాటించడమనేది సేఫ్ పద్ధతి. కానీ హోం క్వారంటైన్ ఉన్నవాళ్లు, వారి కుటుంబసభ్యులతో కూడా దూరంగా ఉండాలి. వారి మధ్య కరోనా నిబంధనలు పాటించాలి. ప్రత్యేక గదికి పరిమితం కావాలి. కలిసి భోజనం, ఎంటర్‌టైన్‌మెంట్ ఉండొద్దు. ఇంట్లోనే ఐసోలేట్ కావాల్సిన అవసరం ఉన్నది. ఇంట్లో 60 ఏండ్లు దాటినవాళ్లు లేకుండా చూస్తే మంచిది. కరోనా పూర్తిగా నెగెటివ్ వచ్చేవరకు కుటుంబసభ్యులు మొత్తం ఐసోలేట్ అయ్యేటట్లుగా చూడాలి. వారికి నిత్యావసరాలు బయటివ్యక్తుల ద్వారా నాన్ కాంటాక్ట్ పద్ధతుల్లో అందజేయాలి. హోమ్ క్వారంటైన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఒక బ్రోచర్ అందరికీ అందించాలి. కరోనాను ఇంటికి కట్టడి చేయగలిగితే మనం విజయం సాధించవచ్చు. కరోనా యావత్తు ప్రపంచానికి, ప్రజలకు, ప్రభుత్వానికి ఒక పరీక్ష. ఈ పరీక్షలో మనం నెగ్గాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# గృహమే కదా స్వర్గసీమ!

**విశ్లేషణ**



**పమిడికాల్వ మధుసూదన్**

ఇంటిపట్టు అని తెలుగులో అద్భుతమైన మాట. ఇల్లే వైకుంఠం- కడుపే కైలాసం అని ఒక సామెత. ఈ మాటల ప్రతి అక్షర ప్రత్యక్ష స్ఫూర్తి ఇప్పుడు దీప్తిలా ప్రతి ఇంట్లో వెలగాలి. లేకపోతే వెలగడానికి మనం మిగలం. కంటికి కనిపించని కరోనా వైరస్ ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. ఒకరి నుంచి ఒకరికి కరోనా సంక్రమించకూడదంటే జాగ్రత్తలు పాటించాలి. జన సమూహాలకు దూరంగా ఉండాలి. ఇండ్లకే పరిమితం కావాలి.

కరోనా కట్టడికి తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ ప్రకటించింది. తిరిగే కాలు, తిట్టే నోరు ఊరికే ఉండదనేది సామెత. డాక్టర్ పథ్యం చెప్పినప్పుడే రోగికి ఆ పదార్థాలు ఎక్కువగా తినాలనిపిస్తుంది. అలాగే ఇండ్లలోనే ఉండి మీ ఆరోగ్యాలను కాపాడుకోండి- ఇతరుల ఆరోగ్యాలను కాపాడండి అన్నప్పుడే ఎక్కువ తిరుగాలనిపిస్తుంది. ఎంత ఎక్కువ తిరిగితే అంత ఎక్కువగా కరోనా బారినపడే ప్రమాదం ఉంటుంది.

ఒక వారం, పది రోజులు ఎవరికి వారు స్వీయ గృహ నిర్బంధంలో ఉండటం ప్రస్తుత అవసరం. ఈ సంస్కృత సమాసం గంభీరంగా, నెగెటివ్‌గా అనిపిస్తుంది. హౌస్ అరెస్ట్ అనే మాటకు గృహ నిర్బంధం అని వాడి వాడి అలా ధ్వనిస్తోంది. సంస్కృతానికి బదులు తప్పనిసరిగా ఎవరింట్లో వారుండటం అంటే మాట తేలికగా ఉన్నట్లుంటుంది. నిజానికి అలా ఇంట్లో ఉండకుంటే మన బతుకే బరువవుతుంది. మన బతుకే ఆగమాగమవుతుంది.

ఇంట్లో ఉండి ఏమి చెయ్యాలె? అని ఒక్కరోజుకే చాలామంది జుట్టు పీక్కుంటున్నారు. ఇల్లే వైకుంఠం- కడుపే కైలాసంగా భావిస్తే ఇంటిపట్టున ఉండి చేయడానికి చాలా పనులున్నాయి. దశాబ్దాలుగా చేయాల్సి ఉండి, చేయలేకపోయిన పనులున్నాయి. పని మనుషులు రారు. వంట మనుషులు రారు. డ్రైవర్లు రారు. రాకూడదు. మనమే ఇల్లూడ్చుకుందాం. బూజు దులుపుకుందాం. ఇల్లు శుభ్రం చేసుకుందాం. పుస్తకాలు సర్దుకుందాం. ఇరువై, ముప్పై ఏండ్లుగా చూడని గదుల అల్మారాల్లో ఏముందో చూద్దాం. కుండీల్లో మొక్కలు మార్చుకుందాం. ఇష్టమైన, మనవైన వంటలు వండుకుందాం. భార్యాపిల్లలతో కబుర్లు చెప్పుకుందాం. ఆడుకుందాం. పాడుకుందాం. ఎప్పుడో దాచిపెట్టిన కళలను బయటికితీద్దాం. పద్యాలకు రాగాలు తీద్దాం. డైలాగులకు కంఠమిద్దాం. చిత్రాలకు రంగులద్దుదాం. మనసు విప్పి మాట్లాడుకుందాం. మనసు పొరల్లో దాగిన మధురానుభూతులను నెమరువేసుకుందాం. కాలాన్ని, గాయాలను సవాలు చేసి మనకు మనంగా నిలబడిన మహోన్నత క్షణాలను తవ్వి తలపోసుకుందాం.



పాత బ్లాక్ అండ్ వైట్ ఆల్బమ్‌లు ముందేసుకొని మళ్లీ బాల్యం రెక్కలు తొడుక్కుందాం. పెళ్లి నాటి వీడియోలు, ఇంటి ఫంక్షన్ల వీడియోలను పదే పదే చూస్తూ కాలాన్ని గిర్రున రివైండ్ చేద్దాం. ఇంట్లో ఎవరికి వారే యమునా తీరేగా యూట్యూబ్‌లు వాట్సప్‌లు, నెట్ ఫ్లిక్సులు, ఆమెజాన్ ప్రైమ్‌లో బంధీలైతే నిజంగా అప్పుడు గృహ నిర్బంధమే.

మన ఇల్లు, మనవారిని ఇంత తదేకంగా చూసి ఎన్నేండ్లయ్యింది? వీడియోకాల్లో మాట్లాడితే మనసెలా తెలుస్తుంది?

మనిషి మనిషితో మాట్లాడితే, మనసు మనసుతో మాట్లాడితే వారం, పది రోజులు ఒక నిమిషం అవుతుంది. లేకపోతే ప్రతి నిమిషం భారమై ఇల్లు ముల్లుగా గుచ్చుకుంటూ ఉంటుంది. గృహమే కదా స్వర్గసీమ? అని బాగా వాడుకలో ఉన్నమాట. ఇప్పుడు ఎవరైనా ఇల్లు వదిలి బయట తిరిగితే అందరికీ నరకసీమ అవుతుంది. ఎవరింట్లో వారుంటే అందరి ఇళ్లు స్వర్గసీమలు.

> మనిషి మనిషితో మాట్లాడితే, మనసు మనసుతో మాట్లాడితే వారం, పది రోజులు ఒక నిమిషం అవుతుంది. లేకపోతే ప్రతి నిమిషం భారమై ఇల్లు ముల్లుగా గుచ్చుకుంటూ ఉంటుంది. గృహమే కదా స్వర్గసీమ? అని బాగా వాడుకలో ఉన్నమాట. ఇప్పుడు ఎవరైనా ఇల్లు వదిలి బయట తిరిగితే అందరికీ నరకసీమ అవుతుంది. ఎవరింట్లో వారుంటే అందరి ఇళ్లు స్వర్గ సీమలు.

ప్రపంచానికి ఒక ఉపద్రవం వచ్చినప్పుడు సమాజంగా మనం ఎంత బాధ్యతగా స్పందించాం? ఆ ఉపద్రవం మనదాకా రాకుండా ఎంత జాగ్రత్తగా ఉన్నాం? అన్నదే మన నాగరికతకు కొలమానం. అయినా ఇప్పుడు ప్రభుత్వాలు కోరుతున్నది బయటతిరుగకుండా ఎవరి ఇంట్లో వారిని ఉండమనే కదా?

ఇది శిక్ష కాదు/ కరోనా బారినపడకుండా రక్ష.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## ● 'కరోనా' హోమం



కరోనా వైరస్ నివారణార్థం వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం హోమాలు నిర్వహించారు. రాజన్న ఆలయ కల్యాణ మండపంలో మహామృత్యుంజయ, సుదర్శన, ధన్వంతరి హోమాలను ఆలయ అర్చకులు ఘనంగా జరిపారు. - వేములవాడ కల్చరల్

## ● యాదాద్రిలో సుదర్శన హోమం..



కరోనా బారినుంచి విశ్వమానవాళిని రక్షించాలని వేడుకుంటూ సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సుదర్శన నారసింహ, ధన్వంతరి హోమాలు నిర్వహించారు.
- యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ

## ● కురవిలో మృత్యుంజయ హోమం..



కరోనా వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో సమస్త జీవకోటికి ప్రాణహాని రాకుండా సోమవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలకేంద్రంలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో అర్చకులు మృత్యుంజయ హోమం నిర్వహించారు.
- కురవి

## ● యాచకులకు అన్నదానం



లాక్‌డౌన్ నేపథ్యంలో రాజన్న ఆలయంతోపాటు, అన్నదాన సత్రాలు, హోటళ్లు మూతపడ్డాయి. రాజన్న క్షేత్రంపై ఆధారపడి జీవించే యాచకులు ఆకలితో అలమటించకుండా మున్సిపల్ వైస్ చైర్మన్ మధురాజేందర్ సోమవారం అన్నదానం చేశారు. - వేములవాడ, నమస్తేతెలంగాణ

## ఇద్దరు పిల్లలతో కాలువలో దూకిన మహిళ

- తల్లీకూతురు మృతి
- కొడుకు ఆచూకీ గల్లంతు



కొడుకుతో రమ్య (ఫైల్)

**శంకరపట్నం:** ఇద్దరు పిల్లలతో ఆదివారం అదృశ్యమైన మహిళ కథ విషాదాంతమైంది. సోమవారం తల్లీకూతురు మృతదేహాలు కాలువలో లభించాయి. కొడుకు ఆచూకీ తెలియరాలేదు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కరీంపేట్‌కు చెందిన గడ్డం రమ్య (25)కు కొడుకు దివ్యాంగుడైన శివమణి (5), కూతురు అమ్ములు(18నెలలు) ఉన్నారు. ఆదివారం తన పిల్లలను మోపెడ్‌పై ఎక్కించుకొని బయటకు వెళ్లిన రమ్య సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెదికినా ఆచూకీ దొరకలేదు. గ్రామంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లే దారిలో ఎస్సారెస్పీ కాకతీయ కాలువ సమీపంలో దారి పక్కన మోపెడ్ కనిపించింది. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తరలివచ్చి కాలువతో పాటు చుట్టుపక్కల గాలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు రాత్రి వరకు గాలించినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం హుజూరాబాద్ వద్ద స్థానికులకు కాకతీయ కాలువలో కొట్టుకువస్తున్న అమ్ములు మృతదేహం, కొద్ది దూరంలో రమ్య మృతదేహం లభించింది. శివమణి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. అదనపు కట్నం తేవాలని అత్తింటివారు వేధించడం వల్లే తన అక్క.. పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకున్నదని రమ్య సోదరుడు ప్రశాంత్ ఆరోపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవి తెలిపారు.

## 808 కేసులు పరిష్కారం

- మైనార్టీ కమిషన్ చైర్మన్ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన కమిషన్‌కు 1,008 ఫిర్యాదులు రాగా, అందులో 808 కేసులను పరిష్కరించినట్టు మైనార్టీ కమిషన్ చైర్మన్ ఖమరుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఉస్మానియా, అంబేద్కర్ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ, అరబిక్, పార్శీ భాషల ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్‌లోని మహేంద్ర హిల్స్‌లో గురుద్వార నిర్మాణానికి మూడు వేల చదరపు గజాల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. బీహెచ్‌ఈఎల్‌లో బుద్ధిస్ట్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వెయ్యి చదరపు గజాలు, కోకాపేటలో క్రిస్టియన్ భవన్‌కు ఎకరానికిపైగా స్థలాన్ని కేటాయించినట్టు వివరించారు. పార్శీ పాఠశాల మరమ్మతులకు రూ.50 లక్షలు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశామని తెలిపారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అల్లిపల్లి చెక్‌పోస్టు వద్ద ఆంధ్రా నుంచి వస్తున్న వాహనాలను నిలిపివేసిన పోలీసులు



వనపర్తి జిల్లా కేంద్రంలో పోలీసులు సీజ్‌చేసిన ఆటోలు



సూర్యాపేట జిల్లా కోదాడలో ప్రయాణికులను తరలిస్తూ పట్టుబడ్డ అంబులెన్సులు

# అతిక్రమిస్తే ఉపేక్షించం

### రోడ్డెక్కిన వాహనాలు సీజ్

- ప్రయాణికులను తరలిస్తున్న మూడు అంబులెన్సులు
- రాష్ట్రవ్యాప్తంగా అనేక వాహనాలు, ఆటోలు, బైక్‌లు స్వాధీనం
- ఐపీసీ 188, 54 డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద కేసులు



సిరిసిల్లలో నిబంధనలు అతిక్రమించి రోడ్డుపైకి వచ్చి పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న కలెక్టర్ కృష్ణభాస్కర్

**న్యూస్‌నెట్‌వర్క్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా లాక్‌డౌన్ నిబంధన ఉల్లంఘించి అనవసరంగా రోడ్లపైకి వచ్చిన వాహనదారులపై ఐపీసీ సెక్షన్ 188, 54 డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద అధికారులు కొరడా ఝుళిపించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రయాణికులను చేరవేస్తున్న వాహనాలు, ఆటోలు సీజ్‌చేశారు. రోడ్లపైకి వచ్చి ద్విచక్రవాహనాదారులపైనా కేసులు నమోదుచేశారు. నిబంధనలకు విరుద్ధంగా తెరిచిన దుకాణాలకు సీజ్ చేశారు. ప్రయాణికులతో వెళ్తున్న మూడు అంబులెన్సులను రాష్ట్ర సరిహద్దు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం 65వ జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఆబ్కారీ అధికారులు 20 మద్యంషాపులు, తొమ్మిది బెల్లం దుకాణాలను సీజ్‌చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 19 వైన్స్‌లకు ఎక్సైజ్ అధికారులు తాళాలు వేశారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో రెండు వైన్ షాపుల నుంచి రూ.84 వేల విలువైన మద్యాన్ని రెండు ఆటోల్లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిబంధలను అతిక్రమించి ఆటోలను నడిపిన పలువురు డ్రైవర్లపై కేసులు నమోదుచేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 225 ద్విచక్ర వాహనాలు, 110 ఆటోలు, 54 ట్రాన్స్‌పోర్టు వాహనాలను పోలీసులు సీజ్‌చేశారు. నిర్మల్ జిల్లాలో ఆటోలు 45, కార్లు 2, బైక్‌లు 5, డీసీఎం వ్యాన్ ఒకటి, కామారెడ్డి జిల్లాలో 200 బైక్‌లు, 10 కార్లు, వంద ఆటోలు, నిజామాబాద్ జిల్లాలో వంద ఆటోలను సీజ్ చేశారు.

### చెక్‌పోస్టుల వద్ద అడ్డగింతలు

**రోడ్లపైకి** వచ్చిన వాహనాలను ఎక్కడికక్కడే అధికారులు, పోలీసులు నిలిపివేశారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తో ఉన్న రాష్ట్ర సరిహద్దులతోపాటు జిల్లాల పొలిమేరల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహనాలను అడ్డుకున్నారు. అత్యవసర సేవలు అందించే వాహనాలకు అనుమతినిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆంధ్రా సరిహద్దులోని అశ్వారావుపేట, దమ్మపేట, భద్రాచలం, ఛత్తీస్‌గఢ్‌లోని చర్ల వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేవారిని జిల్లాలోకి ప్రవేశించకుండా అడ్డుకొని వెనక్కి పంపించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దుల్లోని సిర్పూర్(టి), వాంకిడిలో చెక్‌పోస్టులతోపాటు ప్రాణహిత వద్ద పోలీసులు పహారా పెంచారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో రాష్ట్ర సరిహద్దులైన పుల్లూరు, నందిన్నె, సింధనూరు చెక్‌పోస్ట్‌ల వద్ద భద్రత పెంచారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎవరినీ అనుమతించడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతంలోని రాష్ట్ర సరిహద్దు ఫారెస్ట్ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. అమ్రాబాద్ మండలం మన్ననూర్, దోమలపెంట ఫారెస్ట్ చెక్‌పోస్టుల వద్ద వాహనాలను అనుమతించలేదు.

### వాహనాలు స్వాధీనం..

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2,480, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 105, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 244 వాహనాలను పోలీస్ సీజ్‌చేశారు. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల పరిధిలో లాక్‌డౌన్ ధిక్కరించిన 24 మందితోపాటు ఐదు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. బంజారాహిల్స్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఓ వ్యక్తి, మేడ్చల్ జిల్లా కీసరలో 18 మంది వాహనదారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురిలో ఐదు దుకాణాలపై కేసు నమోదు చేశారు.

## మీకు బాధ్యత లేదా?

**రోడ్లపైకొచ్చిన జనంపై సిరిసిల్ల కలెక్టర్ ఆగ్రహం**

**దురుసుగా ప్రవర్తించిన కాంగ్రెస్ నేత అరెస్టు**

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ సిరిసిల్లక్రైం:** లాక్‌డౌన్‌ను అతిక్రమించి నిర్లక్ష్యంగా రోడ్లపైకి వచ్చిన జనంపై రాజన్న సిరిసిల్ల కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గుంపులుగా జనం రోడ్లపైకి రావడంతో వారిని అదుపుచేసేందుకు కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగారు. కార్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని ఆపి, మరోసారి రోడ్లపైకి వస్తే కేసులు పెడతామని హెచ్చరించి తిప్పి పంపించారు. ప్రాణాంతక కరోనా కట్టడికి ప్రభుత్వం పెట్టిన నిబంధనను బాధ్యతగా భావించరా? అని నిలదీశారు. కుటుంబంలో ఒక్కరు మాత్రమే బయటకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుక్కోవాలని సూచించారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుగ్గిల్ల శ్రీకాంత్‌గౌడ్ ద్విచక్రవాహనంపై రాగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల పట్ల దురుసుగా వ్యహరించాడు. అక్కడే ఉన్న కలెక్టర్.. 'నలుగురికి చెప్పాల్సిన మీరే ఇలా ఉంటే ఎలా?' అంటూ సదరు నేతను అరెస్ట్ చేయాలని ఆదేశించారు. వెంటనే పోలీసులు అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## 340 వాహనాలు సీజ్

**డీటీసీ పాపారావు**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్‌ను ఉల్లంఘించిన 340 భారీ వాహనాలు సీజ్‌చేసినట్టు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఐటీ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కే పాపారావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను రంగంలోకి దింపి, నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను చేరవేస్తున్న ఆటోలు, క్యాబ్‌లు, ఇతర వాహనాలను సీజ్‌చేసినట్టు ఆయన వెల్లడించారు. వీటన్నింటినీ లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాతే విడుదలచేస్తామని తెలిపారు.

# ఊరంతా ఒక్కటై..

### కరోనా కట్టడికి చర్యలు


**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా పలు గ్రామాల ప్రజలు సమష్టిగా కృషిచేస్తున్నారు. తామే కాదు తమ ఊరు కూడా బాగుండాలని, ఊర్లో ఎవరూ ఈ వైరస్ బారిన పడకూడదని గ్రామాల పొలిమేరల్లో చెక్‌పోస్టులు పెట్టారు. ఒకరు రాళ్లు అడ్డం పెడితే, మరొకరు కంచె పాతారు. 'వేరే గ్రామస్థులు మా ఊరికి రావొద్దు.. మేము వేరే ఊరికి వెళ్లం' అంటూ స్పష్టంచేస్తున్నారు.

### గండికామారంలో..


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం గండికామారం గ్రామంలోకి నిత్యం భూపాలపల్లి నుంచి పదుల సంఖ్యలో పలువురు బైక్‌లపై వస్తుండటంతో.. సోమవారం స్థానికులు రోడ్డుకు అడ్డంగా ఇనుప కంచెను ఏర్పాటుచేశారు. అలాగే, గండికామారం వాసులు పక్క గ్రామాలకు వెళ్లకుండా కట్టడి చేశారు. గండికామారం గ్రామస్థులు చేసిన పనిని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, సోషల్ మీడియా ద్వారా అభినందిస్తున్నారు.

### స్వచ్ఛంద మద్దతు..

**లాక్‌డౌన్‌కు** ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని పలు గ్రామాల ప్రజలు తమ గ్రామానికి ఎవరూ రావద్దంటూ ఇతర ప్రాంతాల నుంచి గ్రామానికి వచ్చే రోడ్లను మూసివేశారు. తాము కూడా ఎక్కడికీ వెళ్లమని, ఇతరులు కూడా తమ గ్రామానికి రావద్దంటూ ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామ శివారులో స్థానికులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేసుకున్నారు. గ్రామస్థులు కూడా బయటకు వెళ్లకుండా నిలిపివేస్తామని సర్పంచ్ కనక ప్రతిభ తెలిపారు.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి శివారులో చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న సర్పంచ్ కనక ప్రతిభ



మా ఊర్లోకి ఎవరూ రావద్దంటూ రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టిన సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కూచిపూడి గ్రామస్థులు



మహబూబ్‌నగర్‌లోని రామ్‌నగర్ చౌరస్తాలో పర్యటిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కరోనా అంతుచూద్దాం

- ఎవరైనా విదేశాల నుంచి వస్తే సమాచారమివ్వాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ప్రజల శ్రేయస్సు కోసమే సీఎం కేసీఆర్ రాష్ట్రంలో లాక్‌డౌన్ ప్రకటించినట్టు ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో కరోనా మహమ్మారిని ఎదుర్కొనే అంశంపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. కరోనా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో చర్చించారు. రాష్ట్రంలో కరోనా నియంత్రణలో మహబూబ్‌నగర్ జిల్లా ప్రథమస్థానంలో ఉన్నదన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజలకు కరోనా వైరస్‌పై గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన వారు వెంటనే జిల్లా అధికారులకు సమాచారమందించాలని సూచించారు. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రెమా రాజేశ్వరితోపాటు వైద్యం, పోలీసు, రవాణా, నీటి పారుదల, పంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మహబూబ్‌నగర్ పట్టణంలో పర్యటించి.. తెరిచి ఉన్న దుకాణాలను మూసివేయించారు.

## స్వీయ నిర్బంధంలో..

- విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి హోం క్వారంటైన్
- 14 రోజులు ఇంట్లోనే

**న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ:** విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి తమ స్వగ్రామాలకు వచ్చిన పలువురు స్వీయనిర్బంధం పాటిస్తున్నారు. వారిని పరిశీలించిన వైద్యులు, అధికారులు.. కరోనా లక్షణాలు లేకపోయినా 14 రోజులపాటు ఇంట్లోనే ఒంటరిగా ఉండాలని సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని మూడు గ్రామాలకు విదేశాలనుంచి వచ్చిన పలువురిని మండల వైద్యాధికారులు స్వీయ గృహనిర్బంధంలో ఉంచారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం ఆవుడం గ్రామానికి రెండ్రోజుల క్రితం ముంబైలో నివాసం ఉంటున్న ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిని 14 రోజులు ఎటువెళ్లకుండా ఇంట్లోనే ఉండాలని అధికారులు సూచించారు.

**గల్ఫ్ నుంచి వచ్చినవారికి క్వారంటైన్**

గల్ఫ్‌దేశాల నుంచి ఇటీవల గ్రామానికి వచ్చినవారు స్వీయనిర్బంధంలో ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్ సర్పంచ్ రాపెల్లి గంగాధర్ సూచించారు. 14 రోజులపాటు హోం క్వారంటైన్‌లో ఉండాలన్న సర్పంచ్.. వారి చేతిపై సోమవారం స్టాంపులను వేశారు.

**దవాఖానకు 20 మంది అనుమానితులు**

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పాతమిట్టపల్లిలో కొవిడ్-19 అనుమానంతో 20 మందిని ఖమ్మం దవాఖానకు తరలించారు. మూడ్రోజుల క్రితం కరోనా వైరస్ సోకిన వ్యక్తి కుటుంబసభ్యులను గ్రామస్థుడు కలిశారు. ఆయన కుటుంబసభ్యులను దవాఖానకు తరలించారు. జార్ఖండ్‌కు చెందిన ఓ వ్యక్తి ఐదురోజుల క్రితం భద్రాద్రి కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌లో పనిచేసేందుకు వచ్చాడు. అతడు దగ్గు, జలుబుతో బాధపడుతుండగా తోటి కార్మికులు అతడిని సోమవారం పినపాకలోని పీహెచ్‌సీకి తరలించారు.

**క్వారంటైన్ ధిక్కరణ.. ఇద్దరికి హెచ్చరికలు**

స్వీయక్వారంటైన్ నిబంధన ధిక్కరించిన ఇద్దరిని బేగంపేట్ పోలీసులు హెచ్చరించారు. ఏపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇటీవలే అమెరికా నుంచి వచ్చారు. స్వీయ క్వారంటైన్ స్టాంపింగ్ ఉన్న వీరు బేగంపేట్ ఎయిర్‌లైన్స్‌కాలనీనిలో బంధువుల ఇంటికి చేరారు. యథేచ్ఛగా తిరుగుతుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

## కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

- 48 గంటల్లో ఓ మోస్తరు వానలు
- హైదరాబాద్‌లో మండుతున్న ఎండ

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వద్ద ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. దక్షిణ తమిళనాడు నుంచి ఏపీలోని రాయలసీమ, తెలంగాణ మీదుగా పశ్చిమ, విదర్భ వరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద ఉపరితల ద్రోణి ఏర్పడింది. వీటి ప్రభావంతో సోమవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాగల 48 గంటల వరకు రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు మెరుపులతో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదని వివరించారు. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్‌లో కొద్దిరోజులుగా ఎండ మండిపోతున్నది. ప్రధానంగా మధ్యాహ్న సమయంలో గడప దాటాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం గరిష్ఠం 35.5, కనిష్ఠం 22.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



కరీంనగర్‌లోని టవర్ సర్కిల్‌లో రసాయనాలు పిచికారీ చేసేందుకు ఎగిరిన డ్రోన్

## డ్రోన్‌తో వైరస్‌పై యుద్ధం

### కరోనా నివారణకు పిచికారీ

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** కరీంనగర్‌లో కరోనా వైరస్ విస్తరించకుండా నగరపాలక సంస్థ ఆధునిక పరికరాలను వినియోగిస్తున్నది. తాజాగా సోమవారం రోడ్లపై లిక్విడ్ బ్లీచింగ్, హైపో క్లోరైడ్‌ను వేగంగా పిచికారీ చేసేందుకు ప్రొటెక్టర్ 600, డ్రోన్ యంత్రాలను ఉపయోగించింది. టవర్ సర్కిల్ ప్రాంతంలో రెండు డ్రోన్‌లను వినియోగించారు. డ్రోన్‌లో ఒకేసారి 20 లీటర్లు నింపి పిచికారీ చేసుకునే అవకాశం ఉన్నది. ఆయా కాలనీల్లోని డ్రోన్‌సాయంతో పిచికారీ చేస్తున్నారు. కలెక్టరేట్ ప్రాంతంలో ప్రొటెక్టర్‌ను వినియోగించారు. ప్రొటెక్టర్-600 ద్వారా ఒక్కసారి 600 లీటర్ల మేర లిక్విడ్‌ను నింపి పిచికారీ చేసే వీలుంటుంది. ఓవైపు 20 అడుగుల మేర రెండువైపులా 40 అడుగుల మేరకు ఒకేసారి పిచికారీ చేయొచ్చు. రెక్కలు ఎటువైపు అయినా తిప్పుకునే అవకాశం ఉండటంతో 30 ఫీట్ల రోడ్లలోనూ వినియోగించుకోవచ్చు.



# లాక్‌డౌన్ మార్కెట్ డౌన్

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

**రికార్డు స్థాయిలో సూచీలు పతనం • 45 నిమిషాలు నిలిచిపోయిన ట్రేడింగ్**

**3,935 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ • 1,135 పాయింట్లు పడిపోయిన నిఫ్టీ**

**మూడేండ్లకుపైగా కనిష్ఠానికి దిగజారిన దేశీయ ఈక్విటీ మార్కెట్లు**

**మదుపరులను ముంచేసిన కరోనా భయాలు • విజృంభిస్తున్న వైరస్‌తో తీవ్ర అమ్మకాల ఒత్తిడి**

**భయం.. భయం.. భయం..
ఎక్కడ చూసినా కరోనా భయమే..
ఎవరి నోట విన్నా వైరస్ గుబులే.. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్.. భారత్‌లోనూ విజృంభిస్తున్నది. ఈ ప్రాణాంతక మహమ్మారిని కట్టడి చేసేందుకు అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర చర్యలు తీసుకుంటున్నా.. చాపకింద నీరులా విస్తరిస్తుండటం కలవరపెడుతున్నది. ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో ప్రకటించిన లాక్‌డౌన్.. సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చింది. ఈ పరిస్థితులు ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారితీస్తాయేమోనన్న భయాలు మదుపరులను వెంటాడాయి. పెరిగిపోతున్న కేసులు, మరణాల మధ్య తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఏర్పడింది. దీంతో సూచీలు మునుపెన్నడూ లేని నష్టాలను చవిచూశాయి. ఒకానొక దశలో ట్రేడింగ్‌ను సైతం ఆపేశారు. అయినప్పటికీ సెన్సెక్స్ 3,900 పాయింట్లకుపైగా, నిఫ్టీ 1,100 పాయింట్లకుపైగా కోల్పోయాయి. ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.14 లక్షల కోట్లకుపైగా ఆవిరైపోయింది.**

**ముంబై, మార్చి 23:** దేశీయ స్టాక్ మార్కెట్లలో కరోనా వైరస్ ప్రకంపనల్ని సృష్టిస్తూనే ఉన్నది. మదుపరుల భయాలు మార్కెట్లను కుప్పకూల్చుతూనే ఉన్నాయి. వైరస్ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా కేసుల సంఖ్య పెరిగిపోతుండటం.. సోమవారం భీకర అమ్మకాల ఒత్తిడికి దారి తీసింది. ఉదయం ఆరంభం నుంచే భారీ నష్టాల్లో మొదలైన సూచీలు.. కాసేపటికే 10 శాతానికిపైగా క్షీణించాయి. దీంతో మార్కెట్ నిబంధనల ప్రకారం ట్రేడింగ్‌ను 45 నిమిషాల పాటు నిలిపివేశారు. అయినప్పటికీ పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. 11 గంటల సమయంలో మళ్లీ మొదలైన మార్కెట్లు.. సమయం గడుస్తున్నకొద్దీ మరింతగా పతనమైయ్యాయి. చివరకు మునుపెన్నడూ లేని నష్టాలు వాటిల్లగా, మూడేండ్లకుపైగా కనిష్ఠ స్థాయికి సూచీలు దిగజారాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ) సూచీ సెన్సెక్స్ 3,934.72 పాయింట్లు లేదా 13.15 శాతం పడిపోయి 25,981.24 వద్దకు చేరింది. ఒకానొక దశలో 25,880.83 పాయింట్ల వద్దకు పడిపోవడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ కూడా 1,135.20 పాయింట్లు లేదా 12.98 శాతం క్షీణించి 7,610.25 వద్ద నిలిచింది. కేవలం ఒక్కరోజులోనే ఈ స్థాయిలో నష్టాలు నమోదవడం ఇదే తొలిసారి. బ్యాంకింగ్, ఫైనాన్స్, క్యాపిటల్ గూడ్స్, బేసిక్ మెటీరియల్స్, ఇండస్ట్రియల్స్, ఆటో సూచీల షేర్లు 16.82 శాతం నష్టపోయాయి. మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ సూచీలు దాదాపు 13 శాతం చొప్పున పతనమైయ్యాయి. బీఎస్‌ఈలో 2,037 షేర్లు నష్టపోగా, 232 షేర్లు లాభపడ్డాయి. 132 షేర్లు మాత్రం యథాతథంగా ఉన్నాయి.

| | |
|---|---|
| గత ముగింపు | 29,915.96 |
| ప్రారంభం | 27,608.80 |
| గరిష్ఠ స్థాయి | 27,900.83 |
| ముగింపు | 25,880.83 |

భీకర నష్టాల్లో ప్రపంచ మార్కెట్లు


అంతర్జాతీయంగా పెరుగుతున్న కరోనా మరణాలు.. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లను భీకర నష్టాల్లోకి నెట్టాయి. వైరస్ మృతులు 15వేలను దాటడం, బాధితులు 3లక్షలకుపైగానే ఉండటంతో మదుపరులు అమ్మకాలపైనే దృష్టి పెట్టారు. ముఖ్యంగా ఆసియా మార్కెట్లను ఈ ప్రాణాంతక మహమ్మారి విజృంభించడం కుదిపేస్తున్నది. ఈ క్రమంలోనే హాంకాంగ్ సూచీ 4.9 శాతం, చైనా 3.1 శాతం, తైవాన్ 3.7 శాతం, సింగపూర్ 7.5 శాతం, ఇండోనేషియా 3.8 శాతం, దక్షిణ కొరియా 5.5 శాతం చొప్పున నష్టాలపాలైయ్యాయి. ఫారెక్స్ ట్రేడ్ దన్నుతో జపాన్ మాత్రం 2 శాతం పెరిగింది. ఐరోపా మార్కెట్లలో ప్రధాన సూచీలైన బ్రిటన్ 4.8 శాతం, జర్మనీ 4.6 శాతం, ఫ్రాన్స్ 4.4 శాతం చొప్పున క్షీణించాయి. అలాగే న్యూజీలాండ్ 7.6 శాతం, ఆస్ట్రేలియా 5.6 శాతం మేర పడిపోయాయి.

### రూ.14.22 లక్షల కోట్లు ఆవిరి

**స్టాక్ మార్కెట్లు** భారీ నష్టాలను మూటగట్టుకుంటుండటంతో లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద ఆవిరైపోతున్నది. సోమవారం సెన్సెక్స్ 3,935 పాయింట్లు పడిపోయిన నేపథ్యంలో బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.14 లక్షల కోట్లకుపైగా కరిగిపోయింది. తీవ్ర అమ్మకాల ఒత్తిడి మధ్య రూ.14,22,207.01 కోట్లు దిగజారి రూ.1,01,86,936.28 కోట్లకు చేరింది. విదేశీ సంస్థాగత మదుపరులు రూ.3వేల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. కాగా, దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ యాక్సిస్ బ్యాంక్ షేర్ విలువ 28 శాతానికిపైగా నష్టపోగా, బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లూ పెద్ద ఎత్తునే నష్టాలపాలైయ్యాయి. 'భారతీయ స్టాక్ మార్కెట్లలో ఇది మరో బ్లాక్ మండే. కరోనా వైరస్ బాధితులు పెరుగుతుండటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను విపరీతంగా దెబ్బతీసింది. దేశం మొత్తం దాదాపు లాక్‌డౌన్ స్థితికి చేరుకోవడం కూడా మదుపరులను భయపెట్టింది' అని ట్రేడింగ్‌బెల్స్ సీనియర్ అనలిస్టు సంతోష్ మీనా అన్నారు. ఈ నెలలో సెన్సెక్స్ దాదాపు 15వేల పాయింట్లు కోల్పోగా, సంపద సుమారు రూ.50 లక్షల కోట్లు హరించుకుపోయింది.

### బక్కచిక్కిన రూపాయి

**డాలర్‌తో పోల్చితే ఆల్‌టైమ్ కనిష్ఠానికి పతనం • 76.20 వద్దకు చేరిక**




**రూపాయి** విలువ జీవనకాల కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో పోల్చితే మునుపెన్నడూ లేనివిధంగా సోమవారం ఫారెక్స్ మార్కెట్ ట్రేడింగ్‌లో 76 మార్కును దాటి నష్టపోయింది. ఈ ఒక్కరోజే భారత కరెన్సీ విలువ రూపాయి క్షీణించింది. అమెరికా కరెన్సీకి మార్కెట్‌లో పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడటం.. రూపాయి ఉసురు తీసింది. కరోనా వైరస్ అదుపు కోసం లాక్‌డౌన్ దిశగా వెళ్తుండటం.. మాంద్యం భయాలను రేకెత్తించింది. ఈ క్రమంలోనే రూపాయి విలువ బలహీనపడింది. 76.20 వద్ద స్థిరపడింది. ఉదయం ఆరంభంలోనే 75.90 స్థాయి నష్టాలతో మొదలైన రూపాయి.. ఒకానొక దశలో 76.30కు దిగజారింది. ఆఖర్లో స్వల్పంగా కోలుకుని 76.20 వద్ద నిలిచినట్లు ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. మరోవైపు యూరోతోనూ 80.64 స్థాయికి దిగజారిన రూపాయి విలువ.. బ్రిటన్ పౌండ్‌తో 87.42 స్థాయికి క్షీణించింది. జపాన్ యెన్‌తో చూస్తే రూపాయి మారకం విలువ 68.19గా ఉన్నది. ఇక ఫ్యూచర్ మార్కెట్‌లో క్రితం ముగింపుతో పోల్చితే బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 5.30 శాతం క్షీణించి 25.55 డాలర్లకు పరిమితమైంది.

### 52 వారాల కనిష్ఠానికి వెయ్యి స్టాకులు

**కార్పొరేట్** కంపెనీల షేర్లు కుదేలవుతున్నాయి. వరుసగా సోమవారం కూడా వెయ్యికి పైగా కంపెనీల షేర్లు 52 వారాల కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. వీటిలో టాటా మోటర్స్, ఐఆర్‌సీటీసీ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. అలాగే ఎంఅండ్ఎం ఫైనాన్షియల్, యాక్సిస్ బ్యాంక్, మ్యాక్స్ ఫైనాన్సియల్, బంధన్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్ఐఐటీ టెక్, బజాజ్ ఫిన్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫైనాన్స్, కెనరా బ్యాంక్, లార్సెన్ అండ్ టుబ్రోలు ఉన్నాయి. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 15 శాతం పతనం చెందగా, ఆటో ఇండెక్స్ 12 శాతం కిందకు పడిపోయాయి. బీఎస్‌ఈలో లిస్టైన షేర్లలో 1,886 షేర్లు పతనమవగా, 191 షేర్లు లాభపడ్డాయి. కానీ 106 షేర్లు మాత్రం యథాతథంగా ఉన్నాయి. యాక్సిస్ బ్యాంక్ 28 శాతం క్షీణించి టాప్ లూజర్‌గా నిలిచింది. బజాజ్ ఫిన్, ఇండస్‌ఇండ్ బ్యాంకులు 23 శాతానికి పైగా కోల్పోయాయి. వీటితో పాటు ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి, ఎల్‌అండ్‌టీ, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఆటో, ఎస్బీఐ, రిలయన్స్, కొటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, టైటాన్, సన్ ఫార్మా, హీరో మోటోకార్ప్, ఓఎన్‌జీసీలు పది శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. ఇన్ఫోసిస్, మహీంద్రా, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, నెస్లె ఇండియా, టీసీఎస్, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్, పవర్‌గ్రిడ్‌ల షేర్లు కూడా పతనం చెందాయి.

### ఆర్‌ఐఎల్‌కి షాక్

**రిలయన్స్** మార్కెట్ విలువ మరింత కరిగిపోయింది. షేరు ధర ఏకంగా 13 శాతం పతనం చెందడంతో కంపెనీ విలువ రూ.86 వేల కోట్లు కోల్పోయింది. ఇంట్రాడేలో 14 శాతానికి పైగా పతనం చెందిన షేరు ధర చివరకు 13.37 శాతం పతనంతో రూ.883.85 వద్ద పరిమితమైంది. దీంతో కంపెనీ ఎం-క్యాప్ రూ.86,435.91 కోట్లు తగ్గి రూ.5,60,296.16 కోట్లకు జారుకున్నది. గత శుక్రవారం 12 శాతం పెరిగిన కంపెనీ షేరు ధర ఆ మరుసటి రోజే అంతే స్థాయిలో పతనం చెందడం విశేషం.

## ఏప్రిల్ 1 నుంచే ఆర్బీఐ ఆర్థిక సంవత్సరం

**2021-22 నుంచి మొదలు**



**ముంబై, మార్చి 23:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తమ ఆర్థిక సంవత్సర కాలాన్ని మార్చుతున్నట్లు ప్రకటించింది. 2021-22 నుంచి ప్రభుత్వం అనుసరించే ఆర్థిక సంవత్సర కాలాన్నే అనుసరిస్తామని తెలిపింది. ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుండగా.. ఆర్బీఐ మాత్రం జూలై 1 నుంచి జూన్ 30 వరకు పాటిస్తున్నది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) జూన్ 30నే ముగుస్తుందన్న ఆర్బీఐ.. వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) మాత్రం 2021 మార్చి 31తో తీరిపోతుందని స్పష్టం చేసింది. దీంతో 2021-22 ఆర్థిక సంవత్సరం అటు ప్రభుత్వానికి, ఇటు ఆర్బీఐకి ఒకేసారి మొదలు కానున్నది. దీంతో ఆర్బీఐకి ఒక మధ్యంతర డివిడెండ్ ప్రకటన తప్పవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

**వ్యవస్థలోకి మరో రూ.లక్ష కోట్లు**


కరోనా వైరస్ దెబ్బకు కుదేలైన దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకునేందుకు ఆర్బీఐ మార్కెట్‌లోకి నగదు ప్రవాహాన్ని పెంచుతున్నది. ఇందులో భాగంగానే వ్యవస్థలోకి మరో లక్ష కోట్ల రూపాయలను పంపించనున్నది. అవసరమైతే మరింత నగదును అందిస్తామని హామీ కూడా ఇచ్చింది. రెపో యాక్షన్ ద్వారా ఈ నిధులను సమకూర్చనున్నది. ఇదిలావుంటే తొలి విడుత కింద సోమవారం రూ.50వేల కోట్లు అందించిన ఆర్బీఐ.. మంగళవారం రెండో విడుత చర్యలు తీసుకోనున్నది.

**సెక్యూరిటీ కొనుగోళ్లు 26నే**

రెండో విడుత ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోళ్లు ఈ నెల 26నే చేపడుతామని ఆర్బీఐ తెలిపింది. బహిరంగ మార్కెట్ కార్యకలాపాల (ఓఎంవో) ద్వారా రూ.15వేల కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లను ఆర్బీఐ కొనుగోలు చేయనుండగా.. ఇందుకు ముహూర్తాన్ని ఈ నెల 30గా నిర్ణయించారు. అయితే దీన్ని 26కు మార్చారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, నగదు అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. కాగా, తొలి విడుత వేలం మంగళవారం జరుగనున్నది. ఈ సందర్భంగా రూ.15వేల కోట్ల విలువైన బాండ్లను ఆర్బీఐ కొంటున్నది. ఈ వేలంలో 4 రకాల ప్రభుత్వ బాండ్లను ఆర్బీఐ కొనుగోలు చేయనున్నది.

## 30 రోజుల గడువు ఇవ్వండి..

**రెన్యూవల్ ప్రీమియం చెల్లింపులపై ఐఆర్‌డీఏఐ సూచన**



**న్యూఢిల్లీ, మార్చి 23:** రెన్యూవల్ ప్రీమియం చెల్లింపులపై గడువును అదనంగా 30 రోజులపాటు ఇవ్వాలని అన్ని బీమా సంస్థలకు బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ సూచించింది. కరోనా వైరస్ నేపథ్యంలో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడంతో ప్రీమియం చెల్లింపులు జరిపేవారికోసం ఈ నిర్ణయం తీసుకున్నది. ఐఆర్‌డీఏఐ తీసుకున్న తాజా నిర్ణయంతో హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియం రెన్యూవల్‌ను మరో నెల రోజులపాటు చెల్లించే అవకాశం కల్పించాలని తాజా నోటిఫికేషన్‌లో సూచించింది. కొవిడ్-19ని అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐఆర్‌డీఏఐ వెల్లడించింది. అలాగే అన్ని బీమా కంపెనీలు తమ వెబ్‌సైట్‌లో అన్ని రకాల సమాచారాన్ని పొందుపరుచాలని, ముఖ్యంగా ప్రీమియం చెల్లింపులకు సంబంధించి ప్రత్యామ్నాయ సదుపాయాలను కూడా వెల్లడించాలని సూచించింది.

## టీసీఎస్ గ్లోబల్ హెడ్ మృతి


**న్యూఢిల్లీ, మార్చి 23:** దేశంలో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ గ్లోబల్ హెడ్ అమిత్ జైన్.. గుండె పోటుతో గతవారం మృతిచెందారు. 53 ఏండ్ల వయస్సు కలిగిన జైన్‌కు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నప్పుడు గుండెపోటు రావడంతో దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ నెల 19నే ఆయన మృతిచెందారు. ఈ విషయంపై కంపెనీ స్పందించడానికి నిరాకరించింది. కానీ, ఆయన సోదరుడు స్పందిస్తూ ఆఫీస్‌లో ఒత్తిడి మరింత తీవ్రమవడంతో గత కొన్ని రోజులుగా నిద్ర కూడా పోలేదని చెప్పారు.

## వంద కోట్లతో యాక్సిస్ ఫండ్



**న్యూఢిల్లీ, మార్చి 23:** కరోనా వైరస్ కట్టడి చేయడానికి దేశంలో మూడో అతిపెద్ద ఆర్థిక సేవల సంస్థ యాక్సిస్ బ్యాంక్ రూ.100 కోట్లతో ప్రత్యేక ఫండ్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక నిధిని వినియోగదారులు, ఉద్యోగులు, వెండర్లు, ప్రభుత్వ ఏజెన్సీల కోసం వినియోగించనున్నట్లు ప్రకటించింది. అలాగే ఈ నెల 31 వరకు అన్ని రకాల ఖాతాలపై విధిస్తున్న చార్జీలను ఎత్తివేసింది కూడా.

## నిత్యావసరాల ఉత్పత్తిని కొనసాగించాలి: ప్రధాని



**న్యూఢిల్లీ, మార్చి 23:** కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో నిత్యావసరాల ఉత్పత్తికి ఇబ్బందుల్లేకుండా చూడాలని దేశీయ పరిశ్రమను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారు. వ్యాపార, పారిశ్రామికవేత్తలతో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులను ఇంటి నుంచే పనిచేసేలా అనుమతించాలని ఆయా సంస్థలకు సూచించారు. ఉద్యోగులెవరినీ తొలగించవద్దని విజ్ఞప్తి చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నదని, అందరం కలిసికట్టుగా ఎదురించి నిలువాలని పిలుపునిచ్చారు.

**మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం :: ఖమ్మం**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**
**కమిషనర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్,**
**ఖమ్మం జిల్లా, తెలంగాణ వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ క్రింద టెండరు ప్రకటన ప్రకారం కోరిన టెండర్లు దిగువ విధంగా ఉన్నవి.**

**NIT No. 23/DB/KMC/1624/2019-20** **తేది : 21-03-2020**

1) ఎ) మొత్తం పనుల సంఖ్య-43 నం.లు, బి) పనుల స్వభావం- i) ఎలక్ట్రికల్ మెటీరియల్, బోర్‌వెల్ స్క్రాప్ మెటీరియల్, ఎంఎస్ స్క్రాప్ మెటీరియల్, పాత న్యూస్ పేపర్ 7 పత్రికలు వేలం మరియు ఇంటిగ్రేటెడ్ వెట్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉపయోగించి రెమెడియేషన్ ప్రాసెస్ (చిన్న మోడల్) కొరకు EOI-5 నం.లు. ii) స్టేషనరీ ఏర్పాటు కొరకు రేట్ కాంట్రాక్ట్-1 నం., iii) టిప్పర్ ఆటోల సేకరణ కొరకు రేట్ కాంట్రాక్ట్-1 నం. iv) సివిల్ మరియు ఇతర పనులు-36 నం.లు. v) గమనిక: NIT No. 22/DB/KMC/1624/2019-20 తేది: 12-03-2020 ప్రకారం పబ్లిక్ టాయిలెట్ల (110 నం.లు) నిర్మాణం కొరకు ఆసక్తి వ్యక్తీకరణ కొరకు చివరి తేది: 30-03-2020 వరకు పొడిగించబడినది. 2) పని మొత్తం విలువ : **రూ. 620.22 లక్షలు**, 3) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 21-03-2020 న ఉదయం 10.30 గంటలు. 4) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 30-03-2020న సాయంత్రం 4.00 గంటలకు. 5) బిడ్ తెరుచు తేది: 30-03-2020న సాయంత్రం 4.30 గంటలకు. కార్యాలయంలో సంప్రదించుటకు అధికారి పేరు మరియు చిరునామా: అసిస్టెంట్ ఇంజినీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, **మొబైల్: 7901298207** (అసిస్టెంట్ ఇంజినీరు). తదుపరి వివరాలను **http://tender.telangana.gov.in** (రేట్ కాంట్రాక్ పనుల కొరకు) మరియు http://khammamcorporation. telangana.gov.in (EOI కొరకు)లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చును.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్**

**DIPR RO.No. 1003 PP/CL/Advt/1/2019-20, Dt: 23-03-20**




## రిలయన్స్ ఔదార్యం..

**ముంబైలో కొవిడ్-19 దవాఖాన ఏర్పాటు**

**న్యూఢిల్లీ, మార్చి 23:** దేశంలో అతిపెద్ద వ్యాపార దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ముందుకొచ్చింది. దేశంలో రోజు రోజుకు విజృంభిస్తున్న కరోనా వైరస్‌ను అరికట్టడానికి తనవంతుగా చేయూతనందించడంలో భాగంగా మాస్కుల ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు లక్షకు పెంచడంతోపాటు అత్యవసరంగా తిరిగి వాహనాలకు ఉచితంగా ఇంధనం సరఫరా చేయడంతోపాటు ఆయా నగరాల్లో ఉన్న ఎన్జీవోలతో కలిసి ఉచితంగా భోజనం కూడా అందిస్తున్నది. అలాగే సామాజిక సేవల్లో భాగంగా ముంబైలో 100 పడకల దవాఖానని సైతం ఏర్పాటు చేసింది. కొవిడ్-19 పాజిటివ్ వచ్చిన వారికి చికిత్స అందించడానికి రెండు వారాల్లోనే ఈ దవాఖానని బ్రిహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ)తో కలిసి శ్రీ హెచ్‌ఎన్ రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్ నెలకొల్పింది. అన్ని రకాల పడకల వద్ద బయోమెడికల్ పరికరాలు, వెంటిలేటర్లు, పేస్‌మేకర్లు, డయాల్‌సిస్ మెషిన్లు, పేటెంట్ మానిటరింగ్ పరికరాలు ఉంచింది. వైరస్ నేపథ్యంలో మూతపడిన కంపెనీకి సంబంధించిన పలు ప్రాజెక్టుల్లోపనిచేస్తున్న కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగుల జీతభత్యాలు యథావిధిగా చెల్లించనున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న 746 గ్రాసరీ స్టోర్లలో అన్ని రకాల వస్తువులను సిద్ధంగా ఉంచినట్లు, ఇవి ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరిచివుంచనున్నట్లు వెల్లడించింది.

**నూతన కస్టమర్లకు బ్రాడ్‌బ్యాండ్ ఫ్రీ**

నూతన బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లకు ఉచితంగా అందిస్తున్నట్లు జియో ప్రకటించగా..పాత వినియోగదారులకు డాటా పరిమితిని రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించింది. కరోనా వైరస్ నేపథ్యంలో ఇంటి నుంచి పనిచేసేవారికి ప్రయోజనం కల్పించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. జియో ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ కనెక్షన్ పొందడానికి రూ.2,500 చెల్లించాల్సి ఉండగా, వీటిలో రూ.1,500 రిఫండ్ కింద పొందనున్నారు.

## ప్రొడక్షన్ బంద్..!

**31 దాకా నిలిపివేసిన హ్యుందాయ్, కియా, బీఎండబ్ల్యూ, రెనో**

**గృహ, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలు కూడా..**




**న్యూఢిల్లీ, మార్చి 23:** కరోనా వైరస్ దెబ్బకు ఆటోమొబైల్ సంస్థలు విలవిలలాడుతున్నాయి. ఇదివరకే పలు సంస్థలు ఉత్పత్తిని నిలిపివేయగా..తాజాగా హ్యుందాయ్, కియా మోటర్స్, విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ, ఫ్రెంచ్ సంస్థ రెనోలు తాత్కాలికంగా ప్రొడక్షన్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. కరోనా వైరస్ మహమ్మారి మరింత విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ఉద్యోగులకు, వినియోగదారులు, వర్కర్లు, భాగస్వాముల ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కియా మోటర్స్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం సంస్థ ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాల్లో యూనిట్‌ను నెలకొల్పింది. అలాగే బీఎండబ్ల్యూ కూడా ఈ నిర్ణయం తీసుకున్నది. చెన్నైలో ఉన్న ప్లాంట్‌ను ఈ నెల చివరి వరకు మూసివేసిన సంస్థ..ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే అవకాశం కల్పించింది. రెనో కూడా చెన్నైలో ఉన్న ప్లాంట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు గృహోపకరణాలు, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ సంస్థలు కూడా ఈ నెల చివరి వరకు తమ ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. వీటిలో సామ్‌సంగ్, ఎల్‌జీ, పానసోనిక్, గోద్రేజ్ అప్లయెన్స్‌లు ఉన్నాయి. నోయిడా, చెన్నై ప్లాంట్లలో మొబైల్ ఫోన్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్ల, ఏసీ, ఆడియో ఉత్పత్తులు ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు పానసోనిక్, సామ్‌సంగ్ ప్రకటించింది. చైనా నుంచి కీలక విడిభాగాల దిగుమతులు నిలిచిపోవడంతో క్రమంగా ఉత్పత్తిని తగ్గించుకుంటు వచ్చిన ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థలు..ప్రస్తుతం ఈ మహమ్మారి దేశాన్ని పట్టిపీడిస్తుండటంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాయి.

**టీవీఎస్ రెండు రోజులు**

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కూడా ప్లాంట్‌ను రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. కరోనా వైరస్ నేపథ్యంలో ఉద్యోగుల భద్రత కల్పించాలనే ఉద్దేశంతో బుధవారం వరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల ప్లాంట్‌లను మూసివేస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు, వైరస్ మరింత ముదిరితే బంద్‌ను కొనసాగించనున్నట్లు సంకేతాలిచ్చారు.

నమస్తే తెలంగాణ /nt.zindagi
WWW. NTNEWS.COM
# జిందగీ
9 కరీంనగర్
మంగళవారం 24 మార్చి 2020



**మన దేశంలో కరోనా ప్రభావం కనిపించిన తొలినాళ్లలోనే అహ్మదాబాద్‌కు చెందిన ఒక యువతికి కరోనా పాజిటివ్ ఉందని తేలింది. మొదట్లో కొవిడ్-19 నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న అతి కొద్దిమందిలో ఆమె ఒకరు. తనకు ఆ వ్యాధి సంక్రమించిన నేపథ్యాన్ని అందరితోనూ పంచుకోవాలన్న ఉద్దేశ్యంతో హాస్పిటల్ బెడ్ మీద నుంచే తన కథను మనసుకు హత్తుకునేలా వివరించింది...**

## అన్ని జాగ్రత్తలూ తీసుకున్నా..

# అయినా?

'2020 నూతన సంవత్సరం ఒక అందమైన జ్ఞాపకంగా మిగిలిపోవాలనే ఉద్దేశ్యంతో నార్తరన్ లైట్స్ చూడటానికి ఫిన్లాండ్ వెళ్లాలనుకున్నాను. జనవరి 15 నుండే వుహాన్‌లో కరోనా వైరస్ ప్రబలుతున్న విషయం ఆ సమయానికే నాకు తెలిసింది. ప్రపంచం ఓ విపత్కర స్థితిలో ఉందని అర్థమైంది. కానీ కరోనా నన్నేమీ చేయదని అనుకున్నాను. ఎందుకంటే నాకు ఆ సమస్య గురించి సంపూర్ణ అవగాహన ఉంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నాను. కాబట్టే, నాకేం కాదన్న నమ్మకంతో మార్చిలో ఫిన్లాండ్‌కు ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకున్నాను.

ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేప్పుడు ఎన్-99 మాస్క్ ధరించాను. వందసార్లు నా చేతులను శుభ్రం చేసుకున్నాను. వీలైనంత ఎక్కువసార్లు నా సీటును కూడా శుభ్రం చేశాను. ఫ్లైట్‌లో 90-95% మంది ప్రయాణికులు ఎలాంటి మాస్కులు ధరించకపోవడం నాకు విచిత్రంగా అనిపించింది. సెక్యూరిటీ చెకింగ్‌లు, పాస్‌పోర్ట్ చెకింగ్‌ల సమయంలో మాస్క్‌ను తాకకుండా చూసుకున్నాను. ఆకలిదప్పులు తీర్చుకోవడానికి నేరుగా చేతులను ఉపయోగించకుండా జాగ్రత్త పడ్డాను. నేను నా ప్రయాణం ప్రారంభించిన సమయానికి 10 కంటే తక్కువ కేసులే ఉన్నాయి. ఇండియాకు తిరిగి వచ్చేనాటికి మాత్రం కొవిడ్-19 ఓ మహమ్మారిగా మారింది. అప్పటికి మన దేశంలో చాలా తక్కువ కేసులు నమోదయ్యాయి. ఆ ఎడబాటు తర్వాత కూడా... నేను నా కుటుంబ సభ్యులను ఆలింగనం చేసుకోలేదు. ఉద్వేగాల్ని పక్కనపెట్టి చాలా దూరంగా ఉన్నాను. శానిటైజర్‌ను నా సంచులపై స్ప్రే చేశాను. అవసరమైన వస్తువులు మాత్రమే తీసుకుని... బ్యాగేజీని బాత్రూంలో ఉంచాను. ఎందుకో, మార్చి 14న నాకు కొంచెం జ్వరంగా అనిపించింది. దీంతో గదిలో ఒంటరిగానే ఉన్నాను. మరుసటి రోజు ఉదయం, అమ్మానాన్నలు నా జ్వరం గురించి జనరల్ ఫిజీషియన్‌తో మాట్లాడారు. అయితే నేను ఫిన్లాండ్‌లోని -15 డిగ్రీల వాతావరణం నుంచి హఠాత్తుగా +25కి రావడం వల్ల జ్వరం వచ్చి ఉంటుందనే ఉద్దేశ్యంతో, ఫ్లూ చికిత్సలో భాగంగా కొద్దిరోజులు యాంటీ బయాటిక్స్ తీసుకోవాలని సలహా ఇచ్చాడు వైద్యుడు.

నా గది బయట ఒక చిన్న టేబుల్ ఉంటుంది. ఇంట్లో వాళ్లు నాకు అవసరమైన వస్తువులను అప్పగించడానికి అది ఉపయోగపడేది. బాత్రూమ్ సింక్‌లోని నా పాత్రలను సబ్బుతోపాటు వేడి నీటితో శుభ్రంగా కడిగేదాన్ని. నేను వాడిన పాత్రలను ఇంట్లోకి పంపే ముందు... తలుపులు తెరిచి మరోసారి చేతులు కడుక్కునేదాన్ని. పాత్రలను తీసుకెళ్ళి బయట టేబుల్‌పై ఉంచేదాన్ని. ఆ పాత్రలను అమ్మ తిరిగి కడిగేది. (ఐసొలేషన్) స్వీయ రక్షణలో ఒంటరిగా ఉన్నన్ని రోజులూ నేను అనుసరించిన విధానం ఇది. అంతేకాదు, నేను వాడిన బట్టలను డెటాల్‌తో, వేడి నీటిలో శుభ్రం చేసేదాన్ని. ప్రతిసారీ శానిటైజర్‌తో చేతులు కడుక్కోవడం, బకెట్ హ్యాండిల్‌ను డెటాల్ నీటితో శుభ్రం చేయడం... మరచిపోయేదాన్ని కాదు. అయినా జ్వరం తగ్గలేదు. దీంతో మా ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌కు పిలిచారు. స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్లాను.
క్లినిక్‌లో కాలుపెట్టేముందు N99 మాస్క్ ధరించాను. అందరికీ దూరంగా కూర్చున్నాను. అది చూసిన హాస్పిటల్ బృందం, డాక్టర్... నన్ను కలవడానికి ముందు తామూ ముసుగులు ధరించారు. వారు అలా చేసినందుకు సంతోషపడ్డాను. ముందు జాగ్రత్త ఎవరికైనా మంచిదేగా! నా వ్యాధి లక్షణాలు ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయనీ... నేనింకా జ్వరంతోనే ఉన్నాననీ... అలాగే నాకు తేలికపాటి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ ఉందనీ డాక్టర్ నిర్ధారించారు. తను రాసిన మందులు వాడాలని సూచించారు.

ఆ తర్వాత నేను ఇంటికి తిరిగి వెళ్ళాను, నా కారును ఎండలో ఉంచాను. దీనివల్ల కరోనా వైరస్‌ను నిర్మూలించవచ్చని నా ఆలోచన. ఇంట్లోకి వెళ్లడానికి కూడా లిఫ్ట్ ఉపయోగించలేదు. తలుపు తెరిచి ఉందో లేదో తెలుసుకోడానికి అమ్మను పిలిచాను. తలుపులు తాకకుండానే లోపలికి వెళ్లాను. నేరుగా నా గదిలోకి వెళ్లిపోయాను. ఆ రెండు రోజులు జ్వరం ఉంది. దగ్గు లేదు. శ్వాసపరమైన సమస్యా లేదు.

**మార్చి 16న దగ్గు నన్ను వేధించింది. ఛాతీలో కొద్దిగా బిగుతుగా అనిపించింది. లక్షణాలు చాలా మామూలుగా ఉన్నాయి. కానీ, నేను డాక్టర్‌కు కాల్ చేశాను. ఆమె వెంటనే ఆసుపత్రికి వచ్చి కలవమని చెప్పారు. మళ్ళీ ఒంటరిగానే వెళ్ళాను. ఆమె నా ఛాతీని పరిశీలించింది, నాకు శ్వాసలో సమస్య ఉందని చెప్పింది. నేను వెంటనే కొవిడ్-19 పరీక్ష చేయమని అడిగాను.**

నేను ఐసొలేషన్‌లో ఉన్న సమయంలో... ఓ అవార్డు ప్రదాన కార్యక్రమం జరిగింది. దాన్ని అందుకోవడానికి కూడా వెళ్ళలేదు. నిజానికి ఆ విజయం కోసం మేం 6 సంవత్సరాలు కష్టపడ్డాం. ఫిన్లాండ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత నా టీమ్‌ను కలవడానికి సైతం వెళ్ళలేదు. నన్ను నేను పూర్తిగా ఐసొలేట్ చేసుకున్నాను. ముందుజాగ్రత్త అనేది కష్టాల నుండి కాపాడుతుందని నేను నమ్ముతాను. అదే సమయంలో ఎవరూ మానసికంగా కూడా ఒత్తిడికి గురికాకూడదు. కాబట్టే, నేను చాలా ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తూ వచ్చాను.
కొన్నిరోజులకు జ్వరం దాదాపుగా తగ్గి పోయింది. ఇతర లక్షణాలు కూడా మాయం అయినట్టు అనిపించింది. అయినా ఇంకా కొంత కాలం ఐసొలేషన్‌లోనే ఉండాలని నిర్ణయించుకున్నా. మార్చి 16న మళ్లీ దగ్గు వచ్చింది. ఛాతీలో కొద్దిగా బిగుతుగా అనిపించింది. ఆ లక్షణాలు కూడా చాలా సాధారణంగా ఉన్నాయి. అయినా నేను డాక్టర్‌కు కాల్ చేశాను. ఆమె వెంటనే ఆసుపత్రికి వచ్చి కలవమని చెప్పారు. మళ్ళీ ఒంటరిగానే వెళ్ళాను. ఆమె నా ఛాతీని పరీక్షించారు. నాకు శ్వాసలో కొంత సమస్య ఉందని చెప్పారు. నేను వెంటనే కొవిడ్-19 లక్షణాలు ఏమైనా ఉన్నాయేమో ఇంకోసారి పరీక్షించమని అడిగాను. నా మట్టుకునేను తగినన్ని జాగ్రత్తలు తీసుకున్నా, కుటుంబం గురించే చాలా భయపడ్డాను. నా వల్ల వారికి ఎలాంటి వ్యాధులూ రాకూడదనుకున్నాను. దేవుడ్ని కూడా ప్రార్థించాను. అయినా ఎక్కడో ఏదో అనుమానం. గత 8 రోజులుగా నిర్బంధంలో ఉండటం వల్ల వ్యాధి లక్షణాలూ బయటికి కనిపించకపోయినా... నేను స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునేందుకు ఇంకా కొంత సమయం పడుతుందని అర్థమైంది. రోజులు లెక్కబెడుతూ కాలం గడిపాను. నా బాధ అంతా కుటుంబం గురించే.

ఇది చాలా పెద్ద పోస్ట్. మీ అందరికీ నా కథ ఆసక్తిగా అనిపిస్తే మరో సందర్భంలో పంచుకుంటాను. మీరో విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మీరు సంపూర్ణ ఆరోగ్యవంతులైనా సరే జాగ్రత్తగా ఉండండి. కరోనా చాలా రిస్క్‌తో కూడుకున్నదని గుర్తుంచుకోండి. పొరపాటున మీకు కరోనా వచ్చినా భయపడిపోవాల్సిన పన్లేదు. మనకు ఎంతోమంది నిపుణులైన వైద్యులు ఉన్నారు. వారు తగిన చికిత్స చేస్తారు. అంతర్జాతీయంగా చూస్తే... మన దగ్గర కరోనా పాజిటివ్ కేసులు తక్కువే. చాలావరకు నివారించవచ్చు. ఈ సంక్షోభ సమయంలో మీ ప్రార్థనలు, శుభాకాంక్షలు, సందేశాలు, ప్రేమలు నాకు కావాలి. నా గురించి తెలుసుకున్నందుకు ధన్యవాదాలు.

(అహ్మదాబాద్ మిర్రర్ సౌజన్యం - ఈ కథనం రాసిన వ్యక్తి తన వ్యక్తిగత వివరాలను వెల్లడించవద్దని కోరడం వల్ల ఆ సమాచారం గోప్యంగా ఉంచాం)



## ఫోన్ చేస్తే సాయమందిస్తాం

**కరోనా వ్యాప్తి నేపథ్యంలో సినిమా షూటింగులు నిలిచిపోయాయి. ఎక్కడివాళ్లు అక్కడే ఉండాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో రెక్కాడితే గాని డొక్కాడని కొన్ని కుటుంబాలకైనా అండగా నిలబడాలని నిర్ణయించుకున్నారు సినీనటులు జీవిత, రాజశేఖర్.**

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఈ నెలాఖరు వరకు షూటింగులు ఆపేయాలని నిర్ణయించింది కేంద్రం. రోజువారీ షూటింగ్‌లకు వెళ్తేగానీ పూటగడవని స్థితిలో ఉన్న కళాకారుల కోసం పది రోజులకు సరిపడా సరుకులు అందించాలనుకున్నారు రాజశేఖర్, జీవిత. షూటింగ్‌లు నిలిచిన కారణంగా పేద నటీనటులు 9010810140 నంబర్‌లో పూర్తి వివరాలు అందిస్తే రాజశేఖర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సరుకులు అందిస్తామని ప్రకటించారు.

## ఫ్రీగా చూడండి




కరోనా వైరస్ కారణంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించారు. దీంతో జనాలు ఇండ్లకే పరిమితమవుతున్నారు. ఇంట్లో ఉంటూ టీవీలు, సెల్‌ఫోన్‌లతో గడిపేస్తున్నారు. అయితే కొన్ని యాప్స్ ఎప్పటినుంచో సబ్‌స్క్రిప్షన్ చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నాయి. కరోనా నేపథ్యంలో ఓటీటీ (ఓవర్ ది టాప్) ప్లాట్‌ఫామ్ 'ఈరోస్ నౌ' దేశ ప్రజలకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. రాబోయే రెండు నెలలు వినియోగదారులు తమ ప్లాట్‌ఫామ్‌లో నచ్చిన వీడియోలను ఉచితంగా చూడవచ్చని తెలిపింది. ఈ నెలాఖరులోగా సబ్‌స్క్రైబ్ చేసుకున్నవాళ్లకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ టైంలో 'STAY FREE' అని కోడ్ ఉపయోగించాల్సి ఉంటుంది. ఇందులో హిందీ, పంజాబీ, తమిళ్, తెలుగు, మరాఠీ, మలయాళం, భోజ్‌పురి, గుజరాతీ, బెంగాలీ, కన్నడ భాషల్లో సినిమాలు, రియాలిటీ షోలను ఉచితంగా చూడొచ్చు.

## సంగీత యుద్ధం



కరోనా అన్ని దేశాలకంటే ఎక్కువగా ఇటలీని కుదిపేస్తున్నది. అక్కడి ప్రజలెవ్వరూ వీధుల్లోకి రావొద్దంటూ ప్రభుత్వం కఠిన నిబంధనలు పెట్టింది. ఈ ఆంక్షలతో ప్రజలంతా స్వీయ నిర్బంధంలో ఉంటూ సంగీతాన్ని సాధనంగా చేసుకుని కరోనాపై ఇంటి నుంచే యుద్ధం చేస్తున్నారు. 'కాంటో డెల్లా వెర్బానా' ఇది ఇటలీ సంప్రదాయ సంగీతం. దీన్ని ఆలపిస్తూ 'సియోనా నగరం వర్ధిల్లాలి' అని పాడుతూ నగర ప్రజలకు ధైర్యాన్ని చెబుతున్నారు. ప్రస్తుతం ఇటలీ వీధుల్లో ప్రతి ఇంటి నుంచి ఒకరు వయోలిన్, డ్రమ్స్, ఫిడేల్ వాయిస్తూ కనిపిస్తుంటారు. ఇటాలియన్ గాయకుడు ఆండ్రియా సాన్నియో తన పాటను ప్రజలు కిటికీల్లోంచి పాడుతుండగా వీడియో తీశారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## క్షయ ఉండగా బిడ్డను కనొచ్చా?

**నేడు వరల్డ్ టిబి డే**




**నాకు 36 ఏళ్లు. పెళ్లయి 3 సంవత్సరాలైంది. నా కెరీర్ దృష్ట్యా ఆలోచించి ప్రెగ్నెన్సీ వాయిదా వేసుకున్నాం. కాని ఇప్పుడు నాకు జెనిటల్ ట్రాక్ట్‌లో క్షయవ్యాధి ఉన్నట్టు బయటపడింది. దాంతో ఇప్పుడు నేను గర్భం దాలిస్తే పుట్టబోయే బిడ్డపై ఆ ప్రభావం పడుతుందంటున్నారు డాక్టర్లు. ఇక తల్లిని అవనేమో అని భయంగా ఉంది. ఇలాంటి పరిస్థితిలో ఐవీఎఫ్ టెక్నిక్ లాంటి వేమైనా నా బిడ్డపై ప్రభావం చూపకుండా నేను తల్లినయ్యేందుకు తోడ్పడుతాయా? నాకు సరైన సలహా ఇవ్వగలరు.**

**- సుమతి,** కరీంనగర్

మీకు క్షయవ్యాధి తొలిదశలోనే ఉన్నట్టయితే మందులతో పూర్తిగా నయం అవుతుంది. దాని ప్రభావం ఫర్టిలిటీ మీద పడదు. అయితే టిబి తీవ్రతను బట్టి దాని ప్రభావం ఫర్టిలిటీ మీద ప్రత్యక్షంగా ఉండొచ్చు. ఎండోమెట్రియమ్ పొర, ఫెలోపియన్ ట్యూబులపైన దీని ప్రభావం ఉండొచ్చు. దానివల్ల సహజంగా గర్భం దాల్చి, ప్రసవించడానికి సమస్య కావొచ్చు. టిబి వల్ల సాధారణంగా సంతాన సామర్థ్యంపై ప్రభావం ఉండదు గానీ జెనిటల్ టిబి మాత్రం 50 శాతం మహిళల్లో సంతాన సామర్థ్యాన్ని తగ్గిస్తున్నది.
దీనికి మందులున్నప్పటికీ సహజంగా గర్భం రావడానికి అవకాశాలు తక్కువనే చెప్పాలి. 90 శాతం కేసుల్లో జెనిటల్ టిబి చికిత్స తరువాత అసిస్టెడ్ రిప్రోడక్టివ్ టెక్నిక్స్ పైనే ఆధారపడుతారు. ఐవీఎఫ్, ఐసిఎస్ఐ, ఐయుఐ లాంటివి ఇందుకు తోడ్పడుతాయి.
సాధారణంగా జెనిటల్ టిబి మొదటి దశలో లక్షణాలేమీ కనిపించవు. అందువల్ల దీన్ని తొందరగా గుర్తించడం కష్టమవుతున్నది. జననేంద్రియాల దగ్గర క్షయ వచ్చినప్పుడు సాధారణంగా నెలసరి సమస్యలు, తీవ్రమైన కడుపు నొప్పి (ముఖ్యంగా పొత్తికడుపు నొప్పి), ఇన్‌ఫర్టిలిటీ, ఇన్‌ఫ్లమేషన్, లైంగిక కలయికలో నొప్పి, రక్తస్రావం వంటి లక్షణాలుంటాయి. తల్లి నుంచి పుట్టిన బిడ్డకు జెనిటల్ టిబి రావడం చాలా అరుదు. చికిత్స తీసుకోకపోతే మాత్రం పుట్టిన బిడ్డకు ట్రాన్స్‌మిట్ అయ్యేందుకు ఆస్కారం ఉంది. మీరు వెంటనే జెనిటల్ టిబికి ట్రీట్‌మెంట్ రెగ్యులర్‌గా తీసుకోండి. సహజ గర్భం కోసం కాకుండా ఐవీఎఫ్ లాంటి అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నిక్ ద్వారా సంతానాన్ని పొందే ప్రయత్నం చేయడం మంచిది.



**డాక్టర్ నవీనా సింగ్**
గైనకాలజిస్ట్,
ఐవీఎఫ్ నిపుణురాలు
ఇందిరా ఐవీఎఫ్ హాస్పిటల్
హైదరాబాద్


## 'దుర్గ ఇండియా'



**తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోవడానికి కొద్దిమంది మహిళలు మాత్రమే బయటకు వస్తున్నారు. ఎంతోమంది లోలోపలే కుమిలిపోతుంటారు. అటువంటి వారికి అవగాహన కల్పించేందుకు ఓ మహిళ శ్రీకారం చుట్టింది.**

చాలామంది మహిళలు లైంగిక వేధింపుల గురించీ వివక్ష గురించీ ఎవరితోనూ తమ భావాల్ని పంచుకోలేకపోతున్నారు. ఈ విషయాన్ని బెంగళూరుకు చెందిన ప్రియా వరదరాజన్ గ్రహించింది. అటువంటి వారిని చైతన్య పరిచి , బాధితులకు అండగా నిలవాలనుకున్నది. అందుకోసం ఢిల్లీలో నిర్భయ సంఘటన జరిగిన మరుసటి రోజునే... 'దుర్గ ఇండియా' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది. దీని ద్వారా మహిళల హక్కులూ, విధులపై అవగాహన కల్పించేందుకు 'బీ టుగెదర్ బెంగళూర్' అనే వినూత్న ప్రచారాన్ని చేపట్టింది. రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే జంకే ప్రాంతాలను ఎంపిక చేసి, వారిలో భయాన్ని పోగొట్టే ప్రయత్నం చేస్తున్నది. అందుకోసం ప్రియ ఆయా ప్రదేశాల్లో రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నది. ప్రియా వరదరాజన్ చేస్తున్న ప్రచారానికి తన వంతు సాయం అందించేందుకు విశ్రాంత పోలీసు అధికారిణి ఇషాపంత్ ముందుకు వచ్చింది. వీరిద్దరూ ఆపదలో ఉన్న అబలలను ఆదుకొనేందుకు ఓ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులోభాగంగా చిరు వ్యాపారులకు ఆత్మరక్షణలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.

## భవిక...సొంత సబ్బులు



మార్కెట్‌లో కెమికల్ సబ్బులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రత్యామ్నాయంగా చాలామంది ఆర్గానిక్ సోప్‌లను వాడటం మొదలు పెట్టారు. కానీ వీటి ధర ఎక్కువ. దీంతో చెన్నయ్‌కి చెందిన 23 ఏండ్ల భవిక తానే ఆర్గానిక్ సబ్బులను తయారు చేసుకోవాలనుకున్నది. రెండేండ్ల క్రితం కొంత అధ్యయనం చేసి కొన్ని సబ్బులు తయారు చేసింది. వాటి ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టింది. ఫ్రెండ్స్ నుంచి ఆర్డర్లు వచ్చాయి. దీంతో 'షాప్ సోప్' పేరుతో మరిన్ని సబ్బులు తయారు చేసి, చిన్న వ్యాపారం ప్రారంభించింది. కలబంద, అరటిపండు, నారింజ, నిమ్మ, పొప్పడి, స్ట్రాబెరీతో పాటు పదిహేను రకాల ఫ్లేవర్లతో ఈ సబ్బులను తయారుచేస్తున్నది. ప్రస్తుతం భవిక మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చదువుతున్నది. తన చదువులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ వ్యాపారం చేస్తున్నది. మార్కెట్‌లో ని ఆర్గానిక్ సబ్బుల ధరలకంటే తక్కువ ధరలో భవిక సబ్బులను అందిస్తున్నది. the_soap.shop భవిక ఇన్‌స్టాగ్రామ్ ఐడీ.



# ముందే వేతనాలు చెల్లించా


ప్రకాష్‌రాజ్

కరోనా వైరస్ వ్యాప్తితో ఇబ్బందులు పడుతున్న తన వద్ద పనిచేసే ఉద్యోగులకు మే నెలవరకు జీతాలను ముందుగానే చెల్లించినట్లుగా నటుడు ప్రకాష్‌రాజ్ ట్విట్టర్ ద్వారా తెలిపారు. ‘జనతా కర్ఫ్యూతో నా నగదు నిల్వను ఒకసారి చూసుకున్నాను. నా ఇంట్లో, ఫార్మ్ హౌస్, ఫిల్మ్ ప్రొడక్షన్‌లో ఉద్యోగం చేసే వారితో పాటు వ్యక్తిగత సిబ్బందికి మే నెలవరకు వేతనాల్ని చెల్లించాను. నేను నిర్మిస్తున్న మూడు చిత్రాలకు సంబంధించి దినసరి వేతనం తీసుకునే కార్మికుల గురించి ఆలోచించాను. కరోనా మహమ్మారి కారణంగా సామాజిక దూరం పాటించడటంతో షూటింగ్లు నిలిచిపోయాయి. దినసరి వేతన కార్మికులకు సగం జీతం ఇవ్వాలని నిర్ణయించాను. ఇక్కడితో పూర్తి కాదు. నా శక్తి మేరకు చేస్తాను. మీ అందరికి నేను చేసే విన్నపం ఒక్కటే. మీ సహాయం అవసరమైన వారిని ఆదుకోండి. ఒకరి జీవనాన్ని, జీవితాన్ని నిలిపే సమయం ఇది’ అని ప్రకాష్‌రాజ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# నాగరత్తమ్మ పాత్రలో

మహిళా ప్రధాన చిత్రాల్లో నటించడం అనుష్కకు కొత్తేమి కాదు. ‘అరుంధతి’ ‘రుద్రమదేవి’ ‘భాగమతి’ వంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో చక్కటి అభినయంతో మెప్పించింది. తాజా సమాచారం ప్రకారం అనుష్క మరో మహిళా ప్రధాన ఇతివృత్తంలో నటించబోతున్నదని సమాచారం. వివరాల్లోకి వెళితే.. ప్రముఖ కర్ణాటక గాయని, మహిళా హక్కుల ఉద్యమ కారిణి బెంగళూరు నాగరత్తమ్మ జీవిత కథా చిత్రంలో అనుష్క నటించబోతున్నట్లు తెలిసింది. ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు డైరెక్ట్ చేయబోతున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ తెరకెక్కించే ఈ సినిమా కోసం అనుష్కతో పాటు సమంత పేరును కూడా పరిశీలిస్తున్నారని చెబుతున్నారు. పాన్‌ఇండియాగా రూపొందించే సన్నాహాల్లో భాగంగా బాలీవుడ్ అగ్రనాయిక దీపికాపదుకొనే పేరు కూడా తెరపైకి వచ్చినట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల కోసం అధికార ప్రకటన వచ్చే వరకు వేచిచూడాల్సిందే అంటున్నారు. ప్రస్తుతం అనుష్క కథానాయికగా నటించిన ‘నిశ్శబ్దం’ చిత్రం త్వరలో విడుదల కాబోతుంది.



అనుష్క


నితిన్

## పది లక్షల విరాళం

కరోనా కట్టడికి తెలుగు రాష్ట్రాలు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నాయని, ప్రభుత్వాలకు ప్రజలందరూ సహకరించాలని హీరో నితిన్ కోరారు. అందరూ ఇళ్లల్లోనే ఉండి కోవిడ్-19 వ్యాప్తిని నిరోధించడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి తన వంతుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధులకు తలా పది లక్షల విరాళాన్ని ప్రకటించారు. అలాగే తమిళ హీరోలు సూర్య, కార్తి ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ సౌత్ సంఘానికి పది లక్షల విరాళాన్ని ప్రకటించారు.

## భరోసా ఇవ్వండి



మన ఆరోగ్యం మన చుట్టుపక్కల ఉండేవారితో ముడిపడిఉంటుంది. పనివాళ్లను, డ్రైవర్లను, వ్యక్తిగత సహాయ సిబ్బందిని ఇంట్లోనే ఉండమని చెప్పండి. బయటతిరగడం మానేయమని చెప్పండి. కంగారు పడాల్సిన అవసరం లేదు. జీతం మొత్తం ఇస్తామనే భరోసా ఇవ్వండి

- సుధీర్‌బాబు



మీలో జలుబు లక్షణాలు ఉంటే అందరికి దూరంగా ఉండండి. శుభ్రతను పాటించండి. సొంత వైద్యాన్ని పక్కనపెట్టి తెలిసిన డాక్టర్, ఆసుపత్రిని సంప్రదించండి. 130 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో అత్యవసరంగా పరీక్షలు జరపడానికి లక్షయాభై వేల టెస్ట్ కిట్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కంగారుపడకండి. అవసరమైతేనే పరీక్షలు చేసుకోండి. టెస్ట్ కిట్‌ను సేవ్ చేస్తే ఓ ప్రాణాన్ని కాపాడినట్లే.


- నిఖిల్


కాజల్ అగర్వాల్

అందరూ సామాజిక దూరాన్ని పాటిస్తున్నారని నమ్ముతున్నాను. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలి. డయాబెటిస్, బీపీ, గుండెజబ్బులు, శ్వాససమస్యలతో బాధపడే వారు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండాలి

- కాజల్ అగర్వాల్

# కత్తి రాసే రుధిర కావ్యం



తనీష్

తనీష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ‘మహాప్రస్థానం’. ‘ది జర్నీ ఆఫ్ ఎన్ ఎమోషనల్ కిల్లర్’ ఉపశీర్షిక. జాని దర్శకత్వం వహిస్తున్నారు. ఓంకారేశ్వర క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్నది. ముస్కాన్‌సేథీ కథానాయిక. మోషన్ పోస్టర్‌ను చిత్రబృందం ఇటీవల విడుదలచేసింది. ఇందులో కత్తితో శత్రువుల్ని సంహరిస్తూ తనీష్ కనిపిస్తున్నారు. ‘గుండె కన్నీరైతే ఆవేశం ఆయుధమైతే ఆ కత్తి రాసే రుధిర కావ్యమే ఈ మహాప్రస్థానం’ అంటూ మోషన్ పోస్టర్‌లోని వాయిస్ ఓవర్ ఆసక్తిని పంచుతున్నది. దర్శకుడు మాట్లాడుతూ ‘కిల్లర్ జీవితగమనంలో ఎదురయ్యే సంఘటనల సమాహారమే ఈ చిత్ర ఇతివృత్తం. నటుడిగా తనీష్‌ను కొత్త కోణంలో ఆవిష్కరిస్తుంది. అసాధారణ కథాంశంతో రూపొందిస్తున్నాం. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం రీరికార్డింగ్ కార్యక్రమాల్ని జరుపుతున్నాం. సెన్సార్‌ను పూర్తి చేసి వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం’ అని తెలిపారు. భానుశ్రీమెహ్రా, కబీర్ దుహాన్‌సింగ్, రాజా రవీంద్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, సినిమాటోగ్రఫీ: ఎం.ఎస్. బాల్‌రెడ్డి.

# వారికోసం హైడ్రాక్సీక్లోరోక్వీన్

**న్యూఢిల్లీ, మార్చి 23:** కరోనా వైరస్ బాధితులకు, అనుమానితులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది, కరోనా బాధితుల కుటుంబ సభ్యులు ముందస్తు రక్షణ కోసం ‘హైడ్రాక్సీక్లోరోక్వీన్’ ఔషధం తీసుకునేందుకు ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ బలరామ భార్గవ అనుమతిచ్చారు. కరోనా పరీక్షలు చేసేందుకు దేశవ్యాప్తంగా 12 ప్రైవేట్ ల్యాబ్‌లు ముందుకొచ్చాయని, వారికి అనుమతులు మంజూరుచేశామన్నారు. ఈ ల్యాబ్‌లకు దేశవ్యాప్తంగా 15వేల కలెక్షన్ సెంటర్లు ఉన్నాయని వెల్లడించారు. మరోవైపు అత్యవసర సమయాల్లో ఏ విధమైన చికిత్స అందించాలో వివరించేలా నేషనల్ టాస్క్ ఫోర్స్ రూపొందించిన ప్రొటోకాల్‌ను డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీజీసీఐ) ఆమోదించింది.

## ● లాక్‌డౌన్‌ను ధిక్కరిస్తే విపత్తే..



**దేశవ్యాప్తంగా ప్రజలు లాక్‌డౌన్‌ను ధిక్కరిస్తూ రోడ్లపైకి వస్తున్నారు. అయితే ఇది అత్యంత ప్రమాదకరమని నిపుణులు చెప్తున్నారు. కరోనా సోకిన ఒక వ్యక్తి వారం రోజుల్లో 3,500 మందికి వైరస్‌ను అంటించే ప్రమాదం ఉన్నది. ఈ 3,500 మంది కూడా ఇదే క్రమంలో అంటిస్తే.. తక్కువ కాలంలోనే కేసుల సంఖ్య కోట్లకు చేరుకుంటుందని హెచ్చరిస్తున్నారు.**

# ఈ లక్షణం ఉంటే.. కరోనా సోకినట్టే?

**పారిస్:** కరోనా సోకిన వారికి జలుబు, దగ్గుతోపాటు ఇతర లక్షణాలు కూడా ఉన్నట్లు తమ పరిశోధనలో గుర్తించినట్లు ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఎవరైనా ఉన్నట్టుండి వాసన గుర్తించే స్వభావాన్ని కోల్పోయినట్టయితే కరోనా సోకినట్లు అనుమానించవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా యువతలో ఈ లక్షణం కనిపిస్తున్నదని ఫ్రెంచ్ శాస్త్రవేత్తలతోపాటు బ్రిటన్ వైద్యులు పేర్కొన్నారు. కరోనా సోకిన వారిలో కొంతమంది రుచి స్వభావాన్నీ కోల్పోయినట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో వాసన, రుచి కోల్పోయిన లక్షణాలను కరోనా వ్యాధి లక్షణాల జాబితాలో చేర్చారని యూకేలోని ఈఎన్‌టీ నిపుణులు ఆ దేశ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఒక్క లక్షణాన్ని నిర్ధారించడం వల్ల కరోనా సోకిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు.

# జీతాలు తగ్గించొద్దు.. ఉద్యోగం తొలిగించొద్దు

**న్యూఢిల్లీ:** కరోనా నేపథ్యంలో ఉద్యోగుల జీతాలు తగ్గించవద్దని, ఉద్యోగులను తొలిగించవద్దని ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఇలాంటి చర్యల వల్ల ప్రస్తుత సంక్షోభం మరింత తీవ్రమవుతుందని తెలిపింది. ఉద్యోగి సెలవు తీసుకుంటే, విధుల్లో ఉన్నట్లుగానే పరిగణించాలని పేర్కొంది.

**మూడు నెలల రేషన్ తీసుకోవచ్చు**

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద సరఫరా చేసే ఆహార ధాన్యాలను మూడు నెలలకు సరిపడా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రుణ పరపతిపై ఎఫ్‌సీఐ నుంచి తీసుకోవచ్చు. కరోనా నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు కరోనా వైరస్ నియంత్రణకు కార్పొరేట్ సంస్థలు చేసే వ్యయాన్ని వాటి ‘కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)’ కింద పరిగణిస్తామని కేంద్రం సోమవారం తెలిపింది. ఈ మేరకు కార్పొరేట్ వ్యవహారాలశాఖ సర్క్యులర్ జారీ చేసింది.

# పార్లమెంటుపై కరోనా ప్రభావం

- ఉభయసభలు నిరవధిక వాయిదా
- లోక్‌సభలో ఆర్థిక బిల్లుకు ఆమోదం
- బిల్లుకు 40 సవరణల్ని చేసిన ప్రభుత్వం


వైద్యులు, పారిశుద్ధ్య సిబ్బందికి సంఘీభావ సూచకంగా లోక్‌సభలో చప్పట్లు కొడుతున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ ప్రభావం పార్లమెంటు సమావేశాలపైనా పడింది. దేశంలో వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. షెడ్యూల్ కంటే రెండు వారాలు ముందే లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అయితే, వాయిదాకు ముందు ఆర్థిక బిల్లు-2020ను లోక్‌సభ ఆమోదించింది. మరోవైపు, రాజ్యసభనూ నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ వెంకయ్యనాయుడు ప్రకటించారు.

2020-21 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వానికి ఆర్థిక ప్రతిపాదనలు పంపే ఉద్దేశంతో రూపొందించిన ఆర్థిక బిల్లు-2020కి లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. దేశంలో కరోనా ప్రభావం ఉండటంతో ఈ బిల్లుపై ఎలాంటి చర్చలు జరుపకూడదని అన్ని పార్టీలతో నిర్వహించిన సమావేశంలో నిర్ణయించామని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. దీంతోపాటు సమావేశాల్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఈ బిల్లుకి కేంద్రం 40కి పైగా సవరణల్ని ప్రతిపాదించిందని స్పీకర్ తెలిపారు. అయితే, ప్రతిపక్షాలు ప్రతిపాదించిన కొన్ని సవరణల్ని తోసిపుచ్చినట్టు పేర్కొన్నారు. మరోవైపు, హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్ రెడ్డి మరో రెండు బిల్లుల్ని సభలో ప్రవేశపెట్టారు. వీటిలో ఒకటి రాష్ట్రీయ రక్ష యూనివర్సిటీ బిల్లు కాగా మరొకటి నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ బిల్లు. అయితే, ఈ బిల్లుల నకళ్లను(కాపీలను) తమకు ఇవ్వలేదని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు నిరసనకు దిగాయి.

సోమవారం మధ్యాహ్నం రెండింటికి లోక్‌సభ మొదలైంది. ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 17 మంది భద్రతా సిబ్బందికి సభ్యులు నివాళులు అర్పించారు. అలాగే సోమవారం అమరవీరుల రోజు కావడంతో స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాల్ని సభ గుర్తు చేసుకున్నది. మరోవైపు, కరోనా ఉద్ధృతి నేపథ్యంలో రాజ్యసభను కూడా నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ ఎం వెంకయ్యనాయుడు సోమవారం ప్రకటించారు. అన్ని పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

**కేంద్రానికి ఎక్సైజ్ సుంకాన్ని పెంచే అధికారాలు**

భవిష్యత్తులో లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.8 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెంచేందుకు వీలు కల్పించే అధికారాల్ని కేంద్రం చేజిక్కించుకున్నది. దీని కోసం ఆర్థిక బిల్లు, 2020కు సవరణలు చేసింది. దీంతో లీటరు పెట్రోల్‌పై రూ.18, లీటరు డీజిల్‌పై రూ.12 ప్రత్యేక ఎక్సైజ్ సుంకాన్ని పెంచేందుకు కేంద్రానికి వెసులుబాటు కలిగింది. ఇప్పటి వరకూ లీటరు పెట్రోల్‌పై రూ.10, లీటరు డీజిల్‌పై రూ.4 ప్రత్యేక ఎక్సైజ్ సుంకం పరిమితిగా ఉన్నది.

**జనతా కర్ఫ్యూకి సంఘీభావం**

కరోనాను అడ్డుకోవడంలో భాగంగా ఆదివారం నిర్వహించిన జనతా కర్ఫ్యూలో పేద, ధనిక అని తేడా లేకుండా దేశ ప్రజలందరూ పాల్గొనడంపై లోక్‌సభ హర్షం వ్యక్తం చేసింది. స్పీకర్ ఓంబిర్లా జనతా కర్ఫ్యూను ప్రస్తావించగానే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాతో పాటు సభలోని వారందరూ నిల్చొని ప్రజలకు, వైద్యులకు చప్పట్లు కొడుతూ కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా కృతజ్ఞతలు, అభినందనలు చెప్పేందుకు సభలోని సభ్యులు చేతులతో బల్లల్ని చరుస్తారు. నిల్చొని చప్పట్లు కొడుతూ సంఘీభావం తెలుపడం అరుదు.

# చైనా జాప్యం కొంపముంచింది!

- కరోనాపై చాలాకాలం పాటు వివరాలను వెల్లడించలేదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపణ



**వాషింగ్టన్:** ప్రాణాంతక కరోనా వైరస్ గురించి సమాచారాన్ని పంచుకోవడంలో చైనా ఆలస్యం చేయడం తనను కొంత ఆవేదనకు గురి చేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ వైరస్ నియంత్రణ కోసం తాము పంపించిన వైద్య నిపుణుల బృందాన్ని అనుమతించకపోవడం చైనా అహంకారానికి నిదర్శనమని ఆరోపించారు. ఆదివారం ఆయన వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. కరోనా వైరస్ విషయమై చైనా అత్యంత రహస్యంగా వ్యవహరించడం దురదృష్టకరం అని పేర్కొన్నారు. అయితే, చైనాతో తమ ద్వైపాక్షిక సంబంధాలు చాలా మంచిగా ఉన్నాయన్నారు. చైనా త్వరితగతిన వైరస్ గురించి చెప్పి ఉంటే, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ప్రాణాలను కాపాడగలిగి ఉండేవారమన్నారు. ఇప్పటి వరకు అమెరికాలో కరోనా వల్ల 390 మంది మరణించగా, 31,057 వైరస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. న్యూయార్క్ రాష్ట్రం కరోనా వైరస్‌కు కేంద్రంగా మారింది. దేశంలోని కరోనా వైరస మృతుల్లో సగం మంది ఈ రాష్ట్రానికి చెందిన వారే.

**ట్రంప్ ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీకి సెనేట్‌లో చుక్కెదురు**

కరోనా నేపథ్యంలో సంక్షోభంలో కూరుకుపోయిన అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చేందుకు డొనాల్డ్ ట్రంప్ సర్కారు ప్రతిపాదించిన ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీకి సెనేట్‌లో చుక్కెదురైంది. డెమోక్రాట్ల నుంచి దీనికి మద్దతు లభించలేదు. అలాగే అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన ఐదుగురు సభ్యులు క్వారంటైన్‌లో ఉండడం వల్ల ఓటింగ్‌లో పాల్గొనలేదు. ప్రస్తుత సంక్షోభం సమయంలో లక్షలాది మంది ప్రజలను రక్షించడంలో, వైద్యారోగ్య వ్యవస్థను మెరుగుపరచడంలో రిపబ్లికన్ల ప్రణాళిక విఫలమైందని డెమొక్రాట్లు విమర్శించారు.

# మధ్యప్రదేశ్ సీఎంగా శివరాజ్ ప్రమాణం

**భోపాల్, మార్చి 23:** మధ్యప్రదేశ్‌లో సీఎంగా బీజేపీ సీనియర్ నేత శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ఆ రాష్ట్ర గవర్నర్ లాల్జీ టాండన్ సోమవారం ప్రమాణం చేయించారు. ఆయన ఒక్కరే ప్రమాణం చేశారు. రాష్ట్ర సీఎంగా చౌహాన్ ప్రమాణం చేయడం ఇది నాలుగోసారి. అంతకు ముందు బీజేపీఎల్పీ నేతగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఎన్నుకున్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో ప్రమాణ స్వీకారానికి హాజరైన బీజేపీ ఎమ్మెల్యేలు ముఖాలకు మాస్కులు ధరించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో కమల్‌నాథ్ సర్కార్ మైనారిటీలో పడిపోయింది. దీంతో కమల్‌నాథ్ తన పదవికి రాజీనామా చేశారు.

# అయోధ్యలో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

**ఉత్తర్‌ప్రదేశ్, మార్చి 23:** అయోధ్య రామాలయం నిర్మాణంలో తొలి అడుగు పడింది. కరోనా నేపథ్యంలో పరిమితుల మధ్య రామాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆలయంలోని విగ్రహాలను తాత్కాలిక షెడ్డుకు తరలించడంలో భాగంగా సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు బిమ్లేంద్ర మిశ్రా, డాక్టర్ అనిల్ మిత్రా నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. ప్రత్యేక ప్రార్థనలు మంగళవారం కూడా కొనసాగించి బుధవారం విగ్రహాలను తాత్కాలిక షెడ్డుకు తరలింపు ప్రక్రియను పూర్తిచేస్తారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యేంత వరకు విగ్రహాలను తాత్కాలిక షెడ్డులోనే ఉంచి పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ‘కరోనా వైరస్ ముప్పు కారణంగా అయోధ్య నుంచి సాధువులను ప్రత్యేక ప్రార్థనలకు ఆహ్వానించలేదు. మంగళవారం వరకు పరిస్థితులను గమనించి అనంతరం భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తాం. జైపూర్‌కు చెందిన హస్తకళాకారులు తయారుచేసి తెచ్చిన 9.5 కిలోల వెండి సింహాసనంపై విగ్రహాలను బుధవారం పెడతాం’ అని రామాలయం ట్రస్ట్ కార్యదర్శి చాపత్‌రాయ్ చెప్పారు.

# సకాలంలో పెన్షన్ల జమకు చర్యలు తీసుకోండి

### ఫీల్డ్ ఆఫీసులకు ఈపీఎఫ్ఓ మార్గదర్శకాలు

**న్యూఢిల్లీ:** కరోనా నేపథ్యంలో ‘ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్) కింద పెన్షనర్ల ఖాతాల్లో సకాలంలో పెన్షన్ జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ ఆఫీసులను ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆదేశించింది. ఈ మేరకు సోమవారం మార్గదర్శకాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా 65 లక్షల మందికి పైగా పెన్షనర్లు ఈపీఎస్ కింద పెన్షన్ పొందుతున్నారు. ‘కరోనా వల్ల దేశంలోని పలు ప్రాంతాల్లో లాక్‌డౌన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో పెన్షనర్లకు ఎటువంటి అసౌకర్యం కలుగనివ్వవద్దని దేశంలోని 120 ఈపీఎఫ్ఓ ఫీల్డ్ కార్యాలయాలను సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ (సీపీఎఫ్‌సీ) ఆదేశించారు.

# లాక్‌డౌన్‌లో.. పరార్‌కు ఖైదీల యత్నం

### కాల్పుల్లో 23 మంది మృతి..

**బొగటా:** కొలంబియా రాజధాని బొగటాలోని ఓ జైలు నుంచి రాత్రివేళ ఖైదీలు తప్పించుకొనేందుకు అల్లర్లు సృష్టించారు. వారిని అడ్డుకొనే క్రమంలో భద్రతాసిబ్బంది జరిపిన కాల్పుల్లో 23 మంది మరణించారు. మరో 90 మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని న్యాయశాఖ మంత్రి మార్గరీట కబెల్లో వెల్లడించారు. కరోనా నేపథ్యంలో బొగటా నగరం లాక్‌డౌన్‌లో ఉన్నందున.. శనివారం రాత్రి లా మోడెలో జైలు నుంచి సామూహికంగా తప్పించుకోవడానికి ఖైదీలు ప్రయత్నించడంతో అల్లర్లు చెలరేగాయి. ఈ క్రమంలో జరిపిన కాల్పుల్లో 23 మంది ఖైదీలు మరణించారు. 83 మంది ఖైదీలు, ఏడుగురు గార్డులు గాయపడ్డారు.

# మిజోరంలో మాస్ క్వారంటైన్


**ఐజ్వాల్:** కరోనా వైరస్‌ను కట్టడిచేసేందుకు మిజోరం ప్రభుత్వం కఠిన చర్యలకు పూనుకొన్నది. ఇంతవరకు ఎలాంటి అనుమానిత కేసులు బయటపడనప్పటికీ.. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రజలు తిరిగి తమ సొంతూర్లకు వస్తుండటంతో ప్రభుత్వం ఈ చర్యలను ప్రారంభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు మిజోరం రావడం వల్ల వైరస్ విజృంభించే అవకాశాలున్నందున మాస్ క్వారంటైన్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. కరోనా ప్రభావిత ప్రాంతాల నుంచి లెంగ్పుయ్ విమానాశ్రయానికి వచ్చేవారికి పరీక్షలు జరిపిన తర్వాత అనుమానితులను క్వారంటైన్ కేంద్రాలకు పంపుతామని మిజోరాం సీఎస్ తెలిపారు. కాగా, మిజోరాంలో లాక్‌డౌన్ మూడోరోజుకు చేరుకొన్నది. ఇది 29 వరకు కొనసాగనున్నది.

## గంటలు గంటలు కూర్చుని పనిచేస్తున్నారా..?
## లేక రోజంతా నిల్చునే ఉంటున్నారా..?

ఏ పనైనా అతిగా చేస్తే ఏదో ఒక సమస్య వచ్చి పడుతుంది. ఎక్కువ సేపు కూర్చుంటే కొవ్వు పేరుకుపోయి స్థూలకాయం, డయాబెటిస్ లాంటి సమస్యలే కాదు.. రక్తనాళ సమస్యలు కూడా వస్తాయి. ఎక్కువ సేపు నిల్చున్నా ఇలాంటి సమస్యలు తప్పవంటున్నారు వైద్య నిపుణులు. ఉదయం స్కూల్ మొదలైనప్పటి నుంచి చివరి పీరియడ్ అయిపోయేవరకు దాదాపుగా నిల్చునే ఉంటారు టీచర్లు.. ట్రాఫిక్‌ని నియంత్రించే క్రమంలో అసలు కూర్చునే అవకాశమే ఉండదు ట్రాఫిక్ పోలీసులకి... మరోవైపు అసలు నిల్చోవడానికీ, నడవడానికీ అవకాశమే లేకుండా రోజంతా కూర్చునే పనిచేస్తుంటారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీళ్లు చేసే పనులు వేరైనా వాళ్లకు వచ్చే జబ్బులు మాత్రం ఒకటే.

**అవే.. రక్తనాళ సమస్యలు!**

# రక్తనాళాలకు కష్టమొస్తే..



## కూర్చున్నా.. నిల్చున్నా.. సమస్యే!

**రక్తం..** ఊపిరి ద్వారా ఆక్సిజన్ అందాలన్నా.., శరీరానికి శక్తి రావాలన్నా.., అవయవాలను పనిచేయించే హార్మోన్లు వాటిని చేరుకోవాలన్నా.., రోగ నిరోధక శక్తి ఉండాలన్నా.. కావలసిన అత్యంత ముఖ్యమైన కణజాలం. ఈ రక్తాన్ని శరీర భాగాల నుంచి గుండె, ఊపిరితిత్తులకు.., ఊపిరితిత్తుల నుంచి గుండె, ఇతర శరీర అవయవాలకు నిరంతరం ప్రసరింపచేసేవి రక్తనాళాలు. ఒక్కమాటలో చెప్పాలంటే శరీరంలోని అవయవాలన్నింటికీ రక్తాన్ని చేరవేసే అనుసంధానకర్తలు రక్తనాళాలు. కాని మన అలవాట్ల వల్ల ఇవి దెబ్బతింటున్నాయి. శోషరస వ్యవస్థలోని నాళాలు, గ్రంథులు కూడా సమస్యలకు లోనవ్వొచ్చు.

### ప్రమాదంలో గాయపడితే..

రోడ్డు ప్రమాదాల్లో గాయపడినప్పుడు మోకాలిలో ఫ్రాక్చర్లు అయ్యే అవకాశం ఉంటుంది. రక్తనాళాలకు గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలాంటప్పుడు ప్రాణాపాయం ఉంటుంది. పేషెంటును కాపాడడానికి వాస్కులర్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తారు. అంటే గాయపడిన రక్తనాళాన్ని తీసేసి, దాని స్థానంలో మరో రక్తనాళాన్ని అమరుస్తారు. ఈ కొత్త రక్తనాళాన్ని చర్మం



కింద ఉపరితల భాగాల్లో ఉండే సిరల నుంచి తీసుకుంటారు. ఈ సిరను తీసుకెళ్లి ధమని స్థానంలో అమరుస్తారన్నమాట. ఈ చికిత్స వల్ల కాలు, చేయి తొలగించాల్సిన పరిస్థితిని నివారించవచ్చు. ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు.

కిడ్నీ ఫెయిల్యూర్ పేషెంట్లలో రెగ్యులర్‌గా డయాలసిస్ చేయాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు అవసరమయ్యే ఎవి ఫిస్టులాలు, పర్మనెంట్ కెథటర్లను అమర్చడంలో కూడా వాస్కులర్ సర్జన్లు కీలక పాత్ర పోషిస్తారు.

### క్యాన్సర్ పేషెంట్లలో...

శరీరంలోని శోషరస వ్యవస్థలో సమస్యలనే లింఫాటిక్ సమస్యలంటారు. సాధారణంగా లింఫ్ ఎడిమా సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఇది ప్రైమరీ లింఫ్ ఎడిమా, సెకండరీ లింఫ్ ఎడిమా అని రెండు రకాలుగా ఉంటుంది. పుట్టుకతోనే జన్యుపరమైన కారణాల వల్ల వచ్చేది ప్రైమరీ లింఫ్ ఎడిమా. వీళ్లకు పుట్టుకతో శోషరస నాళం అభివృద్ధి చెందకపోవడమో (అప్లేషియా), లేక చిన్నగా ఉండడమో (హైపోప్లేషియా) జరుగుతుంది. దీనివల్ల



లింఫాటిక్ ఎడిమా కనిపిస్తుంది. సెకండరీ లింఫ్ ఎడిమాకు మరేదైనా సమస్య కారణమవుతుంది. అంటే ఫైలేరియా ఇన్‌ఫెక్షన్, క్యాన్సర్ పేషెంట్లకు ఇచ్చే చికిత్స, సర్జరీ తరువాత ఈ సమస్య కనిపించవచ్చు. ఉదాహరణకు రొమ్ము క్యాన్సర్ ఉన్నవాళ్లకు సర్జరీ తరువాత, రేడియోథెరపీ అయినాక చేతిలో లింఫ్ ఎడిమా కనిపించొచ్చు. లింఫ్ గ్రంథులు వాచిపోవడం వల్ల చేయంతా వాపు కనిపిస్తుంది. సర్వికల్ క్యాన్సర్, గర్భసంచి క్యాన్సర్ లాంటి పెల్విక్ క్యాన్సర్ల చికిత్స తరువాత కాలిలో లింఫ్ ఎడిమా కనిపిస్తుంది. వీళ్లలో కాలు వాపు ఉంటుంది.

లింఫ్ ఎడిమా సమస్య ఉన్నప్పుడు ముందుగా మందులు ఇస్తారు. మందులే కాకుండా కంప్రెషన్ బ్యాండేజ్ థెరపీ ద్వారా కూడా చికిత్స చేస్తారు. లింఫ్ ఎడిమా పంపు కూడా ఇప్పుడు మంచి ఫలితాలను ఇస్తున్నది.

**సమస్యలివీ..**

రక్తనాళ సంబంధ సమస్యలు రెండు రకాలు. ధమనుల్లో వచ్చే సమస్యలు, సిరల్లో వచ్చే సమస్యలు. ధమనుల్లో సమస్యలు వృద్ధులైనవాళ్లు, డయాబెటిస్ ఉన్నవాళ్లలో ఎక్కువగా కనిపిస్తాయి. మధుమేహ వ్యాధిగ్రస్థుల్లో కనిపించే డయాబెటిక్ ఫూట్ లేదా గ్యాంగ్రిన్ సమస్య ఈ కోవలోదే. పెరిఫెరల్ రక్తనాళాల్లో (చర్మం కింద ఉపరితల రక్తనాళాల్లో) వచ్చే వెరికోస్ వీన్స్, కాలు లోపల లోతుగా ఉండే రక్తనాళాల్లో కనిపించే డీప్ వీన్ థ్రాంబోసిస్ సమస్యలు సిరల్లో కనిపించే వ్యాధులు

## డయాబెటిక్ ఫూట్

డయాబెటిస్ ఉన్నవాళ్లలో డయాబెటిక్ ఫూట్ వచ్చి అది గ్యాంగ్రిన్‌గా మారుతుంది. డయాబెటిస్ అదుపు తప్పినప్పుడు, దీంతో పాటు రక్త ప్రసరణ కూడా తగ్గిపోయి డయాబెటిక్ న్యూరోపతి వస్తుంది. నరాలు సమస్యకు లోనవడం వల్ల స్పర్శ జ్ఞానం కూడా తగ్గుతుంది. ఇలాంటప్పుడు చిన్న పెద్ద తాకినా పెద్ద దెబ్బ అవుతుంది. డయాబెటిక్ న్యూరోపతి ఉన్నవాళ్లకు చర్మం పొడిబారిపోయి పెలుసులుగా పగిలిపోతుంది. ఇది కాస్తా పుండుగా మారుతుంది. దీన్నే డయాబెటిక్ ఫూట్ అంటారు. పుండు పెద్దదైనప్పుడు గ్యాంగ్రిన్‌గా మారుతుంది. సాధారణంగా మోకాలి కింది భాగంలోని కాలులోనే ఈ సమస్య ఎదురవుతుంది. డయాబెటిక్ ఫూట్ సమస్య ముందుగా వేలి నుంచి మొదలై పైకి వ్యాపిస్తుంది. డయాబెటిస్ ఉన్నవాళ్లలో రక్తప్రసరణ తక్కువగా ఉండడం వల్ల ఇన్‌ఫెక్షన్ వ్యాపించి కాలు తీసేయాల్సిన పరిస్థితి ఉంటుంది. డయాబెటిస్‌తో పాటు ఇలా పెరిఫెరల్ వాస్కులర్ డిసీజ్ ఉంటే ఇన్‌ఫెక్షన్ రిస్కు పెరుగుతుంది. అందుకే చిన్న పుండు పెద్దదై గ్యాంగ్రీన్ ఏర్పడుతుంది. దాంతో కాలు తీసేయాల్సిన పరిస్థితి ఎక్కువగా ఉంటుంది.

### లక్షణాలు

- నడుస్తుంటే నొప్పి ఉంటుంది. అందువల్ల నాలు గడుగులు వేసి మళ్లీ కాసేపు ఆగి, తరువాత నడుస్తుంటారు. ఇలా నడిస్తే నొప్పి రావడాన్ని క్లాడికేషన్ పెయిన్ అంటారు. వీళ్లకు రెస్ట్‌లో ఉంటే నొప్పి ఉండదు. నడిస్తేనే నొప్పి వస్తుంది. నడిచినప్పుడు కాళ్లకు రక్తసరఫరా పెరగాలి. కానీ రక్తప్రసరణ తక్కువగా ఉండడం వల్ల సరఫరా పెరుగదు. అందువల్ల నొప్పి వస్తుంది.
- దీని తరువాత దశలో నడవకుండా రెస్ట్‌లో ఉన్నప్పుడు కూడా నొప్పి వస్తుంది. దీన్ని రెస్ట్ పెయిన్ అంటారు.
- డిస్కలరేషన్. అంటే చర్మం రంగు మారడం. ముందుగా కాలి వేలు నల్లగా మారుతుంది. ఆ తరువాత పుండు కనిపిస్తుంది. దీన్ని గ్యాంగ్రిన్ అంటారు. ఈ రెండు వేలు నల్లగా మారడం, పుండు ఏర్పడడం ఒకటి తరువాత ఒకటి కనిపించొచ్చు. లేదా ఒకేసారి రెండు లక్షణాలూ ఉండొచ్చు.
- 30 నుంచి 40 శాతం డయాబెటిస్ పేషెంట్లలో రక్త ప్రసరణ తక్కువగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. డయాబెటిస్ వల్ల రక్తనాళాల్లో బ్లాక్స్ ఏర్పడేందుకు ఆస్కారం ఎక్కువ. అందుకే వాళ్లలో రక్తప్రసరణ తగ్గుతుంది.
- డయాబెటిస్ ఉన్నవాళ్లలో కాలు నొప్పి, మంటగా అనిపించడం, రెస్ట్ పెయిన్, చర్మం రంగు మారి కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను వాస్కులర్ స్పెషలిస్టును కలవాలి.



### చికిత్స

ముందు క్లినికల్ పరీక్షలు చేస్తారు. కాలిలో రక్తసరఫరాను తెలుసుకోవడానికి కాలికి కలర్ డాప్లర్ స్కాన్ చేస్తారు. ప్రెజర్ స్టడీస్ కూడా చేస్తారు. సమస్య తీవ్రంగా ఉంటే ఆంజియోగ్రామ్ చేసి తీవ్రతను బట్టి మందులా, సర్జరీయా అనేది నిర్ణయిస్తారు. రక్తనాళంలో ఏర్పడిన క్లాట్ చిన్నగా, పొడవు తక్కువగా ఉంటే స్టెంట్ వేస్తారు. పెద్దగా, పొడవుగా ఉంటే బైపాస్ సర్జరీ చేస్తారు. ఆలస్యం చేయకుండా వెంటనే చికిత్స చేస్తే కాలు తీసేయాల్సిన పరిస్థితి రాకుండా 60 శాతం వరకు నివారించవచ్చు. ఒక వేళ కాలు తీసేస్తే జీవితాంతం చికిత్సలో భాగంగా మందులు వాడాలి. ఇంకో కాలికి సమస్య రాకుండా ఫాలోఅప్, మెడిసిన్ తీసుకోవాలి.



## వెరికోస్ వీన్స్

ఎక్కువసేపు కూర్చోవడం లేదా నిల్చుని చేసే ఉద్యోగాల్లో ఉన్నవాళ్లకు వెరికోస్ వీన్స్ సమస్య వస్తుంది. ఐటి ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు, ట్రాఫిక్ పోలీసులు, టీచర్లు, సెక్యూరిటీ గార్డుల వంటి ఉద్యోగాల్లో ఉండేవాళ్లకు వెరికోస్ వీన్స్ వచ్చే అవకాశం ఎక్కువ.

### ఎందుకొస్తుంది?

సిరల్లో రక్తం గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా శరీరం కింది భాగం నుంచి పై భాగానికి ప్రయాణిస్తుంది. అందుకే రక్తం తిరిగి కిందికి రాకుండా ఉండడం కోసం సిరల్లో కొన్ని కవాటాలు ఉంటాయి. ఈ కవాటాలు డ్యామేజి అయినప్పుడు వెరికోస్ వీన్స్ సమస్య వస్తుంది. నిరంతరం నిల్చుని, కూర్చుని ఉండేవాళ్లలో ఇలాంటి రిస్కు ఉంటుంది. కొన్నిసార్లు ఈ సమస్య 10 శాతం మందిలో వంశపారంపర్య కారణాల వల్ల కూడా రావొచ్చు. 15 ఏళ్ల కన్నా చిన్నవయసు వాళ్లలో రావడం చాలా అరుదు.

### లక్షణాలు

- కాలు నొప్పి, కాలు వాచిపోతుంది.
- మజిల్ క్రాంప్స్. కండరం లాగినట్టుగా ఉంటుంది.
- చర్మంలో మార్పులు వస్తాయి. చర్మం కింద ఉండే రక్త నాళాలు బలహీనమై, ఉబ్బిపోతాయి. అందువల్ల అవి చర్మం పై నుంచి స్పష్టంగా కనిపిస్తాయి.


ఈ లక్షణాల్లో ఏదో ఒకటి ఉన్నా చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. దీర్ఘకాలిక నొప్పి, కాలి వాపు, రక్తనాళాలు పైకి కనిపించడం, చర్మంలో మార్పులు, పదే పదే పుండ్లు ఏర్పడి ఎంతకీ తగ్గకపోవడం లాంటి సమస్యల్లో ఏది ఉన్నా వెంటనే డాక్టర్‌ని కలవాలి. నొప్పి ఉన్నా లేకపోయినా డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి.

### చికిత్స ఏంటి?

వ్యాధి నిర్ధారణ కోసం ముందుగా క్లినికల్‌గా పరీక్ష చేస్తారు. తరువాత కలర్ డాప్లర్ స్కాన్ చేస్తారు. ఈ స్కాన్‌లో వ్యాధి ఏ దశలో ఉందో తెలుస్తుంది. తొలి దశలో ఉన్నప్పుడు మందులు ఇస్తారు. తరువాతి దశల్లో సర్జరీ, ఇతర చికిత్సలు అవసరం అవుతాయి. వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు సర్జరీ ద్వారా రక్తనాళాలను ఓపెన్ చేసి చెడిపోయిన కవాటాన్ని తొలగిస్తారు. ఓపెన్ సర్జరీ లేకుండా లేజర్ కాంతి పంపించి చెడిపోయిన కవాటం ఉన్నచోట రక్తనాళాన్ని మూసివేస్తారు. గ్లూ ఇంజెక్షన్ థెరపీ ద్వారా కూడా ఓపెన్ అయిన రక్తనాళాన్ని బ్లాక్ చేయడం ద్వారా మూసివేస్తారు. ఓపెన్ సర్జరీ అయితే రెండు మూడు రోజులు హాస్పిటల్‌లో ఉండాల్సి వస్తుంది. ఆపరేషన్ తరువాత రెండు వారాలు పూర్తిగా విశ్రాంతిగా ఉండాలి. ఈ ఆధునిక చికిత్సలు పూర్తిగా డే కేర్ ప్రొసిజర్లుగా చేస్తారు. ఇవి ఓపెన్ సర్జరీ కాదు కాబట్టి రక్తస్రావం ఎక్కువగా ఉండదు. వీటికి జనరల్ అనెస్తీషియా అవసరం లేదు. లోకల్ అనెస్తీషియా చాలు. కాబట్టి చికిత్స తరువాత వెంటనే ఇంటికి వెళ్లిపోవచ్చు. విశ్రాంతి కూడా అవసరం లేదు. కాకపోతే కాళ్ల మీద ఎక్కువ ఒత్తిడి పడకుండా చూసుకోవాలి. ఈ చికిత్సల ద్వారా వెరికోస్ వీన్స్‌ని పూర్తిగా నయం చేయవచ్చు. అయితే ఆ తరువాత జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ఎక్కువసేపు కూర్చోవడం గానీ, నిల్చోవడం గానీ చేయొద్దు. మధ్య మధ్యలో కాళ్లకు విశ్రాంతి ఇవ్వాలి. లేదా అటూ ఇటూ నడవాలి. పడుకునేటప్పుడు కాళ్ల దగ్గర దిండు పెట్టుకుని దానిమీద కాళ్లు ఉంచాలి. అంటే కాళ్లను కొంచెం పైకి పెట్టుకుంటే కాళ్లలో రక్తప్రసరణ బాగా జరుగుతుంది.

## డీప్ వీన్ థ్రాంబోసిస్

సిరల్లో రక్తం గడ్డలు (క్లాట్స్) ఏర్పడడాన్నే డీప్ వీన్ థ్రాంబోసిస్ లేదా డివిటి అంటారు. వయసు పెరిగిన వాళ్లకు, ఏదైనా సర్జరీ చేయించుకున్న తరువాత, రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు, క్యాన్సర్ పేషెంట్లలో ఇలాంటి సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. కొందరిలో చిన్న వయసులో కూడా డివిటి రావొచ్చు. ఇందుకు కారణం జన్యుపరమైనది. జన్యులోపం వల్ల రక్తంలోని క్లాటింగ్ ఫ్యాక్టర్లు (రక్తం గడ్డ కట్టడానికి ఉపయోగపడే కారకాలు) ఎక్కువగా ఉండడం వల్ల రక్తంలో గడ్డలు ఏర్పడే సమస్య ఉంటుంది. ఇలాంటివాళ్లలో కూడా డీప్ వీన్ థ్రాంబోసిస్ కనిపిస్తుంది.




### లక్షణాలు

ఆరోజు రాత్రి బాగానే ఉంటారు. తెల్లవారి లేచి చూసేసరికి కాలు అంతా వాచిపోయి కనిపిస్తుంది. వాపుతో పాటు నొప్పి ఉండొచ్చు.. ఉండకపోవచ్చు. సాధారణంగా మోకాలి కింద ఇలాంటి సమస్య వస్తుంది. అయితే కాలు మొత్తం లేదా చేతిలో కూడా ఇలా వాపు రావొచ్చు. ఇలా అకస్మాత్తుగా వాపు కనిపించినప్పుడు వెంటనే డాక్టర్‌ను కలవాలి. ఎందుకంటే కొన్నిసార్లు లోపల ఏర్పడిన గడ్డ (క్లాట్) హఠాత్తుగా చిట్లిపోవచ్చు. అలా బ్రేక్ అయిన గడ్డలు ఊపిరితిత్తులకు చేరి లంగ్ అటాక్ రావొచ్చు. దీన్నే లంగ్ ఎంబోలిజమ్ అంటారు. ఇది అత్యవసర పరిస్థితి. కాబట్టి ఈ సమస్యను అశ్రద్ధ చేయొద్దు. ఇలా సడెన్‌గా కనిపించే సమస్యను అక్యూట్ డివిటీగా పరిగణిస్తారు. అక్యూట్ డీప్ వీన్ థ్రాంబోసిస్‌ని నిర్లక్ష్యం చేస్తే క్రానిక్ డివిటికి దారితీస్తుంది. దీనివల్ల అల్సర్లు ఏర్పడుతాయి. ఈ పుండ్లు మానకుండా ఎక్కువ అవుతాయి. డివిటిని నిర్లక్ష్యం చేసిన వాళ్లలో కాలు వాపు, నొప్పితో పాటు ఇలా మానని పుండ్లు ఏర్పడితే ఆ స్థితిని పోస్ట్ థ్రాంబోటిక్ సిండ్రోమ్‌గా వ్యవహరిస్తారు.


### నిర్ధారణ

డివిటిని నిర్ధారణ చేయడానికి కలర్ డాప్లర్ స్కాన్ చేస్తారు. ఈ స్కాన్‌లో రక్తం గడ్డ ఎక్కువుందా, తక్కువుందా, ఏ స్థాయిలో ఉందనేది తెలుస్తుంది. క్లాట్ ఎక్కువగా ఉంటే థ్రాంబోలైసిస్ చేస్తారు. తీవ్రత తక్కువగా ఉంటే యాంటి కోయాగ్యులెంట్ (రక్తాన్ని పలుచబరిచే మందులు) ఇంజెక్షన్లు, టాబ్లెట్లు ఇస్తారు. చికిత్స కొంచెం కష్టమైనప్పటికీ సమస్యను ఎంత తొందరగా గుర్తించి చికిత్స చేస్తే ఫలితం అంత బాగుంటుంది. మెడికల్ ట్రీట్‌మెంట్ ఇస్తూ, వీనోగ్రామ్ ద్వారా డీప్ వీన్ స్టెంటింగ్ చేస్తారు. అంటే గుండె రక్తనాళంలో బ్లాక్స్ ఏర్పడినప్పుడు స్టెంట్ వేసి సరిచేసినట్టుగా, కాలి రక్తనాళంలో ఏర్పడిన క్లాట్‌ను తొలగించడానికి కూడా స్టెంట్ వేస్తారు. దీన్నే వీనోగ్రామ్ అంటారు.

**డాక్టర్ డి. ప్రభాకర్**
సీనియర్ వాస్క్యులర్ & ఎండో-వాస్క్యులర్ సర్జన్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ 8121022333



**డాక్టర్ భవిన్ రామ్**
సీనియర్ వాస్క్యులర్ & ఎండో-వాస్క్యులర్ సర్జన్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ 8121022333



# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐసర్)లలో యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

## కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 58
- **పోస్టులవారీగా ఖాళీలు:** సేఫ్టీ అసిస్టెంట్-24, ఫైర్‌మెన్-34.
- **అర్హతలు:** పదోతరగతి, డిప్లొమా ఉత్తీర్ణత, ఫైర్ సేఫ్టీలో సర్టిఫికెట్, అనుభవం.
- **వయస్సు:** 2020, ఏప్రిల్ 2 నాటికి 30 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ ప్రాక్టికల్/ ఫిజికల్ టెస్ట్ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 2
- **వెబ్‌సైట్:** http://www.cochinshipyard.com

## ఐసర్‌లో బీఎస్-ఎంఎస్

- **కోర్సులు:** బీఎస్ - నాలుగేండ్లు, బీఎస్-ఎంఎస్ - ఐదేండ్లు
- **ఐసర్ క్యాంపస్‌లు:** దేశంలో ఏడు ఐసర్‌లు ఉన్నాయి. అవి.. భోపాల్, కోల్‌కతా, బెర్హంపూర్, మొహాలీ, పుణె, తిరువనంతపురం, తిరుపతి.
- **అర్హతలు:** 2019/ 2020లో సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత.



- **ప్రవేశాలు కల్పించే విధానం:** మూడు పద్ధతుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. అవి.. స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డ్ చానెల్ (ఎస్‌సీబీ), కేవీపీవై, జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంక్.
- ప్రస్తుతం స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డ్స్ చానల్ దరఖాస్తులకు ప్రకటన విడుదలైంది. ఆయా రాష్ట్రాలకు నిర్ణయించే కటాఫ్ మార్కులు వచ్చి ఉండాలి. గతేడాది తెలంగాణ ఇంటర్ బోర్డు పరిధిలో చదివిన జనరల్ అభ్యర్థులకు 500 మార్కులకు 468 కటాఫ్‌గా నిర్ణయించారు. ఈ ఏడాది కటాఫ్ మార్కులు త్వరలో ఐసర్ ప్రకటిస్తుంది.
- **ఎంపిక:** ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా
- **పరీక్షతేది:** మే 31
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** http://www.iiseradmission.in

## ఐఐఎంలో

షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టులు:** అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (అకడమిక్స్), ఏవో (వెబ్ ఎనేబుల్డ్ ఎడ్యుకేషన్ అండ్ అవుట్‌రీచ్ (ప్రోగ్రామ్), ఏవో (ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్), సెక్యూరిటీ ఆఫీసర్.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 2
- **వెబ్‌సైట్:** www.iimshillong.ac.in

## ఎన్‌హెచ్ఐడీసీఎల్‌లో మేనేజర్లు

న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టులవారీగా ఖాళీలు:** జనరల్ మేనేజర్-10, డిప్యూటీ జనరల్ మేనేజర్-10, డీజీఎం (ఫైనాన్స్)-1, మేనేజర్ (ఫైనాన్స్)-5, డిప్యూటీ మేనేజర్ (హెచ్‌ఆర్/అడ్మిన్)-1 ఖాళీ ఉన్నాయి. అర్హతలు, ఎంపిక విధానం, అనుభవం, తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.nhidcl.com

నమస్తే తెలంగాణ
ఆట
12
[ కరీంనగర్ ]
మంగళవారం 24 మార్చి 2020
WWW.NTNEWS.COM

# స్వీయ నిర్బంధమా.. కారాగారమా?

## ప్రజలే తేల్చుకోవాలన్న గౌతమ్ గంభీర్



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం ఇండ్లకే పరిమితమవ్వండని సూచించినా.. యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నవారిపై మాజీ క్రికెటర్, ప్రస్తుత ఎంపీ గౌతమ్ గంభీర్ అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటి వారి వల్ల మహమ్మారి మరింత ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలాంటి వారు క్షేమంగా ఇండ్లలో ఉండాలనుకుంటున్నారా.. లేక జైళ్లకు వెళ్లాలనుకుంటున్నారా తేల్చుకోవాలని అన్నాడు. కొవిడ్-19 పోరాటంలో యావత్ దేశం లాక్‌డౌన్ పాటిస్తుంటే.. కొంత మంది మాత్రం వారి శ్రమకు ఫలితం దక్కకుండా చేస్తున్నారన్నాడు. 'మీరూ పోతారు, మీతో పాటు కుటుంబ సభ్యులను కూడా పట్టుకుపోతారు (ఖుద్ భీ జాయేంగే.. ఔర్ సాత్ మే పరివార్‌కో భీ లేకే జాయేంగే). స్వీయ నిర్బంధమా.. కారాగారమా తేల్చుకోండి?' అని ట్విట్టర్ వేదికగా పేర్కొన్నాడు. 'సమాజానికి చేటు చేయకండి. దేశమంతా వైరస్‌కు ఎదురొడ్డి పోరాడుతుంటే.. లాక్‌డౌన్ నిబంధనలను అతిక్రమించడం సరైంది కాదు' అని గంభీర్ వాపోయాడు.

### వైద్య పరికరాల కోసం రూ.50 లక్షలు

మహమ్మారి నుంచి నగరాన్ని కాపాడుకునేందుకు అవసరమైన వైద్య పరికరాలు కొనేందుకు ఎంపీ నిధుల నుంచి రూ. 50 లక్షలు ఇస్తున్నట్లు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు గంభీర్ లేఖ రాశాడు. 'కొవిడ్-19 నుంచి పౌరులను కాపాడటానికి అవసరమైన వైద్య పరికరాలు కొనేందుకు ఎంపీ నిధుల్లోనుంచి రూ. 50 లక్షలు కేటాయించాలనుకుంటున్నా' అని లేఖలో పేర్కొన్నాడు.

# కరోనాపై పోరుకు ఆర్నెళ్ల జీతం విరాళం

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌పై జరుగుతున్న పోరాటానికి భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పునియా ఆరునెలల వేతనాన్ని విరాళంగా ఇచ్చాడు. కొవిడ్-19 విజృంభిస్తున్న తరుణంలో టోక్యో ఒలింపిక్స్ నిర్వహించడం సబబుకాదని.. విశ్వక్రీడలను వాయిదా వేయడమే మంచిదని అతడు పేర్కొన్నాడు. 'నా ఆర్నెళ్ల జీతాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నా' అని బజరంగ్ సోమవారం ట్విట్టర్ వేదికగా తెలిపాడు. దీనిపై స్పందించిన కేంద్ర క్రీడా శాఖ మంత్రి కిరణ్ రిజిజు.. స్టార్ రెజ్లర్‌ను అభినందించారు. 'ఒలింపిక్స్ కంటే ముందు మనం కరోనా వైరస్‌తో పోరాడాల్సిన అవసరం ఉంది. ఇంకొద్ది రోజులు ఇలాంటి పరిస్థితులే కొనసాగితే.. ఒలింపిక్స్‌ను వాయిదా వేయడమే ఉత్తమం. ఇప్పటికే విశ్వక్రీడల్లో పాల్గొనకూడదని చాలా దేశాలు నిర్ణయించుకున్నాయి. ఆస్ట్రేలియా, కెనడా తమ అథ్లెట్లను టోక్యోకు పంపకూడదని తీర్మానించుకున్నాయి. కొవిడ్-19 ప్రస్తుతం ప్రపంచ సమస్య. ముందు దాన్నుంచి బయటపడాలి' అని బజరంగ్ ట్విట్టర్ ద్వారా తెలిపాడు.


బజరంగ్

# నేనెదుర్కొన్న దారుణ వైరస్ ఇది


వాండర్

**జొహాన్నెస్‌బర్గ్:** కరోనా వైరస్‌ను దీటుగా ఎదుర్కొనేది యువత మాత్రమే అనుకున్నాం. ఈ విషయం డాక్టర్లు కూడా చెబుతున్నారు. విశ్వమారి కరోనా బారిన పడ్డ యువత తగిన జాగ్రత్తలు తీసుకుంటే త్వరగానే కోలుకుంటారని అనేక అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి. అందులో యువ క్రీడాకారుడైతే ఇట్టే అధిగమిస్తాడని కొందరు అనుకునే అవకాశముంది. అయితే అలాంటి అలసత్వం అసలు పనికిరాదని దక్షిణాఫ్రికా ప్రముఖ స్విమ్మర్ కామెరాన్ వాండర్‌బర్గ్ అంటున్నాడు. రియో(2016) ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన వాండర్ ఇటీవలే ప్రమాదకర కరోనా వైరస్ బారిన పడ్డాడు. ఇప్పుడిప్పుడే వైరస్ నుంచి కోలుకుంటున్న ఈ స్టార్ స్విమ్మర్ తన అనుభవాలను సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా పంచుకున్నాడు. 'గత పద్నాలుగు రోజులుగా నేను కరోనాతో పోరాడుతున్నాను. మొదట్లో తీవ్రమైన జ్వరం తీవ్రంగా వేధించింది. శారీరక అలసట మాత్రం నన్ను తీవ్రంగా వేధిస్తున్నది. కొద్ది దూరం నడిచినా ఆయాసం వస్తున్నది. నా వయసు 31..నేనెప్పుడు ధూమపానం జోలికి పోలేదు. అయినా వైరస్ తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఇంత దారుణమైన వైరస్‌ను నేను ఎప్పుడూ ఎదుర్కొలేదు' అని వాండర్ అన్నాడు.



# విశ్వక్రీడలు వాయిదా!

### నాలుగు వారాల్లో ఐవోసీ తుది నిర్ణయం

### ఒలింపిక్స్‌ను బహిష్కరించిన కెనడా, ఆస్ట్రేలియా

### అథ్లెట్లను పంపకూడదని నిర్ణయం.. ఏడాది వాయిదా వేయాలని డిమాండ్

**టోక్యో ఒలింపిక్స్‌పై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. కరోనా కరాళ నృత్యంతో ప్రపంచమంతా గజగజ వణుకుతున్న వేళ.. విశ్వక్రీడలు వాయిదా పడటం ఖాయంగా కనిపిస్తున్నది. కొవిడ్-19 వైరస్ నానాటికీ తీవ్రరూపం దాలుస్తుండటంతో ఆయా దేశాల క్రీడాసంఘాలతో పాటు అథ్లెట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలను పణంగా పెట్టి ఒలింపిక్స్‌లో పాల్గొనలేమంటూ గళాలు లేవనెత్తుతున్నారు. తమ ఆటగాళ్ల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకున్న కెనడా ఓ అడుగు ముందుకేసి టోక్యో ఒలింపిక్స్‌లో తాము పాల్గొనడం లేదంటూ ప్రకటించింది. కెనడా నిర్ణయంతో పలు దేశాలు పునరాలోచనలో పడ్డాయి. ఆస్ట్రేలియా కూడా తమ అథ్లెట్లను వచ్చే ఏడాది కోసం సిద్ధమవ్వాలంటూ సూచించడం కరోనా ప్రభావం ఎంతలా ఉందో తెలుపుతున్నది. జపాన్ ప్రధాని షింజో అబె..ఒలింపిక్స్ వాయిదా తప్పదనేలా వ్యాఖ్యలు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఇక ఇంతకాలం షెడ్యూల్ ప్రకారం విశ్వక్రీడలను నిర్వహిస్తామన్న అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య(ఐవోసీ) అందరి ఒత్తిడితో మెత్తబడింది. నాలుగు వారాల్లో తుది నిర్ణయం తీసుకుంటామని, వాయిదా గురించే తప్ప రద్దు అవకాశం లేదని తేల్చిచెప్పింది.**

**టోక్యో:** ఈ ఏడాది జూలైలో ప్రారంభం కావాల్సిన టోక్యో ఒలింపిక్స్ వాయిదా దిశగా పయనిస్తున్నది. కరోనా వైరస్(కొవిడ్-19) మహమ్మారి విజృంభిస్తున్నందున విశ్వక్రీడలను వాయిదా వేయాలని ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పలు క్రీడా సంఘాలు కోరుతుండగా.. ఒలింపిక్స్‌లో పాల్గొనకూడదని కెనడా సోమవారం నిర్ణయం తీసుకుంది. కరోనా సంక్షోభం కారణంగా తమ అథ్లెట్లను విశ్వక్రీడలకు పంపలేమని స్పష్టం చేసింది. ఏడాది పాటు వాయిదా వేయాలని కూడా అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ)ని కోరింది. 2021 కోసం సిద్ధమవ్వాలని అథ్లెట్లుకు ఆస్ట్రేలియా ఒలింపిక్స్ కమిటీ(ఏవోసీ) సూచించింది. ఈ నేపథ్యంలో అన్ని సభ్య దేశాలు, క్రీడా సమాఖ్యలు, ప్రసారదారులు, స్పాన్సర్లతో మాట్లాడి రానున్న 4వారాల్లోగా తుది నిర్ణయం తీసుకోనున్నట్టు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) ప్రకటించింది.

### అథ్లెట్లను పంపలేం: కెనడా

కరోనా వైరస్ విజృంభిస్తున్నందున ఒలింపిక్స్‌తో పాటు పారాలింపిక్స్‌కు అథ్లెట్లను పంపడం కష్టతరమని కెనడా ఒలింపిక్ కమిటీ(సీవోసీ) వెల్లడించింది. అందుకే షెడ్యూల్ ప్రకారం విశ్వక్రీడలు నిర్వహిస్తే దూరంగా ఉండేందుకు నిర్ణయించుకున్నట్టు తెలిపింది. అలాగే, ఒలింపిక్స్‌ను ఏడాది పాటు వాయిదా వేయాలని ఐవోసీని కోరింది. 'కరోనా వైరస్ సంక్షోభం మా అథ్లెట్లకు సురక్షితం కాదు. వారు శిక్షణ కొనసాగించడం అథ్లెట్ల ఆరోగ్యంతో పాటు వారి కుటుంబాలకు, కెనడా ప్రజలకు ప్రమాదమే' అని సీవోసీ చెప్పింది.

### 2021కి సిద్ధమవండి: ఆస్ట్రేలియా

జూలైలో ఒలింపిక్స్ ప్రారంభమయ్యే పరిస్థితి లేదని, అందుకే వచ్చే ఏడాది కోసం సన్నద్ధమవ్వాలని అథ్లెట్లకు ఆస్ట్రేలియా ఒలింపిక్ కమిటీ(ఏవోసీ) సూచించింది. 'క్రీడలు జూలైలో నిర్వహించే పరిస్థితి లేదని స్పష్టమవుతున్నది. మా అథ్లెట్లు సానుకూల దృక్పథంతో శిక్షణ తీసుకుంటున్నారు. కానీ కరోనా వల్ల ఒత్తిడి అనిశ్చితితో కూడిన పరిస్థితులు వారికి సవాల్‌గా మారాయి. దేశంలోనూ విదేశాల్లోనూ ఎక్కువ మంది ఒకే చోటికి చేరే పరిస్థితి లేదు. అందుకే వచ్చే ఏడాది కోసం సన్నద్ధమవ్వాలని అథ్లెట్లకు సూచించాం' అని ఏవోసీ చీఫ్ ఇయాన్ చెస్టర్‌మాన్ చెప్పాడు.

### ఐవోసీది మొండి వైఖరి : కాలమ్ స్కిన్నర్

కరోనా తీవ్రస్థాయిలో కోరలు చాస్తున్నా.. తుది నిర్ణయానికి మరో నాలుగు వారాలు అవసరమన్న ఐవోసీ ప్రకటనపై బ్రిటన్ ట్రాక్ సైక్లిస్ట్ కాలమ్ స్కిన్నర్ మండిపడ్డాడు. ఐవోసీ అధ్యక్షుడు థామస్ బాచ్ మొండిగా ప్రవర్తిస్తున్నారంటూ విమర్శించాడు. 'ఐవోసీ అధ్యక్షుడు థామస్‌బాచ్ ఒలింపిక్స్‌ను బలహీనపరిచేందుకు మొండిగా వ్యవహరిస్తున్నారు. తన అభిప్రాయాలను ఆయన అథ్లెట్లకు ఆపాదించడం ఇది మొదటిసారి కాదు. ఎలాగు ఒలింపిక్స్ వాయిదా పడడం ఖాయం గా కనిపిస్తున్నది' అని స్కిన్నర్ ట్వీట్ చేశాడు. 2016 ఒలింపిక్స్‌లో స్కిన్నర్ స్వర్ణంతో పాటు ఓ రజతాన్ని చేజిక్కించుకున్నాడు.


షింజో అబే

### ఆలస్యం.. అనివార్యం కావొచ్చు

కరోనా వైరస్ తీవ్ర రూపం దాలుస్తున్న నేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్ వాయిదా అనివార్యం కావొచ్చని జపాన్ ప్రధాని షింజో అబే చెప్పారు. సోమవారం జపాన్ పార్లమెంట్‌లో విశ్వక్రీడల నిర్వహణపై ఆయన మాట్లాడారు. 'ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు జపాన్ పూర్తి నిబద్ధతతో ఉంది. కానీ, ఒకవేళ ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే ఆలస్యంగా నిర్వహించడం అనివార్యమవుతుంది. అందుకే వాయిదా వేయాల్సిన నిర్ణయం తీసుకోవాల్సి రావొచ్చు. అయితే రద్దు చేయడం ఆప్షనే కాదు' అని అబే చెప్పారు.



### వాయిదాపై ఆలోచన.. రద్దు సమస్యే లేదు

షెడ్యూల్ ప్రకారమే ఒలింపిక్స్‌ను నిర్వహిస్తామని ఇంతకాలం చెబుతూ వస్తున్న అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ).. నలువైపులా ఒత్తిడి పెరుగడంతో వాయిదా కూడా ఒక ఆప్షన్‌గా పరిశీలిస్తున్నామని సోమవారం ప్రకటించింది. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఒలింపిక్స్‌ను రద్దు చేసే ఆలోచనే లేదని స్పష్టం చేసింది. ఒలింపిక్స్ నిర్వహణపై నాలుగు వారాల్లో తుది నిర్ణయం తీసుకోనున్నట్టు ఐవోసీ అధ్యక్షుడు థామస్ బాచ్.. ఓ లేఖ ద్వారా అథ్లెట్లకు సోమవారం తెలియజేశారు. సభ్య దేశాలు, జపాన్ ప్రభుత్వం, అంతర్జాతీయ క్రీడా సమాఖ్యల అధికారులు, బ్రాడ్‌కాస్టర్లు, స్పాన్సర్లతో చర్చించి ఈ నాలుగు వారాల్లో ఏదో ఒక నిర్ణయానికి రావాలని ఐవోసీ భావిస్తున్నది. మరోవైపు ఒలింపిక్స్‌ను వాయిదా వేయాల్సిందేనని అంతర్జాతీయ అథ్లెటిక్స్ చీఫ్ సెబాస్టియన్ కోయ్.. ఐవోసీకి మరోసారి సూచించాడు. అలాగే, కరోనా ప్రభావం ముగిసే వరకు ఒలింపిక్స్‌ను నిర్వహించవద్దని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య(బీడబ్ల్యూఎఫ్)సైతం విన్నవించింది. కరోనా నేపథ్యంలో స్వదేశంలో ఒలింపిక్స్ జరగకూడదని జపాన్‌లో అధిక శాతం ప్రజలు కోరుకుంటున్నారని తాజాగా మరో సర్వే తేల్చింది.

కరోనా ఖేల్

# పఠాన్ బ్రదర్స్ మాస్క్‌ల పంపిణీ



**వడోదర:** కొవిడ్-19ను అరికట్టేందుకు జరుగుతున్న చర్యల్లో.. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్లు ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్ పాలు పంచుకున్నారు. మహమ్మారి నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన 4 వేల మాస్క్‌లను వడోదర ఆరోగ్య శాఖకు అందించారు. ఈ అంశాన్ని సోమవారం ఇర్ఫాన్ ట్విట్టర్ వేదికగా పంచుకున్నాడు. 'సమాజానికి మా వంతు సాయం చేయాలనుకున్నాం. అందుకే మాస్క్‌ల పంపిణీ చేశాం. ప్రతి ఒక్కరు తమ పరిధిలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి. కాకపోతే జనం పోగవకుండా చూసుకోండి' అని ఇర్ఫాన్ పేర్కొన్నాడు.

# లంక క్రికెట్ బోర్డు సాయం

### కరోనాను అరికట్టేందుకు 25 మిలియన్ల విరాళం

**కొలంబో:** కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్‌ఎల్‌సీ) ముందుకొచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వానికి చేదోడువాదోడుగా నిలువాలనుకున్న బోర్డు.. 25 మిలియన్ (భారత కరెన్సీలో 1.02 కోట్లు) రూపాయలను లంక ప్రభుత్వానికి అందించనుంది. 'కొవిడ్-19 విజృంభిస్తున్న తరుణంలో ప్రభుత్వానికి అండగా నిలువాలనుకుంటున్నాం. అందుకే ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చాం. దీంతో పాటు మావల్ల అయ్యే ప్రతి సాయం చేస్తాం. సామాజిక మాధ్యమాల ద్వారా మా ఆటగాళ్లు ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. ఇప్పటికే దేశవాళీ టోర్నీలన్నీ రద్దు చేశాం. విపత్కర పరిస్థితుల్లో అంతా ఏకతాటిపై నిల్చొని మహమ్మారిని పారదోలాల్సిన అవసరం ఉంది' అని ఎస్‌ఎల్‌సీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

# స్వీయ నిర్బంధంలో సంగక్కర



**కొలంబో:** శ్రీలంక బ్యాటింగ్ దిగ్గజం కుమార సంగక్కర స్వీయ నిర్బంధంలోకి వెళ్లాడు. కరోనా మహమ్మారి కోరలు చాస్తుండటంతో ప్రభుత్వ మార్గనిర్దేశాల ప్రకారం ఇంటికే పరిమితమైనట్లు సోమవారం వెల్లడించాడు. 'కొవిడ్-19 లక్షణాలు లేకపోయినా.. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నా. వారం రోజుల క్రితం లండన్ నుంచి వచ్చా. మార్చి 1 నుంచి 15 మధ్య విదేశాల నుంచి వచ్చినవారు భద్రతా సిబ్బంది వద్ద పేరు నమోదు చేసుకొని నిర్బంధంలోకి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకే ప్రజాహితం కోసం మార్గదర్శకాలను పాటిస్తున్నా'అని సంగక్కర తెలిపాడు. కరోనా ప్రబలుతున్న నేపథ్యంలో సంగక్కరతో పాటు మరో మాజీ కెప్టెన్ మహేల జయవర్ధనే సోషల్ మీడియా ద్వారా 'క్లిష్ట కాలంలో ప్రజలంతా సామాజిక దూరం పాటించాలి' అని విజ్ఞప్తి చేశాడు.

### 'రియో' రైనా.. వచ్చేశాడోచ్..



భారత సీనియర్ క్రికెటర్ సురేశ్ రైనా భార్య ప్రియాంక సోమవారం పండంటి బాబుకు జన్మనిచ్చింది. 'కొడుకుకు స్వాగతం పలుకుతున్నాం, గ్రేసియాకు చిన్న తమ్ముడు రియో రైనా వచ్చేశాడు' అంటూ సురేశ్ రైనా ఫొటోతో పాటు ట్వీట్ చేశాడు.

# అథ్లెట్ల క్షేమమే ముఖ్యం


నరీందర్ బాత్రా

**న్యూఢిల్లీ:** అథ్లెట్ల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ లేదని భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ) అధ్యక్షుడు నరీందర్ బాత్రా స్పష్టం చేశారు. కరోనా నేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్ గురించి క్రీడా మంత్రిత్వ శాఖతో పాటు భారత క్రీడాప్రాధికార సంస్థ, ఐవోసీ, జాతీయ ఫెడరేషన్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని తెలిపారు. 'అన్ని జాతీయ ఒలింపిక్ కమిటీలు అథ్లెట్ల సన్నద్ధత, ఆరోగ్యంపై ఐవోసీకి ఈవారంలో తెలియజేయాలి. ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు అథ్లెట్ల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ఐవోఏ ఆందోళనగా ఉంది. ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదు' అని బాత్రా తెలిపారు. అయితే ప్రస్తుతానికి ఏ నిర్ణయం తీసుకోలేదని, ఐవోసీ తుది ప్రకటన కోసం వేచిచూస్తామన్నారు. ప్రస్తుతానికి విశ్వక్రీడల బహిష్కరణ ఆలోచనే లేదని స్పష్టం చేశారు.

టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనాలా లేదా అనే నిర్ణయాన్ని మరో నెల రోజుల్లో తీసుకోనున్నట్టు భారత ఒలింపిక్ సంఘం ప్రకటించింది. నాలుగైదు వారాల పాటు వేచిచూసి, పరిస్థితిని సమీక్షిస్తామని సోమవారం స్పష్టం చేసింది. వేరే దేశాలతో పోలిస్తే భారత్‌లో కరోనా వైరస్ తీవ్రత కాస్త తక్కువగానే ఉందని, అందుకే వేచిచూసేందుకే మొగ్గు చూపుతున్నామని ఐవోఏ సెక్రటరీ జనరల్ రాజీవ్ మెహతా సోమవారం ప్రకటించాడు. ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన భారత అథ్లెట్ల ఆరోగ్యం, సన్నద్ధత అంశాలను ఐవోసీ కోరిందని తెలిపాడు.

### బహిష్కరణ దిశగా బ్రిటన్..!

బ్రిటన్ కూడా కెనడా, ఆస్ట్రేలియా బాట పట్టేలా ఉంది. కరోనా వైరస్ తీవ్రంగా ఉన్నా టోక్యో ఒలింపిక్స్‌ను వాయిదా వేయకపోతే క్రీడలను బహిష్కరిస్తామని బ్రిటీష్ ఒలింపిక్ సంఘం(బీవోఏ) అధ్యక్షుడు హ్యూ రాబర్ట్‌సన్ సోమవారం చెప్పాడు. ఈ విషయాన్ని ఐఓసీకి చెప్పినట్టు వెల్లడించాడు.

# అజర్‌బైజాన్ గ్రాండ్ ప్రి వాయిదా



**బాకు (అజర్‌బైజాన్):** ఫార్ములావన్ సీజన్‌పై కూడా కరోనా వైరస్ ప్రభావం కొనసాగుతున్నది. సోమవారం నుంచి ప్రారంభం కావాల్సిన అజర్‌బైజాన్ గ్రాండ్ ప్రి.. కొవిడ్-19 కారణంగా వాయిదా పడింది. ఇప్పటికే ఈ ఏడాది జరుగాల్సిన ఎనిమిది రేసులు మహమ్మారి కారణంగా రద్దైన విషయం తెలిసిందే. 'బాకు సిటీ సర్క్యూట్‌లో జరుగాల్సిన రేస్ రద్దైంది. ప్రస్తుతానికి జూన్ 7న తిరిగి నిర్వహించాలనుకుంటున్నాం. అప్పటి వరకు పరిస్థితుల్లో మార్పు వస్తేనే రేస్ జరుగుతుంది. ఏదేమైనా మహమ్మారి వ్యాప్తిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉంది' అని రేస్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఈ యేడు ఐపీఎల్ కష్టమే!

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్ ప్రారంభంపై ఇప్పుడప్పుడే స్పష్టత వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ప్రస్తుతానికి రెండు వారాలు వాయిదా పడ్డ లీగ్.. మే తొలి వారంలో గనుక ప్రారంభం కాకపోతే ఇక ఏడాది జరుగడం కష్టమే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ మహమ్మారి విజృంభిస్తుండటంతో అన్ని స్పోర్ట్స్ ఈవెంట్స్ రద్దైన విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశంలో కరోనా ప్రభావం అంతకంతకూ పెరుగుతుండటంతో.. లీగ్ నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 'ఏప్రిల్ చివరి వరకు వేచి చూడాలనుకుంటున్నాం. మే తొలి వారంలో 13వ సీజన్ ప్రారంభం కాకపోతే.. ఇక ఈ ఏడాది లీగ్ నిర్వహించడం కష్టమే' అని బీసీసీఐ అధికారొకరు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో ఎక్కడికంటే అక్కడికి స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు.

# దాదాకు మినహాయింపునివ్వండి

### కూలింగ్ పీరియడ్ అంశంపై ఆదిత్య వర్మ

**న్యూఢిల్లీ:** జస్టిస్ ఆర్‌ఎమ్ లోధా కమిటీ సిఫార్సు చేసిన కూలింగ్ పీరియడ్ నుంచి బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీకి మినహాయింపు ఇవ్వాలని.. ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ విషయంలో తొలి పిటీషన్ దాఖలు చేసిన ఆదిత్య వర్మ సుప్రీంకోర్టును కోరనున్నారు. దాదా లాంటి దమ్మున్న నాయకుడు పూర్తికాలం సేవలందించకపోవడం సరైంది కాదని భావించే పిల్ వేయనున్నట్లు ఆదిత్య వర్మ పేర్కొన్నారు. 'బీసీసీఐ నిబంధనలు మార్చాలని కోరిన నేనే.. సౌరవ్ గంగూలీ విషయంలో మినహాయింపు నివ్వాలని అడుగుతున్నా. దాదా ప్యానల్ మూడేండ్ల పాటు పదవిలో ఉంటే.. క్రికెట్‌కు మేలు జరుగుతుందని భావించే ఈ నిర్ణయానికి వచ్చా' అని ఆయన అన్నారు.

